www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఎర్రని జాబిల్లి..

భూమి చాటుకు చంద్రుడు
కనువిందు చేసిన సంపూర్ణ చంద్ర గ్రహణం
రాత్రి 9.56 గంటలకు మొదలై
అర్ధరాత్రి 1.26 గంటలకు పూర్తి 13
రాష్ట్రంలోని ఆలయాల మూసివేత


హైదరాబాద్‌లో కనువిందు చేసిన బ్లడ్‌మూన్

సోమవారం | 8-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 161 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా.9.12 తదుపరి విదియ; నక్షత్రం: పూర్వాభాద్ర రా.8.03 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: తె.4.52 మొదలు, దుర్ముహూర్తం: మ.12.37-1.26, మ.3.03-3.52; అమృతఘడియలు: మ.12.35-2.05; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.19

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రోజు కూలీగా వెళ్లి.. గుట్టురట్టు చేసి..

● డ్రగ్స్‌పై యుద్ధం


డ్రగ్స్ తయారీ సామగ్రిని తరలిస్తున్న మహారాష్ట్ర పోలీసులు

- చర్లపల్లి డ్రగ్స్ కేసులో కానిస్టేబుల్ డెకాయ్ ఆపరేషన్
- నెల రోజులు కష్టపడ్డ మహారాష్ట్ర పోలీసులు
- డ్రగ్స్ తయారీపై నిర్ధారణ జరిగాకే దాడులు
- మెఫిడ్రిన్ తయారీలో శ్రీనివాస్ జాగ్రత్తలెన్నో!
- రవాణా లింకుపై ముంబై పోలీసుల ఆరా
- అరెస్టయిన తానాజీ ఓ కెమికల్ ఎక్స్‌పర్ట్
- వెల్లడించిన వాసాయ్ విరార్ పోలీసులు

హైదరాబాద్/సిటీ/కుషాయిగూడ/రాంనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి పారిశ్రామిక వాడలో వాగ్దేవీ ల్యాబ్ పేరిట మెఫిడ్రిన్ డ్రగ్స్ తయారు చేస్తున్న కంపెనీపై దాడులు చేసిన మహారాష్ట్ర పోలీసులు.. మాదక ద్రవ్యాల దందా గుట్టు రట్టు చేయడానికి నెల రోజులపాటు శ్రమించారు. డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా ఓ

మిగతా 3వ పేజీలో...

ఏ క్షణమైనా వెనెజువెలాపై దాడి?


- డ్రగ్స్ ముఠాలను అంతం చేసేందుకేనంటున్న ట్రంప్
- కరీబియన్ సముద్రంలో యుద్ధనౌకల మోహరింపు
- ప్యూర్టోరికో ఎయిర్‌బేస్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు
- హింసతో అధికార మార్పిడికి అమెరికా యత్నం
- వెనెజువెలా అధ్యక్షుడు మాద్యురో ఆరోపణ
- అమెరికా దాడి చేస్తే సాయుధ పోరు తప్పదని హెచ్చరిక


● డ్రగ్స్ పేరిట యుద్ధం



వాషింగ్టన్, సెప్టెంబరు 7: కరీబియన్ సముద్రంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త యుద్ధానికి తెరతీస్తున్నారు. డ్రగ్స్ ముఠాలను అంతం చేసేందుకంటూ వెనెజువెలాపై దాడులకు సిద్ధమవుతున్నారు. కరీబియన్ సముద్రంలో భారీగా యుద్ధ నౌకలు, జలాంతర్గాములు,

మిగతా 2వ పేజీలో...





టీ-ఫైబర్ కనెక్షన్ తీసుకున్న తరువాత టీవీ స్క్రీన్‌పై ఇలా వస్తుంది

టీ-ఫైబర్‌లో అందించే గూగుల్ సర్వీసులు

అల్లావుద్దీన్.. అద్భుత పెట్టె

టీ-ఫైబర్ కనెక్షన్‌తో సేవలన్నీ నట్టింట్లోకే!

- కంప్యూటర్‌గా మారనున్న టీవీ.. ఇంట్లోనే హోంవర్కులు
- టీ-శాట్‌కు అనుసంధానంతో ఇంట్లో నుంచే నేరుగా పాఠాలు వినే అవకాశం.. స్కూళ్లలో ఏఐ పాఠాల బోధన
- పథకాల లబ్ధిదారులతో సీఎం నేరుగా మాట్లాడే ఏర్పాట్లు
- నెట్, టీవీచానళ్లు, ఓటీటీలు.. ఫోన్‌లాగా పనిచేసే రిమోట్
- ఒక టీవీ, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్‌లకు లాగిన్ చాన్స్
- 42వేల కి.మీ. మేర భూగర్భ వైర్లు.. 35వేల మందికి శిక్షణ
- త్వరలో రానున్న టీ-ఫైబర్‌పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

'అరేబియన్ నైట్స్' కథల్లో 'అల్లావుద్దీన్ అద్భుత దీపం' గురించి వినే ఉంటారు! ఏది అడిగితే అదిచ్చే జీనీ భూతం అందులో ఉంటుంది. ఆ దీపంలా మనకు కావాల్సిందల్లా ఇవ్వదుగానీ.. ప్రభుత్వం అందుబాటులోకి తెస్తున్న టీ-ఫైబర్ కనెక్షన్ అత్యాధునిక టెక్నాలజీని నట్టింట్లోకే తీసుకొస్తుంది. ఇంటర్నెట్, టీవీ చానళ్లు, ఓటీటీలు, ఆన్‌లైన్ పాఠాలు.. ఒక్కటనేమిటి.. ఉపయోగించుకున్నవారికి ఉపయోగించుకున్నంత!!

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మీ ఇంట్లో ఉన్న టీవీనే కంప్యూటర్ అయితే? దానికే ఇంటర్‌నెట్ కూడా వస్తే? ఆ టీవీ నుంచే కరెంటు బిల్లు చెల్లించుకునే వీలుంటే? ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు మీరు అర్హులో కాదో తెలుసుకునే అవకాశం ఉంటే? మీ పిల్లలకు స్కూల్లో హోంవర్క్‌గా ఇచ్చే ప్రాజెక్టులను ఇంట్లో ఉన్న టీవీలోనే గూగుల్ ద్వారా చేసుకోగలిగితే? చానళ్లు మార్చుకోవడానికి వాడే టీవీ రిమోట్‌నే ఫోన్‌లా వినియోగించుకునే వీలుంటే?.. ఇవన్నీ కాదు.. సాక్షాత్తూ ముఖ్యమంత్రే మీ ఇంట్లో ఉన్న టీవీ ద్వారా మీతో మాట్లాడితే ఎలా ఉంటుంది? ఇవన్నీ ఊహలు కావు. టీ-ఫైబర్ కనెక్షన్ ద్వారా.. అతి తక్కువ ధరకే రాష్ట్ర ప్రభుత్వం వీటన్నింటినీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ ఫైబర్‌గ్రిడ్

మిగతా 14వ పేజీలో...

అనర్హతపై ముందుకెలా?

స్పీకర్ నోటీసులందుకున్న ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ భేటీ

- కృష్ణమోహన్‌రెడ్డి సహా 9 మంది హాజరు
- జ్వరం కారణంగా రాలేకపోయిన కడియం శ్రీహరి
- అనర్హత పిటిషన్ విచారణపై న్యాయనిపుణులతో సమీక్ష
- నియోజకవర్గాల సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా
- పరిష్కారానికి నిధులిస్తామని ఎమ్మెల్యేలకు రేవంత్‌రెడ్డి హామీ
- సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి



హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ అనర్హత పిటిషన్‌కు సంబంధించి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నుంచి నోటీసులందుకున్న ఎమ్మెల్యేలు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీకి.. కడియం శ్రీహరి మినహా 9మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జ్వరం కారణంగా ఆయన ఈ సమావేశానికి హాజరు కాలేకపోయారు. అయితే తాను పార్టీ మారలేదంటూ పలుమార్లు ప్రకటించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఈ భేటీకి హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు న్యాయనిపుణులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పది మంది ఎమ్మెల్యేల అనర్హత కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, స్పీకర్ నోటీసుల జారీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై న్యాయ నిపుణులతో సమీక్షించారు. అయితే ఇప్పటివరకు వివరణ ఇచ్చిన ఎమ్మెల్యేలు.. తాము పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధికి నిధులడిగేందుకు ముఖ్యమంత్రిని

మిగతా 13వ పేజీలో...

ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మారాలంటే సర్కారే మారాలేమో?

- నిర్వాసితులకు న్యాయం జరక్కపోతే ప్రభుత్వాన్ని స్తంభింపజేద్దాం
- భూ నిర్వాసిత రైతుల భేటీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

13

మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం

- రూ.7,658 కోట్లతో గోదావరి తాగునీటి ప్రాజెక్టు ఫేజ్-2, 3 పథకాలకు నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీటి తరలింపు
- మూసీకి 2.5.. హైదరాబాద్ తాగునీటికి 17.5 టీఎంసీలు
- ఓఆర్ఆర్ ఫేజ్-2 తాగునీటి సరఫరానూ ప్రారంభించనున్న సీఎం



వరంగల్‌లో జోరువాన

- చెరువుల్ని తలపించిన రోడ్లు 13
- అండర్ బ్రిడ్జి వద్ద వరదలో 2 బస్సులు
- ప్రయాణికులను తాడు సాయంతో బయటకు తీసుకొచ్చిన సిబ్బంది

బీసీ బిల్లుకు కేంద్రం అడ్డు

- రిజర్వేషన్లపై బీజేపీ బాగోతాన్ని వెల్లడిస్తాం
- కామారెడ్డి సభతో కనువిప్పు కలిగిస్తాం 13
- కేసీఆర్ కుటుంబమంతా దొంగల ముఠానే
- ఆయన పిలిస్తే కవిత వెళ్లదా..?: మహేశ్ గౌడ్

భారత్‌పై మళ్లీ నోరుపారేసుకున్న నవారో

- రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తప్పుపడుతూ ఎక్స్‌లో పోస్టు 2
- నవారో వ్యాఖ్యలు తప్పంటూ 'ఎక్స్' నోట్
- ఎక్స్‌తోపాటు మస్క్‌పై నవారో విమర్శలు
- తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- ఫ్యాక్ట్ చెక్ చేసి.. నోట్ పెట్టిన ఎక్స్

రచయిత్రి నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారం.. రేపు ప్రదానం 3

ఐటీ ఔట్‌సోర్సింగ్‌పై ఆంక్షలు!

భారత కంపెనీల సేవలను అడ్డుకునే యోచనలో అమెరికా

- డొనాల్డ్ ట్రంప్ పరిశీలనలో ప్రతిపాదన
- ఆయన సలహాదారు లారా లూమర్ పోస్ట్
- ఐటీ రంగాన్ని కాపాడుకునేందుకు విదేశీ సంస్థలు, ప్రభుత్వాలతో భారత్ చర్చలు
- ఎలక్ట్రానిక్స్, తయారీ రంగానికి ఊతం
- కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



న్యూయార్క్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 7: భారత ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించినా దిగిరావట్లేదన్న అక్కసుతో.. అమెరికన్ కంపెనీలకు భారత కంపెనీల ఐటీ ఔట్‌సోర్సింగ్ సేవలను అడ్డుకునేందుకు ట్రంప్ సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. అమెరికాకు చెందిన మితవాద ఉద్యమకారుడు జాక్ పోసోబిక్ నాలుగు రోజుల

మిగతా 2వ పేజీలో...

అమెరికా ఒక్కటే దిక్కు కాదు!

- జపాన్, పశ్చిమాసియా, యూరప్, ఆఫ్రికాల్లో ఐటీ సేవలకు పెరుగుతున్న గిరాకీ
- వాటిపై దృష్టి సారించాలంటున్న నిపుణులు.. ఇప్పటికే పలు దేశాలతో భారత్ చర్చలు
- మన ఐటీ ఔట్‌సోర్సింగ్‌పై అమెరికా ఆంక్షల రంకెలు రాజకీయ సందేశం కావొచ్చు
- ఆ దేశం భారత ఐటీ ప్రతిభపై ఎక్కువగా ఆధారపడి ఉంది: నిపుణులు 2

రేపే ఉపరాష్ట్రపతి ఎన్నిక


బీజేపీ ఎంపీలకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో చివరి వరసలో కూర్చున్న మోదీ

- ఎన్‌డీఏ తరఫున సీపీ రాధాకృష్ణన్
- 'ఇండీ' అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- పోలింగ్‌కు రెండు కూటములూ సిద్ధం
- ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీలకు వర్క్‌షాప్
- నేడు విపక్షాల సభ్యులకు మాక్ పోల్
- సంఖ్యాబలం ఎన్‌డీఏ వైపే
- పార్లమెంటు ఉభయసభల్లో ప్రస్తుతం 781 మంది సభ్యులు
- వీరిలో పాలక కూటమి సంఖ్య 425
- 'ఇండీ'కి 311, ఇతరులకు 45
- క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ ఆశలు

దేశంపై ప్రేమ ఉంటే నన్ను గెలిపించండి

- నాకు ఓటు వేస్తే.. భారతదేశ స్ఫూర్తికి వేసినట్లే 2
- ఉపరాష్ట్రపతిగా చాన్స్ ఇస్తే పార్లమెంటరీ సంప్రదాయాల్ని రక్షిస్తా
- లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లేఖ

రేపే ఉపరాష్ట్రపతి ఎన్నిక

ఎన్‌డీఏ తరపున సీపీ రాధాకృష్ణన్.. 'ఇండీ' అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. మంగళవారం జరిగే ఎన్నికల్లో పార్లమెంటు ఉభయసభల సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. పాలక ఎన్‌డీఏ తరఫున మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67), విపక్ష 'ఇండీ' కూటమి నుంచి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి (79) పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. తమ తమ ఎంపీలు ఓట్లు సక్రమంగా వేసేందుకు వీలు కల్పిస్తూ రెండు కూటములూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేశాయి. బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ అధినాయకత్వం తలపెట్టిన రెండ్రోజుల వర్క్‌షాప్ ఆదివారం ఢిల్లీలో మొదలైంది. ప్రధాని మోదీ దీనికి హాజరయ్యారు. సోమవారం ఎన్‌డీఏ ఎంపీలతో కలిసికట్టుగా వ్యూహరచన చేయాలని బీజేపీ అగ్రనేతలు నిర్ణయించారు. ఇక విపక్ష ఎంపీలకు కాంగ్రెస్ సోమవారం మధ్యాహ్నం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో మాక్‌పోల్ నిర్వహించి.. ఓటు ఎలా వేయాలో వివరిస్తుంది. రాత్రికి ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే వారికి విందు ఇవ్వనున్నారు. అన్ని పార్టీల ఎంపీలూ ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆయా పార్టీల మద్దతు కోరిన సుదర్శన్‌రెడ్డి కూడా దేశ రాజధానికి వచ్చేశారు. తాను ఏ పార్టీ తరఫునా పోటీ చేయడం లేదని, రాజకీయాలకతీతంగా తనకు ఓటు వేయాలని ఆయన ఉభయ సభల ఎంపీలకు లేఖ రాశారు. ఈ ఎన్నికకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. పార్లమెంటు భవనంలోని వసుధలో ఎఫ్-101 గదిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు ఓట్లు లెక్కించి ఫలితం ప్రకటిస్తారు.

ఎన్‌డీఏ వైపే మొగ్గు!

ఉభయసభల్లో ఎన్‌డీఏకే సంఖ్యాబలం ఉంది. రెండు సభల్లో మొత్తం 788 మంది సభ్యులకు గాను ప్రస్తుతం 781 మంది (లోక్‌సభలో 542, రాజ్యసభలో 239 మంది) ఉన్నారు. ఎన్‌డీఏకి 425 మంది, ఇండీ కూటమికి 311 మంది, ఇతర ప్రతిపక్షాలకు 45 మంది సభ్యులున్నారు. ఇతర ప్రతిపక్షాల్లో వైసీపీ (11).. ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. బీజేడీ (7) మద్దతు కోసం ఆ పార్టీ అధినేత, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు ప్రధాని మోదీ స్వయంగా ఫోన్ చేశారు. సరైన సమయంలో తమ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని బీఆర్ఎస్ ఎంపీ కె.సురేశ్‌రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ పార్టీకి రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. శిరోమణి అకాలీదళ్ వంటి ఏక సభ్య పార్టీలు, స్వతంత్రులు ఎటు మొగ్గుతారో చూడాల్సి ఉంది.



రాధాకృష్ణన్, సుదర్శన్‌రెడ్డి

రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగనున్నందున.. అధికార కూటమి నుంచి సుదర్శన్‌రెడ్డికి క్రాస్ ఓటింగ్ జరుగుతుందని కాంగ్రెస్ ఆశాభావంతో ఉంది. అటు బీజేపీ కూడా.. తమిళనాడు ఎంపీల్లో కొందరు తమ రాష్ట్రానికే చెందిన రాధాకృష్ణన్ వైపు మొగ్గుచూపుతారని అంచనా వేస్తోంది. దళిత, ఆదివాసీ ఎంపీలందరూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికే మద్దతివ్వాలని తమిళనాడుకు చెందిన వీసీకే ఎంపీ తిరుమావళవన్ ఒక లేఖలో పిలుపిచ్చారు. ఆయన పార్టీకి లోక్‌సభలో ఇద్దరు సభ్యులున్నారు.

గతంలో ఎవరికెన్ని..?

2002 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భైరాన్‌సింగ్ షెకావత్‌కు 454 ఓట్లు రాగా.. ఆయనపై బరిలోకి దిగిన కాంగ్రెస్ సీనియర్ నేత సుశీల్‌కుమార్ షిండేకు 302 ఓట్లు వచ్చాయి. వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు 516 ఓట్లు సాధించగా.. ప్రత్యర్థి గోపాలకృష్ణ గాంధీకి కేవలం 244 ఓట్లు వచ్చాయి. 2022 ఎన్నికల్లో జగదీప్ ధన్‌ఖడ్‌కు 520 ఓట్లు వచ్చాయి. విపక్షాల ఐక్య అభ్యర్థి మార్గరెట్ ఆల్వా కేవలం 182 ఓట్లు సాధించారు. ఈసారి ఎన్‌డీఏ అభ్యర్థికి 500 ఓట్లలోపే వచ్చే అవకాశాలున్నాయి. ప్రతిపక్షాలు తమకు ఉన్న మొత్తం 324 ఓట్లు సాధించినప్పటికీ.. అన్ని ఎక్కువ ఓట్లు పొంది ఓడిపోవడం ఇదే మొదటి సారి అవుతుంది.

చెల్లని ఓట్లపై బెంగ..

చెల్లని ఓట్లపై రెండు కూటముల్లో ఆందోళన నెలకొంది. 2022లో 15 మంది ఎంపీల ఓట్లు చెల్లకపోవడమే దీనికి కారణం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంపీలకు కూడా ఓటు వేయడం రాకపోతే ఎలాగని ఉభయ కూటముల నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఎంపీలు తమ ఓటింగ్ ప్రాధాన్యాలను అక్షరాల్లో కాకుండా అంకెల ద్వారా సూచించాలని.. కానీ కొందరు అది గ్రహించలేక పోతున్నారని వారు చెబుతున్నారు. అంతేగాక.. ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిర్దిష్ట పెన్నులతోనే వారు తమ ప్రాధాన్యాలను తెలుపవలసి ఉంటుంది. మరే ఇతర పెన్నులు వాడినా ఓటు చెల్లదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రతి 15 మంది పార్టీ ఎంపీలకు ఒక సమన్వయకర్తను నియమించింది. ప్రతిపక్ష సభ్యులను సమన్వయపరిచేందుకు ప్రత్యేక బృందాలను మోహరించింది.

వెనుక వరుసలో మోదీ

ప్రధాని మోదీ వర్క్‌షా‌ప్‌లో వెనుక వరుసలో ఉన్న ఎంపీలతో పాటు కూర్చోవడం విశేషం. ఆయన్ను ఈ సందర్భంగా బీజేపీ ఎంపీలు సత్కరించారు. పేద, మధ్యతరగతికి భారీ ఊరట కల్పించేలా జీఎస్‌టీ 2.0 సంస్కరణలు తెచ్చినందుకు ప్రశంసలు కురిపించారు. సవరించిన జీఎస్‌టీ దసరా నవరాత్రుల తొలి రోజైన ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్న సంగతి తెలిసిందే. '2027నాటికి అభివృద్ధి భారతం', సామాజిక మాధ్యమాలను ఎంపీలు సమర్థంగా వినియోగించుకోవడం' అనే అంశాలపై ఎంపీలు ఉదయం చర్చించారు. మధ్యాహ్నం వారంతా వివిధ కమిటీలుగా ఏర్పడి.. వ్యవసాయం, రక్షణ, ఇంధన, విద్యరైల్వే, రవాణా శాఖలపై చర్చించారు. సోమవారం పూర్తిగా ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌లో శిక్షణపైనే వర్క్‌షాప్ దృష్టి కేంద్రీకరిస్తుంది.



ఢిల్లీలోని బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ఎంపీల వర్క్‌షాప్‌లో ప్రధాని మోదీకి వర్క్‌షాప్ రిజిస్ట్రేషన్ కార్డును అందజేస్తున్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్

దేశంపై ప్రేమ ఉంటే..
నన్ను గెలిపించండి

- నాకు ఓటు వేస్తే.. భారతదేశ స్ఫూర్తికి వేసినట్లే
- ఉభయ సభల ఎంపీలకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి లేఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశం పట్ల ప్రేమ ఉంటే తనను ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని ఇండియా కూటమి తరఫున బరిలో నిలిచిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి.. పార్లమెంటు సభ్యులను కోరారు. తాను వ్యక్తిగా మద్దతు కోరడం లేదని, సర్వసత్తాక ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా భారతదేశ విలువలను గౌరవించేందుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీకీ విధేయంగా ఉండాల్సిన అవసరం లేదని, ఏ పార్టీ విప్ జారీ చేయదని తెలిపారు. రహస్య బ్యాలెట్ ప్రకారం ఓటింగ్ జరుగుతుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికీ తమ అంతరాత్మ ప్రబోధాన్ని అనుసరించాల్సిన నైతిక బాధ్యత ఉందన్నారు. ఈ మేరకు ఉభయ సభల ఎంపీలకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదివారం లేఖ రాశారు. తనను ఎన్నుకుంటే.. పార్లమెంట్ సంప్రదాయాన్ని కాపాడినట్లు, చర్చల హుందాతనాన్ని పునరుద్ధరించినట్లు అవుతుందన్నారు. తనకు ఓటు వేయడం భారతదేశ స్ఫూర్తికి ఓటు వేయడమేనని, భవిష్యత్తు తరాలు గర్వపడేలా మన రిపబ్లిక్‌ను కాపాడాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామిక విలువలు క్షీణిస్తున్నాయని, హక్కులు ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కొన్ని దశాబ్దాల పాటు ప్రజాసేవలో అనుభవం ఉన్న తనకు ప్రజాస్వామ్య తీరుతెన్నులు తెలుసునని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. తనకు అవకాశమిస్తే పార్లమెంటరీ సంప్రదాయాలను నిష్పాక్షికంగా, హుందాగా పరిరక్షిస్తానని హామీ ఇచ్చారు. తాను మాజీ ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను అనుసరిస్తూ జాతీయ ప్రయోజనాలను కాపాడతానన్నారు. తక్షణ రాజకీయ ఒత్తిళ్లకు లోను కాకుండా.. సమాఖ్య స్ఫూర్తిని పరిరక్షిస్తానని, నిబంధనల్ని అమలు చేయడంతోనే సరిపెట్టుకోకుండా చర్చల పవిత్రతను కాపాడుతానని హామీ ఇచ్చారు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మజ్లిస్ మద్దతు

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి, జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మజ్లిస్ తన మద్దతు ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డి మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీకి ఫోన్ చేసి జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరిన నేపథ్యంలో.. ఆ మేరకు పార్టీ నిర్ణయం తీసుకుందని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వడమే సమంజసమని భావిస్తున్నట్లు ఒవైసీ పేర్కొన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

భారత్‌పై మళ్లీ నోరుపారేసుకున్న నవారో

వాషింగ్టన్, సెప్టెంబరు 7: తరచూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్న శ్వేతసౌధం వాణిజ్య సలహాదారు పీటర్ నవారోకు.. ఆయన తరచూ పోస్టులు పెట్టే సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లోనే చుక్కెదురైంది. నవారో వ్యాఖ్యలు సత్యదూరమంటూ 'కమ్యూనిటీ నోట్' పెట్టింది. దీంతో ఆగ్రహించిన నవారో తీవ్ర విమర్శలు చేస్తూ మరో పోస్టు పెట్టగా.. దానిపైనా 'ఎక్స్' ఫ్యాక్ట్ చెక్ చేసి 'కమ్యూనిటీ నోట్' పెట్టడం గమనార్హం. ఎప్పటిలాగే రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని తప్పుపడుతూ నవారో శుక్రవారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రష్యా చమురు కొనుగోలుతో భారత్ భారీగా లాభాలు ఆర్జిస్తోందని ఆరోపించారు. దీనిపై నిజ నిర్ధారణ (ఫ్యాక్ట్ చెక్) చేసిన ఎక్స్.. నవారో పోస్టుకు కమ్యూనిటీ నోట్ పెట్టింది. భారత్ ఇంధన భద్రత కోసమే రష్యా నుంచి చమురు కొంటోందని, ఎలాంటి ఆంక్షలనూ మీరలేదని పేర్కొంది. అంతేకాదు రష్యా నుంచి అమెరికా యురేనియం, ఇతర ఖనిజాలు కొనుగోలు చేస్తోందని ప్రస్తావించింది. అయితే ఇలా కమ్యూనిటీ నోట్ పెట్టడంపై నవారో మండిపడ్డారు. 'ఎక్స్', దాని అధినేత ఎలాన్ మస్క్ ట్రంప్ యంత్రాంగంపై తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. అయితే దీనిపైనా ఎక్స్ ఫ్యాక్ట్ చెక్ చేసి కమ్యూనిటీ నోట్ పెట్టింది. రష్యా చమురును భారత్ కొనవద్దంటూనే, రష్యా నుంచి యురేనియం, ఇతర దిగుమతులు చేసుకోవడం అమెరికా ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పడుతోందని 'ఎక్స్' స్పష్టం చేసింది.

అమెరికాలో హ్యుండయ్ ప్లాంట్‌పై దాడి

వాషింగ్టన్/సియోల్, సెప్టెంబరు 7: అక్రమ వలసదారుల ఏరివేత పేరుతో అమెరికా ఫెడరల్ ఏజెన్సీ-ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న హ్యుండయ్ ఎలక్ట్రిక్ వాహన ప్లాంట్ వద్ద గురువారం జరిపిన దాడులు యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. ముసుగులు ధరించి, సాయుధులైన సైనికులు ప్లాంట్లోకి వచ్చి, అక్కడ పనిచేస్తున్న 475 మందిని అరెస్టు చేశారు. వీరిలో 300 మంది వరకు దక్షిణ కొరియా పౌరులు ఉన్నారు. అక్రమంగా వలస వచ్చిన కార్మికులు ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్నారనే అనుమానాలతో దాడులు జరిపినట్లు ఐసీఈ ప్రకటించింది. తాత్కాలిక కార్మిక వీసాలపై వచ్చిన వారు నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపించింది. ఈ మధ్యకాలంలో అమెరికాలో జరిగిన అతిపెద్ద ఇమిగ్రేషన్ దాడి ఇదే. ఐసీఈ బలగాల దాడులతో దక్షిణ కొరియా కార్మికులు కకావికలమయ్యారు. కొందరు చెరువులోకి దూకి, పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే.. ఐసీఈ బలగాలు అప్పటికే సిద్ధం చేసిన బోట్లలో వారిని వెంబడించి అరెస్టు చేశాయి. ఐసీఈ దాడులపై దక్షిణ కొరియా స్పందించింది. ఐసీఈ గుర్తించిన వర్కర్లలో ఎక్కువ మందిని డీపోర్ట్ చేయాల్సి ఉన్నట్లు తేలడంతో.. చార్టెడ్ విమానాలను పంపి, వారిని తీసుకువస్తామని ఆదివారం అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంది.



ట్రంప్‌పై నిరసన గళం


- వాషింగ్టన్‌లో ఫెడరల్ దళాలకు నిరసనగా భారీ ర్యాలీ

వాషింగ్టన్ డీసీ, సెప్టెంబరు 7: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై స్వదేశంలో నిరసన గళం వెల్లువెత్తింది. దేశ రాజధాని నగర వీధుల్లో ఫెడరల్ దళాలను మోహరించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం వాషింగ్టన్ డీసీలో అనేక వేల మంది రోడ్డెక్కారు. తక్షణమే నేషనల్ గార్డుల మోహరింపును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. నగరంలో నేరాలు పెచ్చుమీరుతున్నాయంటూ గత నెలలో ట్రంప్ వాషింగ్టన్ డీసీలో ఫెడరల్ దళాలను మోహరించారు. మెట్రోపాలిటన్ పోలీసు విభాగాన్ని కూడా నేరుగా ఫెడరల్ నియంత్రణలోకి తీసుకొచ్చారు. దీన్ని ఫెడరల్ ప్రభుత్వ అతిక్రమణ చర్యగా ప్రజాస్వామ్యవాదులు ఖండిస్తున్నారు. 'ట్రంప్ తక్షణమే వెళ్లిపోవాలి', 'డీసీకి స్వేచ్ఛ కల్పించాలి', 'నిరంకుశత్వాన్ని ప్రతిఘటించండి' తదితర పోస్టర్లను నిరసనకారులు ప్రదర్శించారు.

రష్యా క్యాన్సర్ వ్యాక్సిన్..
క్లినికల్ ట్రయల్స్‌లో 100% సమర్థత!

మాస్కో, సెప్టెంబరు 7: క్యాన్సర్‌కు సంబంధించి విప్లవాత్మక మార్పునకు ముందడుగు పడింది. ఎంఆర్ఎన్ఏ ఆధారంగా రష్యా రూపొందించిన క్యాన్సర్ వ్యాక్సిన్ ఎంటరోమిక్స్ క్లినికల్ ట్రయల్స్‌లో 100% సమర్థతను సాధించింది. తొలి దశ క్లినికల్ ట్రయల్స్‌లో 25 మంది ఆరోగ్యవంతులైన వలంటీర్లు పాల్గొనగా.. వారందరిలో రోగనిరోధక శక్తి ఏర్పడిందని రష్యా ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ మెడికల్ రిసెర్చ్ రేడియాలజీ సెంటర్, సెయింట్ పీటర్స్‌బర్గ్ ఆంకాలజీ సెంటర్ శాస్త్రవేత్తలు ప్రకటించారు. కీమోథెరపీతో రేడియేషన్ దుష్ప్రభావం ఉన్నట్లు.. క్లినికల్ ట్రయల్స్‌లో పాల్గొన్న వారిలో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ కనిపించలేదని పేర్కొన్నారు. 2, 3 దశల ట్రయల్స్ తర్వాత వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందన్నారు.

లోకం తీరు



ఉపరాష్ట్రపతికి రెగ్యులర్
వేతనం లేదు!

- రాజ్యసభ ఛైర్మన్‌గా నెలకు రూ.4 లక్షలు
- రిటైరయ్యాక నెలకు 2 లక్షల పెన్షన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7: భారత ఉపరాష్ట్రపతికి వేతన సదుపాయం లేదు. అయితే రాజ్యసభ ఛైర్మన్‌గా మాత్రం ఆయనకు నెలకు రూ.4 లక్షల జీతం లభిస్తుంది. దీనితో పాటు ఉచిత వసతి, వైద్య సదుపాయం.. రైళ్లు, విమానాల్లో ప్రయాణం, సిబ్బంది, వ్యక్తిగత భద్రత, మొబైల్ ఫోన్, ల్యాండ్‌ఫోన్ మొదలైన ప్రయోజనాలు అందుతాయి. పార్లమెంటు అధికారుల వేతనాలు, భత్యాల చట్టం (1953) ప్రకారం ఉపరాష్ట్రపతికి నిర్దిష్ట వేతనం ఇవ్వాలన్న నిబంధనేదీ లేదని.. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో మాత్రం జీతం, ఇతర ప్రోత్సాహకాలు లభిస్తాయని అధికార వర్గాలు తెలిపాయి. పదవీవిరమణ తర్వాత నెలకు సుమారు రూ.2 లక్షలు పెన్షన్ వస్తుంది. రాజధాని ఢిల్లీలో టైప్-8 బంగళా, వ్యక్తిగత కార్యదర్శి, అదనపు వ్యక్తిగత కార్యదర్శి, వ్యక్తిగత సహాయకుడు, వైద్యుడు, నర్సింగ్ అధికారి, నలుగురు వ్యక్తిగత పరిచారకులు ఉంటారు. మాజీ ఉపరాష్ట్రపతి మరణిస్తే అతడి/ఆమె భార్య/భర్తకు జీవితాంతం టైప్-7 నివాసం ఇస్తారు. పదవీ కాలం ఇంకా రెండేళ్లు ఉన్నప్పటికీ జగ్‌దీప్ ధన్‌ఖడ్ జూలై 21న ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఉప రాష్ట్రపతి పదవికి మంగళవారం ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ధన్‌ఖడ్ గతంలో 1993-98 మధ్య రాజస్థాన్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019 జూలై వరకు మాజీ శాసనసభ్యుడిగా పెన్షన్ అందుకున్నారు. ఆ ఏడాది పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులు కావడంతో పెన్షన్ నిలిచిపోయింది. 2019-22 నడుమ గవర్నర్‌గా మూడేళ్లు పనిచేసిన ఆయన.. 2022లో ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఇప్పుడు రాజీనామా తర్వాత మాజీ ఎమ్మెల్యే పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

ఐటీ ఔట్‌సోర్సింగ్‌పై ఆంక్షలు!

(మొదటి పేజీ తరువాయి)

క్రితమే ఈ ప్రతిపాదనతో 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. దాన్ని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో రీపోస్ట్ చేశారు! తాజాగా.. ట్రంప్ సలహాదారు, మితవాద ఉద్యమకారిణి లారా లూమర్ కూడా 'ఎక్స్'లో ఈ మేరకు ఒక పోస్టు పెట్టారు. "అమెరికన్ ఐటీ సంస్థలు తమ పనిని భారతీయ సంస్థలకు ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వకుండా అడ్డుకునే అంశాన్ని అధ్యక్షుడు ట్రంప్ పరిశీలిస్తున్నారు. ఇకపై మీరు (అమెరికన్లు) ఇంగ్లిష్ కోసం రెండు నొక్కాల్సిన అవసరం ఎంతమాత్రం ఉండదు. మేక్ కాల్ సెంటర్స్ అమెరికన్ ఎగైన్" అని ఆమె ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇంగ్లిష్ కోసం రెండు నొక్కితే.. మాట్లాడే వ్యక్తి నిజంగా ఇంగ్లిష్ మాట్లాడే వ్యక్తి కాకపోవడం ఇక ఆగిపోతుందని, అలాంటి రోజులకు ట్రంప్ ముగింపు పలుకుతారని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా అమెరికన్లు ఏదైనా కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసినప్పుడు.. 'స్పానిష్ కోసం ఒకటి నొక్కండి.. ఇంగ్లిష్ కోసం రెండు నొక్కండి' అనే యాంత్రిక స్వరం వినిపిస్తుంటుంది. ఔట్‌సోర్సింగ్‌పై ఆంక్షలు విధిస్తే అప్పుడు కాల్‌సెంటర్ ఉద్యోగాలన్నీ అమెరికన్లకే వస్తాయని.. అప్పుడు వారంతా సహజమైన అమెరికన్ యాసలో మాట్లాడతారని ఆమె ఉద్దేశం. ట్రంప్ నిజంగానే భారత కంపెనీలకు ఐటీ ఔట్‌సోర్సింగ్‌పై ఆంక్షల ప్రతిపాదనను పరిశీలిస్తున్నారా లేదా అనే విషయంపై స్పష్టత లేదు గానీ.. ఐటీ రంగానికి సంబంధించి ఆయన పెద్ద నిర్ణయమే తీసుకోనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. దాదాపురూ.26,45 లక్షల కోట్లు విలువైన టెక్ పరిశ్రమను కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవడం మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే పలు అంతర్జాతీయ సంస్థలతో, విదేశీ ప్రభుత్వాలతో భారత్ చర్చలు జరుపుతోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలను నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో విస్తృతస్థాయిలో సంప్రదింపులు జరుపుతున్నట్లు 'మనీ కంట్రోల్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. అలాగే.. అమెరికా, యూరప్, జపాన్, ఆగ్నేయాసియా దేశాల ప్రభుత్వాలతో కూడా చర్చలు జరుపుతున్నట్టు వెల్లడించారు. అయితే.. భారత్ పూర్తిగా సేవల ఎగుమతులపై ఆధారపడి లేదన్న అశ్వినీ వైష్ణవ్.. ఐటీ సేవలపై ఆంక్షల వల్ల వచ్చే నష్టాన్ని ఎలక్ట్రానిక్స్, తయారీ రంగానికి ఊతం ఇవ్వడం ద్వారా పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు.

అమెరికా ఒక్కటే దిక్కు కాదు!

జపాన్, పశ్చిమాసియా, యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఐటీ సేవలకు పెరుగుతున్న గిరాకీ

- వాటిపై దృష్టి సారించాలంటున్న నిపుణులు
- ఇప్పటికే పలు దేశాలతో ఇండియా చర్చలు

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అస్థిరతల కారణంగా, నానాటికీ పెరుగుతున్న ఏఐ వినియోగం, ఆటోమేషన్ వల్ల ఇప్పటికే పలు సవాళ్లు ఎదుర్కొంటున్న భారత ఐటీ రంగం.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల రంకెలతో తీవ్ర ఆందోళనకు గురవుతోంది! భారతీయ ఉత్పత్తులపై సుంకాలు విధించినా ఇండియా బెదరకపోవడంతో ట్రంప్ భారత ఐటీ ఎగుమతులపై సుంకాలు విధించే ఆలోచనలో ఉన్నారని.. ఐటీ ఔట్‌సోర్సింగ్‌ను అడ్డుకునే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారని వస్తున్న వార్తలు ఐటీ ఉద్యోగులను భయపెడుతున్నాయి. భారత ఐటీ కంపెనీలను అడ్డుకునేందుకు ట్రంప్ వీసా నిబంధనలను కఠినతరం చేయడం వంటి నిర్ణయాలు తీసుకుంటే నిర్వహణ ఖర్చులు పెరిగి.. కంపెనీలు స్థానికులనే తీసుకోవడానికి మొగ్గుచూపుతాయని, ఇక్కణ్నుంచీ ఉద్యోగులను అక్కడకు పంపవని.. ఫలితంగా ఇక్కడ నియామకాలు తగ్గుతాయని ఇండస్ట్రీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారతదేశ ఐటీ ఔట్‌సోర్సింగ్ సేవల విలువ దాదాపు 283 బిలియన్ డాలర్లు. అంటే దాదాపుగా 24 లక్షల కోట్ల రూపాయలు. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్, విప్రో వంటి కంపెనీల వాటా ఇందులో అత్యధికం. ఆయా ఐటీ కంపెనీల ఆదాయంలో సింహభాగం (60 శాతానికి పైగా) అమెరికా నుంచే వస్తుంది. కానీ, ఆయా కంపెనీల్లో ఎక్కువ మంది సిబ్బంది భారత్‌లోనే ఉంటారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తీసుకునే ఎలాంటి దుందుడుకు నిర్ణయమైనా ఆయా కంపెనీలపై, ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. "ఈ కంపెనీలన్నీ అమెరికాలో గణనీయంగా పన్నులు చెల్లిస్తున్నాయి. వాటి సేవల ఎగుమతులపై సుంకాలు విధించడమంటే రెట్టింపు పన్ను విధించినట్టే. ఇది భారత్ ఆధారిత సర్వీస్ ప్రొవైడర్ల వృద్ధికి చేటు చేస్తుంది" అని ఎవరెస్ట్ గ్రూప్ (అమెరికా బేస్డ్ టెక్నాలజీ కన్సల్టెన్సీ/ఎనలిస్ట్ సంస్థ) భాగస్వామి యుగళ్ జోషి అన్నారు.



దేశీయ డిమాండ్‌పై దృష్టి..

దేశంలో 56.7 లక్షల మంది ఉద్యోగులతో ఐటీ సేవల రంగం ఎగుమతి ఆదాయానికి కీలకంగా తోడ్పడుతోంది. అయితే, ఈ రంగం ఎక్కువగా విదేశీ మార్కెట్‌పై.. మరీ ముఖ్యంగా అమెరికాపై ఆధారపడి ఉంది. అమెరికా భారత ఐటీ సేవలపై ఆంక్షలు విధిస్తే.. ఈ రంగం అనుసరించే 'ఆఫ్‌షోర్ డెలివరీ మోడల్ (అంటే ఇక్కణ్నుంచే అమెరికన్లకు సేవలందించే విధానం)'పై ఒత్తిడి భారీగా పెరుగుతుంది. ఐటీ సేవలకు దేశీయంగా గిరాకీ పెంచే అవకాశాలున్నాయా? అంటే.. యూపీఐ, ఆధార్, డిజిటల్ ఇండియా, స్మార్ట్ సిటీస్ తదితర ప్రాజెక్టుల వల్ల ఇప్పటికే దేశీయంగా ఐటీ సేవల అవసరం భారీగా పెరిగిందని ఐటీ నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను చేపట్టడం ద్వారా అమెరికా, ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవచ్చని వారు పేర్కొంటున్నారు.

ఇతర మార్కెట్లపైనా..

దేశీయ డిమాండ్‌ను పెంచుకోవడంతోపాటు.. అమెరికాకు బదులుగా యూరప్, ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా, ఆఫ్రికా మార్కెట్లపై దృష్టి సారించాలని.. ఆయా దేశాలకు ఐటీ ఎగుమతులను, ఔట్‌సోర్సింగ్ సేవలను పెంచే అవకాశాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉదాహరణకు.. యూరప్‌లో ఇటీవలికాలంలో ఐటీసేవలకు డిమాండ్ బాగా పెరిగింది. ఈ క్రమంలోనే ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో వంటి సంస్థ యూరప్‌లోని పెద్ద పెద్ద సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఇక.. జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ లాంటి దేశాల్లో ఆటోమొబైల్, తయారీ పరిశ్రమలు ఎక్కువ. వాటికి అవసరమైన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆటోమేషన్, సరఫరా చైన్ల నిర్వహణకు సంబంధించిన పలు ప్రాజెక్టులను ఇప్పటికే భారత కంపెనీలు అందిపుచ్చుకుంటున్నాయి. అటు జపాన్‌లో.. వృద్ధుల జనాభా ఎక్కువ కావడం వల్ల ఐటీ ఉద్యోగుల కొరత ఎక్కువగా ఉంది. యూఏఈ, సౌదీ.. 'విజన్ 2030' కింద భారీగా స్మార్ట్‌సిటీలు, ఈ-గవర్నెన్స్, క్లౌడ్, కృత్రిమ మేధ మీద పెట్టుబడులు పెడుతున్నాయి. ఆయా దేశాల్లో తక్కువ ఖర్చుతో పెద్ద ఎత్తున ఐటీ సేవలు అందించగల సత్తా మన ఐటీకి ఉంది. ఈ నేపథ్యంలోనే.. భారత ప్రభుత్వం ఆయా దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

- సెంట్రల్ డెస్క్

అమెరికాకు అంత వీజీ కాదు..

భారత్ ఐటీ ఔట్‌సోర్సింగ్‌పై ఆంక్షలకు సంబంధించి జరుగుతున్న ఈ చర్చ అంతా విధానపరమైన నిర్ణయాలకు సంబంధించింది కాకపోవచ్చని, కేవలం రాజకీయ సందేశం (అమెరికా ప్రజలను, ఓటర్లను ఆకర్షించడానికి) అయి ఉండొచ్చని హెచ్ఎఫ్ఎస్‌గ్రూప్ సీఈవో, చీఫ్ అనలిస్ట్ ఫిల్ ఫెర్ష్ట్ వంటివారు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఈ చర్చ నిజమై అయ్యి.. ఆంక్షలు విధించాలనుకుంటే అది వస్తువులపై సుంకాలు విధించినంత సులభం కాబోదని, అది చాలా సంక్లిష్టమైన అంశమని ఫిల్ పేర్కొన్నారు. "ఎందుకంటే.. అమెరికా తన టెక్నాలజీ ఆర్థికవ్యవస్థను కాంపిటీటివ్‌గా ఉంచుకోవడానికి భారత్ ఐటీ, ఇంజినీరింగ్ ప్రతిభపై అమెరికా చాలా ఎక్కువగా ఆధారపడింది" అని ఆయన విశ్లేషించారు. అమెరికాకు చెందిన పలువురు టెక్ బిలియనీర్ల ప్రభావం ట్రంప్ యంత్రాంగంపై ఎక్కువగా ఉందని.. వారిలో అత్యధికులు భారత్ అనుకూలురేనని గుర్తుచేశారు.

ఏ క్షణమైనా వెనెజువెలాపై దాడి?

(మొదటి పేజీ తరువాయి)



అత్యాధునిక యుద్ధ విమానాలను మోహరిస్తున్నారు. 4,500 మంది సైనికులతో ఎనిమిది యుద్ధ నౌకలు కరీబియన్ సముద్రంలోకి వెళ్లాయి. ఏవీ-8బీ హ్యారియర్ అటాక్ ఎయిర్ క్రాఫ్ట్, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లైన యూఎస్ఎస్ జాన్సన్ డున్హమ్, యూఎస్ఎస్ గ్రేవ్లీలను దక్షిణ కరీబియన్‌లో మోహరించారు. ఒక్కో డెస్ట్రాయర్‌లో 90 క్షిపణులు ఉంటాయి. గైడెడ్ మిసైల్ క్రూయిజర్ యూఎస్ఎస్ లేక్ ఎరి, మిన్నియాపోలిస్ సెయింట్ పాల్‌లను కూడా వెనెజువెలాపై గురిపెట్టి ఉంచారు. శుక్రవారం రాత్రి 10 ఎఫ్-35 యుద్ధ విమానాలను ప్యూర్టోరికోలోని వైమానిక స్థావరానికి తరలించారు. పెద్ద సంఖ్యలో పీ-8 నిఘా విమానాలను కూడా రంగంలోకి దించారు. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనెజువెలాపై దాడులు చేస్తాయన్న ప్రచారం జరుగుతోంది. వెనెజువెలాలోని డ్రగ్స్ ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాలోకి విపరీతంగా వస్తున్నాయని ట్రంప్ చాలా కాలంగా ఆరోపిస్తున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతమొందించేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారని శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. డ్రగ్స్ ముఠాలతో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మాద్యురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ సర్కారు ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. మాద్యురో ఎన్నికను అమెరికా గుర్తించడం లేదంటూ ఇటీవలే శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ వెల్లడించారు. తాజాగా డ్రగ్స్ బోటు అంటూ వెనెజువెలాకు చెందిన ఓ పడవను అమెరికా దళాలు ధ్వంసం చేశాయి. ఈ ఘటనలో 11 మంది మరణించారు. ఈ చర్యను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సమర్థించుకున్నారు. అమెరికా పౌరులకు మాదకద్రవ్యాలనే విషాన్ని అలవాటు చేస్తున్న 11 మంది డ్రగ్స్ ముఠా సభ్యులను అంతమొందించారని, దీంతో అమెరికా సైన్యాన్ని చాలా చక్కగా వాడుకున్నట్లయిందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, అమెరికా మోహరింపులను మాద్యురో తప్పుపట్టారు. హింసతో అధికార మార్పిడి జరపాలని అమెరికా ప్రయత్నిస్తోందని, అలాంటి చర్యలను మానుకోవాలని అన్నారు. తమ సార్వభౌమత్వాన్ని, శాంతి హక్కును, స్వాతంత్ర్యాన్ని అమెరికా తప్పనిసరిగా గౌరవించాలని చెప్పారు. 'నేను ట్రంప్‌ను గౌరవిస్తా. మా మధ్య ఉన్న విభేదాలు సైనిక పోరుగా మారకూడదు' అని మాద్యురో పేర్కొన్నారు. వెనెజువెలా ఎప్పుడూ చర్చలకు సిద్ధంగా ఉంటుందన్నారు. అమెరికా బెదిరింపుల నేపథ్యంలో మాద్యురో కూడా 3.40 లక్షల మంది సైనికులను సిద్ధం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. తమ దేశంపై దాడి చేస్తే వెంటనే సాయుధ పోరు మొదలవుతుందని మాద్యూరో ప్రకటించారు.

సెల్‌ఫోన్ల వాడకం తగ్గించి చేతిరాతకు దగ్గరవుదాం

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి పిలుపు
- చేతిరాత పోటీలో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్, ఉన్నతాధికారులు


చేతిరాత పోటీలో పాల్గొన్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాఖడే

భగత్‌నగర్ (కరీంనగర్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ల వాడకం తగ్గించుకుని చేతిరాతకు దగ్గరవుదామని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి చేతిరాత పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా పాల్గొనడం గమనార్హం. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో ఎంతో విలువైన చేతిరాతకు అందరం దూరమవుతున్నామన్నారు. బలపం పట్టాల్సిన చేతులు సెల్‌ఫోన్లకు అలవాటుపడుతున్నాయని, చాలా మంది విద్యార్థులు రాసేందుకు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో చేతిరాతకు పూర్వ వైభవం తేవాలన్న ఉద్దేశంతో ఈ పోటీలకు శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి 48 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాస్థాయిలో రెండు విభాగాల్లో (పాఠశాల స్థాయిలో ఆరు నుంచి పదో తరగతి వరకు, కళాశాల స్థాయి) ఇద్దరి చొప్పున ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.4వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు, నాలుగో బహుమతిగా రూ.2వేలు, ఐదో బహుమతిగా రూ.1,000 అందించనున్నట్లు తెలిపారు.

సంపూర్ణ మద్యపాన నిషేధం

ఏకగ్రీవ తీర్మానం చేసిన గిరిగేట్‌పల్లి గ్రామస్థులు

వికారాబాద్, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని గిరిగేట్‌పల్లి గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు ఆదివారం గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ మద్యం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై, గ్రామంలో మద్యం విక్రయించే వారి పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు వారికి రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.


మద్యం సీసాలను పగుల గొడుతున్న మహిళలు

రోజు కూలీగా వెళ్లి.. గుట్టురట్టు చేసి..

(మొదటి పేజీ తరువాయి)



కానిస్టేబుల్‌ను ఆ కంపెనీలో కూలీగా పంపి.. డ్రగ్స్ తయారీ జరుగుతున్నట్లు పక్కాగా నిర్ధారణ అయ్యాకే, దాడులు జరిపి.. ప్రధాన నిందితుడు శ్రీనివాస్ విజయ్ ఓలేటీ, అతని వద్ద కెమికల్ ఎక్స్‌పర్ట్‌గా పనిచేస్తున్న తానాజీ పండరీనాథ్ పట్వారీని అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను మహారాష్ట్ర వాసాయ్ విరార్ పోలీసు కమిషనర్ నికేత్ కౌశిక్ స్థానిక మీడియాకు వెల్లడించారు. ఈ నెట్‌వర్క్ అత్యంత క్లిష్టంగా ఉందని, దాంతో ఒక్కో దశ సరఫరాదారులను దాటుకుంటూ.. చర్లపల్లికి చేరామని తెలిపారు.

బంగ్లాదేశీ అరెస్టు నుంచి..

గత నెల 8న వాసాయ్ విరార్ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఫాతిమా మురాద్ షేక్ అనే 23 ఏళ్ల యువతిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద రూ.23.97 లక్షలు విలువ చేసే 105 గ్రాముల మెఫిడ్రిన్ లభించడం.. ఆ యువతి బంగ్లాదేశ్ పౌరురాలని నిర్ధారణ కావడంతో కేసును సీరియ్‌స్‌గా తీసుకున్నారు. డ్రగ్స్ మూలాలను గుర్తించేందుకు ఒక్కో దశను దాటుకుని వెళ్లారు. దర్యాప్తునకు శాంతి భద్రతల ఏసీపీ దత్తాత్రేయ శిండే, క్రైమ్ బ్రాంచ్(డివిజన్-4) ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ నేతృత్వం వహించారు. తమ బృందాలను రంగంలోకి దింపారు. "ఈ నెట్‌వర్క్‌లో దశల వారీగా డ్రగ్స్ సరఫరా అయ్యేది. ఒకటో దశలో ఉండే వ్యక్తులు ఎవరో.. మూడో దశలో ఉండే వారికి తెలియకుండా ప్రధాన నిందితుడు శ్రీనివాస్ విజయ్ ఓలేటి జాగ్రత్తలు తీసుకున్నారు. ఫాతిమా ద్వారా రెహ్మాన్ షేక్‌ను అరెస్టు చేశాం. ఆ తర్వాత వేర్వేరు దశల్లో మరో 8 మందిని అరెస్టు చేసి, 178 గ్రాముల మెఫిడ్రిన్(విలువ రూ.23.97 లక్షలు)ను సీజ్ చేశాం. ఆ తర్వాత చర్లపల్లిలోని కంపెనీ గుట్టు తెలిసింది" అని సీపీ వెల్లడించారు.

సీజ్ చేసిన డ్రగ్స్ రసాయనాల తరలింపు

చర్లపల్లి కంపెనీలో మెఫిడ్రిన్ తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలు, రసాయనాల డ్రమ్ములను మహారాష్ట్ర పోలీసులు ఆదివారం తరలించారు. సుమారు 20 డ్రమ్ములను కర్ణాటక రిజిస్ట్రేషన్ ట్రక్కు (కేఏ39ఏ-3155)లో తీసుకెళ్లారు. ఆ కంపెనీ వద్ద స్థానిక పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

నెట్‌వర్క్ ఛేదన దిశగా..

మెఫిడ్రిన్ తయారీకి శ్రీనివాస్ విజయ్ గురుగ్రామ్‌లోని కిమియా బయోసైన్స్ అనే కంపెనీ నుంచి ముడిపదార్థాలు తెప్పించినట్లు మహారాష్ట్ర పోలీసులు నిర్ధారించారు. ముడిపదార్థాలను అసలు పేర్లను కాకుండా.. ఇతర లేబుళ్లను అంటించి, హైదరాబాద్‌కు తరలించేవారు. "ఈ నెట్‌వర్క్‌లో ఫాతిమా లాంటి వారు ఎంద రో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నాం. డ్రగ్స్ వినియోగదారుల వివరాలను గుర్తించే పనిలో ఉన్నాం. మరిన్ని వివరాల కోసం శ్రీనివాస్ విజయ్‌ని కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుంటాం" అని వాసాయ్ విరార్ పోలీసులు వివరించారు. మార్కెట్లో కిలో మెఫిడ్రిన్ విలువ రూ.125 కోట్లుగా ఉండగా.. శ్రీనివాస్ విజయ్ మాత్రం తన నెట్‌వర్క్‌కు రూ.50 లక్షలకు విక్రయించినట్లు గుర్తించామన్నారు. మొదట్లో ఇతను హైదరాబాద్‌లో టెకీలకు మాత్రమే మెఫిడ్రిన్ అందజేసేవాడని.. క్రమం గా ఇతర రాష్ట్రాలకు సరఫరాను ప్రారంభించాడని తెలిపారు. గతంలోనూ హైదరాబాద్ టెకీలు మెఫిడ్రిన్‌తో పట్టుబడ్డ విషయం తెలిసిందే.! నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) గణాంకాల ప్రకారం.. గత ఏడాది తెలంగాణలో 107 కిలోల మెఫిడ్రిన్ పట్టుబడింది. అటు హైదరాబాద్ పోలీసులు కూడా శ్రీనివాస్ విజయ్ నెట్‌వర్క్‌పై దృష్టి సారించారు. ఇతను ముంబై, గోవా, బెంగళూరుకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. రాచకొండ పోలీసులు సైతం తాజా ఘటనతో అప్రమత్తమయ్యారు. చర్లపల్లితోపాటు.. నాచారం, మల్లాపూర్ పారిశ్రామిక వాడల్లో ఉన్న కంపెనీలు ఏయే ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి? ఖాళీగా ఉన్న కంపెనీల వివరాలతో ఓ చిట్టాను తయారు చేస్తున్నారు.

శ్రీనివాస్ విజయ్ మోసాల చిట్టా..

శ్రీనివాస్ విజయ్ అరెస్టుతో.. రాంనగర్ పరిసరాల్లో ఆయన చేసిన మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అతనిది మోసంచేసే తత్వమని, నమ్మిన వారిని ఆర్థికంగా ఇబ్బంది పెట్టేవాడని స్థానికులు చెబుతున్నారు. శ్రీనివాస్ విజయ్ తొలుత రాంనగర్ గుండు వద్ద కొసైన్ సాఫ్ట్‌వేర్ సంస్థను ప్రారంభించారు. ఆ తర్వాత గేమింగ్, సాఫ్ట్‌వేర్ శిక్షణ సంస్థలను ఏర్పాటు చేశారు. వాటిల్లో నష్టాలు రావడంతో.. ఓలేటి సూపర్ మార్కెట్, డెయిరీ ఫామ్‌లను ప్రారంభించారు. అవి కూడా లాభదాయకం కాకపోవడంతో.. వాగ్దేవి ల్యాబ్స్ ను ప్రారంభించి, డ్రగ్స్ తయారీని మొదలు పెట్టారు. సాఫ్ట్‌వేర్ సంస్థ ఏర్పాటుకు ఇంటిని అద్దెకిచ్చిన యజమానికి డబ్బులు చెల్లించలేదని, ఇప్పటికీ ఆ ఇల్లు శ్రీనివాస్ విజయ్ ఆధీనంలోనే ఉందని సమాచారం. ఓలేటి సూపర్ మార్కెట్‌కు అద్దెకు ఇచ్చిన యజమాని కోర్టును ఆశ్రయించి, అతణ్ని ఖాళీ చేయించారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అద్దెకు తీసుకున్న ఓ ఇంటిని ఖాళీ చేయడానికి.. యజమాని వద్ద భారీగా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. అతనుండే అపార్ట్‌మెంట్ కార్ పార్కింగ్ విషయంలోనూ గొడవలు జరగ్గా.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రాబ్యాంక్ (ప్రస్తుతం యూనియన్ బ్యాంక్) రాంనగర్ బ్రాంచ్ నుంచి ఘట్‌కేసర్‌లో ఇంటి కొనుగోలుకు రుణం, నాచారం బ్రాంచ్ నుంచి రూ.50 లక్షల రుణం తీసుకుని, సరిగ్గా చెల్లించలేదని తెలుస్తోంది. కాగా.. శ్రీనివాస్ విజయ్ భార్య శిరీష, తల్లి రాధ, సమీప బంధుమిత్రులు ఆదివారం రహస్యంగా భేటీఅయినట్లు తెలిసింది. శ్రీనివాస్ విజయ్‌కి అప్పులున్న విషయం అందరికీ తెలుసని, అలాంటప్పుడు డ్రగ్స్ తయారీకి రూ.లక్షలు విలువ చేసే ముడిపదార్థాలను ఎలా కొం టాడని ప్రశ్నించినట్లు సమాచారం. ముంబైకి చెందిన ఓ వ్యక్తికి శ్రీనివాస్ విజయ్ బాకీ ఉన్నారని, అతను కక్షగట్టి డ్రగ్స్ కేసులో ఇరికించారని ఆరోపించారు.

డెకాయ్ ఆపరేషన్ ఇలా..

చర్లపల్లిలో శ్రీనివాస్ విజయ్ నిర్వహించే మత్తుపదార్థాల తయారీ కంపెనీ(బోర్డు ఉండదు)ని గుర్తించిన మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్.. లారీ డ్రైవర్లు, క్లీనర్లు, కూలీల రూపంలో తమ సిబ్బందితో రెండ్రోజులు అక్కడ రెక్కీ వేయించింది. ఈ క్రమంలో.. రోజు కూలీలతో ఆ కంపెనీలో పనులు చేయిస్తున్నట్లు గుర్తించారు. ఏరోజుకారోజు కూలీలు మారుతుంటారు. పనికి వచ్చిన కంపెనీలో ఏం తయారవుతోందో తెలియదు. విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు శ్రీనివాస్ విజయ్ ఈ జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కంపెనీలో పనులు చేయించేందుకు కూలీలను ఎక్కడి నుంచి తరలిస్తున్నారో గుర్తించిన మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్.. ఈనెల 5న తమ కానిస్టేబుల్‌ని ఆ గుంపులో చేర్చి, డెకాయ్ ఆపరేషన్‌ను నిర్వహించింది. అక్కడ డ్రగ్స్ తయారీ జరుగుతోందని నిర్ధారించుకున్న తర్వాత.. వాసాయ్ విరార్ శాంతిభద్రతలు, క్రైమ్ బ్రాంచ్ పోలీసులు మూకుమ్మడి దాడులు చేశారు. శ్రీనివాస్ విజయ్ ఓలేటి, అతని కెమిస్ట్ తానాజీ పండరీనాథ్ పట్వారీని అరెస్టు చేశారు.

ఎమర్జెన్సీ వార్డులో యువతిపై కాంపౌండర్ అత్యాచారం

- చికిత్స పొందుతున్న ఆమెకు మత్తుమందు ఇచ్చి లైంగికదాడి
- కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు.. పరారీలో ఆస్పత్రి వైద్యుడు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిపాలై ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న ఓ యువతి అత్యాచారానికి గురైంది. ఎమర్జెన్సీ వార్డులో ఉన్న ఆమెకు మత్తుమందు ఇచ్చి ఆ ఆస్పత్రికి చెందిన ఓ కాంపౌండర్ లైంగిక దాడికి తెగబడ్డాడు. ఎమర్జెన్సీ వార్డు బయట బాధిత యువతి కుటుంబసభ్యులు ఉండగానే దారుణానికి ఒడిగట్టాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరగ్గా.. బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికొచ్చింది. ఈ ఘటనకు సంబంధించి కరీంనగర్ మూడో టౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగిత్యాలకు చెందిన యువతి(20) అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో కొద్దిరోజులుగా చికిత్స పొందుతుంది. ఆ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పని చేసే దక్షిత్ అలియాస్ దక్షిణామూర్తి ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మత్తుమందు ఇచ్చి తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆ యువతి తన కుటుంబసభ్యులకు చెప్పింది. ఘటన జరిగిన సమయంలో బాధితురాలి కుటుంబసభ్యులు వార్డు బయటే ఉన్నారు. బాధితురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ఘటన జరిగిన ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డును వెంటనే సీజ్ చేశారు. క్రిటికల్ కేర్ యూనిట్‌లోని సీసీ కెమెరా ఫుటేజీలతోపాటు, ఇతర వస్తువులు, ఆస్పత్రి సీసీ కెమెరా ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఆస్పత్రి వైద్యులతోపాటు ఘటన జరిగిన సమయంలో ఉన్న సిబ్బంది, రోగులను విచారిస్తున్నారు. నిందితుడు దక్షిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం. సదరు ఆస్పత్రి వైద్యుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిసింది.

బాలికపై యువకుడి లైంగికదాడి

- మరో యువకుడి అత్యాచారయత్నం
- 100కు కాల్ చేసిన బాధితురాలు.. నిందితుల పరారీ

యాచారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నంది వనపర్తి గ్రామంలో జరిగింది. ఓ 16 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన గడల క్రాంతి అనే యువకుడు మాయమాటలు చెప్పి శనివారం రాత్రి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బి.క్రాంతికుమార్ అనే మరో యువకుడికి ఫోన్ చేసి చెప్పాడు. అతడు కూడా అక్కడికి చేరుకుని బాలికపై లైంగికదాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి 100కు కాల్ చేసి సమాచారమివ్వడంతో నిందితులిద్దరు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలికను చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నిందితులపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బీఎన్ఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు తెలిపారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య


శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యమ్మ(ఫైల్)

యాలాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి తన ఇంట్లోనే ఆత్మహత్య చేసుకోగా.. అది చూసి తల్లడిల్లిపోయిన అతని భార్య కూడా వెంటనే బలవన్మరణానికి పాల్పడింది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన మంచన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి(68), భాగ్యమ్మ(64) దంపతులు ఇలా ఒకరి తర్వాత మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. యాలాల ఎస్ఐ విఠల్, కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం.. రాస్నంకు చెందిన మంచన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి(68), భాగ్యమ్మ(64) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు ఇద్దరూ అవివాహితులు. పెద్ద కుమారుడు వేరే ప్రాంతంలో ఉంటూ ఉద్యోగం చేస్తుండగా.. చిన్న కుమారుడు తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. దాదాపు రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్ రెడ్డి తన అవస్థను భరించలేక ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. భర్త ఆత్మహత్యను తట్టుకోలేకపోయిన భాగ్యమ్మ గ్రామ సమీపంలోని కాల్వలో దూకి ప్రాణాలు కోల్పోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలపై స్పందించిన బెల్లంపల్లి కోర్టు

- ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులపై కేసు

కాసిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో ఈనెల 5న ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై బెల్లంపల్లి కోర్టు స్పందించింది. సంబంధిత అధికారులపై సుమోటోగా కేసు నమోదు చేసింది. కాసిపేట మండలం ముత్యంపల్లికి చెందిన అక్షిత చిన్నదర్మారంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. ఆమె తల్లి కాసిపేట మోడల్ స్కూల్‌లో స్వీపర్‌గా పని చేస్తోంది. శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో తల్లితో పాటు చిన్నారి మోడల్ స్కూల్‌కు వెళ్లింది. పాఠశాల సమీపంలో ఆడుకుంటున్న అక్షితపై అక్కడున్న వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. దీనిపై పత్రికల్లో వార్త రావడంతో బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి స్పందించారు. కాసిపేట ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ, ముత్యంపల్లి పంచాయతీ కార్యదర్శి మేఘనపై సుమోటో కింద కేసు నమోదు చేశారు. వారికి త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

గురుకుల సిబ్బందికి వేతనాలివ్వండి: హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దినోత్సవం నాడు ఆడంబరంగా ప్రకటనలు చేయడంకాదు రేవంత్‌రెడ్డీ.. గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్ రావు కోరారు. గురుకులాల్లోని 2500 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రెండునెలల నుంచి జీతాలు ఇవ్వనిదుస్థితి నెలకొందని.. ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యావ్యవస్థ దీనస్థితికి చేరడం శోచనీయమన్నారు. అక్కడి విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్‌తో పాటు విషజ్వరాలు, పాములు, ఎలుక, కుక్కకాట్లకు గురై ఆస్పత్రులకు వెళ్లి ప్రాణాలు కోల్పోయేపరిస్థితి దాపురించిందని విమర్శించారు. గురుకులాలను స్వయంగా పర్యవేక్షిస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయని, కల్తీ ఆహారం పెడితే జైలుకే అని ఆయన చేసిన ప్రకటనలు గాలిమాటలయ్యాయన్నారు.

రచయిత్రి, కాలమిస్టు.. రమాదేవికి కాళోజీ పురస్కారం

- 9న ప్రదానం.. సీఎం అభినందనలు



హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, కాలిమిస్టు నెల్లుట్ల రమాదేవి 2025కి గాను ప్రజాకవి కాళోజీ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందె శ్రీ నేతృత్వంలోని కమిటీ రమాదేవిని ఈ ఏడాది పురస్కారానికి ఎంపిక చేసింది. సెప్టెంబరు 9న రవీంద్రభారతిలో జరిగే కాళోజీ జయంతి వేడుకల్లో రమాదేవికి పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. కాగా, కాళోజీ పురస్కారానికి ఎంపికైన రమాదేవికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

10 వారాలకు కోటి జీతం!

- అనంత వాసికి అమెరికాలో భారీ ప్యాకేజీ


సాయిసాకేత్

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగి శంకర నారాయణ, మీనాక్షిదేవి దంపతుల మనవడు కొప్పు సాయిసాకేత్ అమెరికాలో భారీ ప్యాకేజీతో ఉద్యోగం సాధించాడు. పది వారాలకు రూ.కోటి జీతంతో చికాగోకు చెందిన ఒప్టివర్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సాయిసాకేత్ ప్రస్తుతం అట్లాంటాలోని జార్జ్ టెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా ఇటీవల ఇంటర్వ్యూలకు హాజరయ్యాడు. బీటెక్ మరో ఏడాది మిగిలి ఉండగానే భారీ ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సాకేత్ తండ్రి కొప్పు రమేశ్ అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రంలో ఐటీ సైబర్ సెక్యూరిటీ లీడర్‌గా పనిచేస్తున్నారు. ఎంఎస్ పూర్తయిన తర్వాత ఏడాదికి రూ.5 కోట్ల ప్యాకేజీ వచ్చే అవకాశం ఉందని సాయిసాకేత్ తాతయ్య శంకర నారాయణ తెలిపారు.

బిహార్ ఓటమి భయంతోనే జీఎస్టీ సంస్కరణలు : నారాయణ

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే తొమ్మిదేళ్ల తర్వాత మోదీ ప్రభుత్వం జీఎస్‌టీ శ్లాబులను తగ్గించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండి కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటేయకపోతే బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అవగాహన ఉందనుకునే పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్ఎస్ అవినీతిపై కవిత వ్యాఖ్యలను దర్యాప్తు సంస్థలు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కవిత వ్యాఖ్యలతో కేసీఆర్ బాధ్యతగా సమాధానం చెప్పాలన్నారు. కూనంనేని మాట్లాడుతూ.. తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటేస్తారా..? లేదా? అన్న విషయమై బీఆర్ఎస్.. స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

నిమజ్జనం సంపూర్ణం!

రాష్ట్ర వ్యాప్తంగా ముగిసిన వినాయక నిమజ్జనాలు.. గ్రేటర్ హైదరాబాద్‌లో గంగమ్మ ఒడికి 2.70 లక్షల విగ్రహాలు

- పోలీసు, జీహెచ్ఎంసీ సహా వివిధ శాఖలకు సీఎం అభినందనలు
- ఊరేగింపుల్లో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 170 మందిపై కేసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


ఆదివారం ఉదయం ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

వినాయక చవితి సందడి ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు పూర్తయ్యాయి. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి వరకు 3,03,585 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తర్వాత ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ వైపునకు నగరంలోని ఇతర విగ్రహాలను అనుమతించారు. చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం రాత్రి ఏడు గంటల్లోపే అన్ని చోట్ల నిమజ్జనాలు పూర్తి చేశారు. దిల్‌సుక్‌నగర్ కొత్తపేట పరిధిలోని సమతాపురి కాలనీలో ఏర్పాటు చేసిన 63 అడుగుల వినాయక విగ్రహాన్ని నిర్వాహకులు ఫైరింజన్ల సాయంతో అదే చోట నిమజ్జనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శోభాయాత్రలు సజావుగా సాగేందుకు కృషి చేసిన మునిసిపల్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీ, ఇతర శాఖల సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులు, క్రేన్ ఆపరేటర్లకు అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జన వేడుకలు 40 గంటలపాటు కొనసాగాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. 40 అడుగులు కంటే ఎత్తున్న విగ్రహాల సంఖ్య పెరగడంతో ఈసారి శోభాయాత్ర కొంత ఆలస్యమైందన్నారు. నిమజ్జన ఊరేగింపుల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన 170 మందిని గుర్తించి కేసులు నమోదు చేశామని తెలిపారు. అలాగే, ఊరేగింపుల్లో చిన్నపాటి గొడవలకు సంబంధించి 5 కేసులు నమోదయ్యాయని, పిక్ పాకెటింగ్ కేసుల్లో మరికొందరిని పట్టుకున్నామని సీపీ వివరించారు.

టస్కర్ కిందపడి పారిశుధ్య కార్మికురాలి మరణం

ఆదివారం ఉదయం హైదరాబాద్, బషీర్‌బాగ్ వద్ద విధి నిర్వహణలో ఉన్న జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలు రేణుక(50) రోడ్డు దాటే క్రమంలో టస్కర్ కింద పడి మరణించారు. కాగా, శనివారం రాత్రి సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనానికి లారీపై తరలిస్తున్న భారీ వినాయక విగ్రహం దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తా వద్ద పక్కన వెళుతున్న కారు బానెట్‌పై పడింది.

శోభాయాత్రలో డ్యాన్స్ చేస్తూ కానిస్టేబుల్ మృతి


డేవిడ్ (ఫైల్)

గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన గణేశ్ నిమజ్జనోత్సవాల సందర్భంగా శోభాయాత్రలో డ్యాన్స్ చేస్తుండగా గుండెపోటుకు గురై మల్కాజిగిరికి చెందిన ట్రాఫిక్ పోలీసు కానిస్టేబుల్ కే.డేవిడ్(31) ప్రాణాలు కోల్పోయారు. ఘట్‌కేసర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న డేవిడ్ విధులు ముగించుకున్న తర్వాత.. శనివారం రాత్రి స్నేహితులతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్నారు. ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. డేవిడ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. డేవిడ్‌కి భార్య మూడు నెలల కుమార్తె ఉన్నారు.

ఆ డీఈఈనే చీఫ్ ఇంజినీర్!

- ఎస్ఈగా ఒక్క రోజైనా అనుభవం లేకుండా సీఈ పోస్టు కట్టబెట్టారు
- గిరిజన సంక్షేమ శాఖలో కీలక పోస్టుల్లో డీఈఈలే చలామణీ

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎం.బాలు.. ఈయనది అసలు పోస్టింగ్ ములుగు జిల్లా ఏటూరునాగారం సబ్ డివిజన్‌లో! ఈయన హోదా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ). ఈయనకే గిరిజన సంక్షేమ శాఖ హైదరాబాద్‌లో మైదాన ప్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలలు తిరగకుండానే గత నెల 30న ఏకంగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)తో సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ)గా నియమించారు. అదే రోజున ఇంజనీరింగ్ విభాగంలో కీలకమైన రాష్ట్రస్థాయి చీఫ్ ఇంజనీర్(సీఈ)గా కూడా బాధ్యతలు అప్పగించారు. వాస్తవానికి ఒక్క రోజైనా ఎస్ఈగా పనిచేసిన అనుభవం ఆయనకు లేదు. బాలు అనే డీఈఈనే సీఈగా రూ.50 లక్షలకు పైబడిన.. వేల కోట్ల విలువైన టెండర్ల సాంకేతిక అంచనాలు తయారుచేసి ఎస్ఈకి పంపితే ఆయన టెండర్లు పిలుస్తారు. ఈఈగా చెక్ పవర్‌తో కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తారు. ఎందుకిలా అని ఎవరైనా అడిగితే పరిపాలనా సౌలభ్యం కోసం తప్పదని ఉన్నతాధికారులు టక్కున చెప్పే సమాధానం. ఈయనతో పాటు మరో ఇద్దరు డీఈఈలు కూడా రెండేసి పదవుల్లో కొనసాగుతున్నారు. హైదరాబాద్ సబ్ డివిజన్‌లో డీఈఈగా పనిచేసే ఆర్డీ ఫణికుమారికి చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ప్లానింగ్ అండ్ మానిటరింగ్ ఈఈ బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఆమెను వరంగల్ ఎస్ఈగా కూడా నియమించారు. ఇలా గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో 82 పోస్టులు ఖాళీగా ఉండగా కిందిస్థాయి అధికారులకే కీలకమైన ఉన్నతస్థాయి పోస్టులు అప్పగిస్తున్నారు. ఐటీడీఏల్లో కూడా 208కిగాను 166 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో అధికారి రెండు మూడు పోస్టుల్లో ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు.

మహేశ్ ఆత్మహత్యకు రేవంత్, సీతక్కదే బాధ్యత

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు మునిసిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు మహేశ్ ఆత్మహత్యకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నెలలతరబడి వేతనాలు చెల్లించని కారణంగానే మహేశ్ ఆత్మహత్యచేసుకొని చనిపోయారని, ఈ దుస్థితిని తెచ్చినందుకు సీఎం, మంత్రి క్షమాపణలు చెప్పాలని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఫోన్‌లో మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు మహేశ్ భార్యకు ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. లేదంటే బాధితుని కుటుంబంతోపాటు, జీతాలందని కార్మికులకు న్యాయం జరిగే వరకూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాయకుడు రావినారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా కేటీఆర్ ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రాంత రాజకీయ చైతన్యానికి, పోరాట స్ఫూర్తికి నిలువెత్తు రూపమైన కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి అని పేర్కొన్నారు.

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

ఆరుద్ర శతజయంతి

సాహిత్య అకాడమి - రైటర్స్ అకాడమి, విశాఖపట్నం సంయుక్త నిర్వహణలో ఆరుద్ర శతజయంతి కార్యక్రమం సెప్టెంబరు 13 ఉ.10గంటల నుంచి పౌరగ్రంథాలయం హాల్, ద్వారకానగర్, విశాఖపట్నంలో జరుగుతుంది. సభలో సి. మృణాళిని, మేడిపల్లి రవికుమార్, వివి రమణమూర్తి, మేడా మస్తాన్ రెడ్డి, చింతకింది శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారు. ఎస్. రఘు, తలతోటి పృథ్వీరాజ్, అయ్యగారి సీతారత్నం తదితరులు పత్రసమర్పణ చేస్తారు. సాయంత్రం 4.30 నుంచి మొదలయ్యే 'కవిసంధి' కార్యక్రమంలో భాగంగా బులుసు వేంకటేశ్వర్లు తమ కవితలను చదువుతారు.

సాహిత్య అకాడమి

మరో గ్రంథాలయ ఉద్యమం

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 8 సోమవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సుందరయ్య పార్క్ నుండి చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ వరకు 'వాక్ ఫర్ బుక్' కార్యక్రమంలో భాగంగా పుస్తకం కోసం నడిచే కార్యక్రమం జరుగుతున్నది. తెలుగు రాష్ట్రాలలో అన్ని జిల్లాలలో ఈ కార్యక్రమం జరుగుతుంది. వివరాలకు: 8801910908.

మంచికంటి

సాహిత్య పురస్కారం

తాటికొండాల భ్రమరాంబ సాహిత్య పురస్కారాన్ని 2025 కు గాను ఏనుగు నరసింహారెడ్డి అందుకుంటారు. సెప్టెంబరు 13 సా.6గంటలకు ఖమ్మం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో పురస్కార ప్రధానం, 'నెనరు–నెమరు' కవిత్వ సంపుటి ఆవిష్కరణ ఉంటాయి. సభలో ప్రసేన్, సీతారాం, స్వర్ణ కిలారు, ఆనందాచారి, మువ్వా శ్రీనివాసరావు, రవి మారుత్, గుడిపాటి, గౌరీ శంకర్, నీలిమ, వి.ఎస్. రావు తదితరులు పాల్గొంటారు.

వంశీకృష్ణ

రెండుతరాల కవిసంగమం

రెండుతరాల కవిసంగమం (సీరీస్- 43)కార్యక్రమం సెప్టెంబర్ 13 సా.6 గంటలకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. కవులు హనీఫ్, ఎదిరెపల్లి కాశన్న, మాలతి పల్లా, సలీం, జుర్కి లావణ్య (నిజాంకాలేజి ఎం.ఎ విద్యార్థి).

కవిసంగమం

సింగిల్ పేజీ కథల పోటీ

వంశీ ఆర్ట్ థియేటర్స్ సాహితీకిరణం మాసపత్రిక సౌజన్యంతో రామరాజు వేంకట సుబ్బారావు-లక్ష్మీనరసమ్మ స్మారక సింగిల్ పేజీ కథలపోటీ నిర్వహిస్తున్నది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, 3వేలు, 2వేలు. రూ.1000 చొప్పున పది ప్రత్యేక బహుమతులు. సామాజిక అంశాలతో కథలను డి.టి.పి.లో ఒక పేజీ లోపు (ఫాంట్ 16, ఎ4 సైజులో) రాసి సెప్టెంబర్ 30 లోపు చిరునామా: ఎడిటర్, సాహితీకిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ -500102 కు పంపాలి. వివరాలకు: 9490751681.

పొత్తూరి సుబ్బారావు



గిరిగీత

అహంభావమూ ఆత్మగౌరవానికి
ఒక అవశ్యకమైన కంఠాభరణమే

వక్ర మతులు మర్మజాలాల విసురు
కుత్సితాలనెదురొడ్డు అదొకానొక
అత్యావశ్యకమైన రక్షక వలయమే

ఎటొచ్చీ సాటి స్వాభిమానాల
మనుగడను పనిగట్టుకొని
గురుతెరుగనోర్వని అదుపు దప్పిన
దురహంకారమే ఒక ఏవగింపు

ఆత్మన్యూనతల్ని కప్పిపుచ్చుకునే
దిక్కుమాలిన ప్రాకులాటలో
పూనుకొని పరుల ప్రతిష్ఠల్ని
అవమానించ జూసే క్షణికానందపు
దురభిమానమూ ఒక ఓకరింతే

కీకారణ్యపు కారుచీకట్ల నడిబొడ్డున
నీకు నువ్వే ప్రతిష్ఠించుకున్న
సింహాసనాన్ని అధిష్ఠించి
సకల భూమండల సామ్రాజ్యపు
ఏకైక అధిపతివి నువ్వని
రొమ్ము విరిచి మీసాలు మెలిపెట్టి
గిరిగీసుకున్న నీ బింకాలు
ఏ పునాదుల ఆదరువులూ లేని
ఉత్తిత్తి భ్రమల గాలిమేడల పేటికలు

నీ కండ్ల గమ్మిన కారుచీకట్ల
పొరల మైకాన్ని విదిలించుకుని
ఏ నిమిత్తమూ లేకనే
నువ్వు చొరబడ్డ ఊబిలోనుంచి
ఇంగితపు సోయివై బైటపడి
సమస్త లోకాలు ఇంపుగా అలరారి
తులతూగు వెలుగురేఖల్ని జూడు

ఊహల్ని వసంత వర్ణమాలికల చేసి
మనసుపడి మురిపెంగ అల్లుకున్న
లేతపచ్చని కలల కుటీరాల లోగిళ్ళలో
స్వేచ్ఛా నినాదమై ఒద్దికగ నడయాడు
పైరగాలుల మోదముల జూడు

పైరగాలుల రెక్కల పైన
ఎగిసెగిసి నాక లోకాల చెక్కిళ్ళపై
సుతిమెత్తగా ముద్దులిడ తారాడు
విహారుల ఆర్ద్ర మోములను జూడు

ఆర్ద్ర మోముల నుంచి ఉబ్బిపడి
శీతరుతు తొలి సంజె పొద్దులో
లేలేత గడ్డిపరకల చివరంచు
నీటి బిందువుల వోలె నర్తించు
ఆనంద పరవశాలను జూడు

ఆ సుందర లోకాల విహారులు
తాముగా ఆశపడి నిర్మించుకోనట్టి
ఎవరి సామ్రాజ్యాలకు వారే
ఎటువంటి అధికార పీఠాల
తావులసలెరుగని
సత్య సార్వభౌమాధిపత్యాలు

ఒకరి సామ్రాజ్యపు హద్దులు
వేరొకరు మీరనే మీరని
ఆ సుందర గగన విహారులే
తాముగా ఆశపడి నిర్మించుకోనట్టి
ఎవరి సామ్రాజ్యాలకు వారే
ఎటువంటి రాజ్యాంగ స్వామ్యాల
ఎరుకలసలొల్లని
నిత్య పీఠాధిపత్యాలు

కండ్ల గమ్మిన కారుచీకట్ల
పొరల మైకాన్ని విదిలించుకుని
ఒక్కగానొక్క సారన్న బైటపడి
నీ బింకాల భ్రమలకు కనువిప్పు

కలుగునో లేదో కూసింత సేపన్న
ఆ వెలుగురేఖలు విరజిమ్ము
సుకుమార సోయగాలను జూడు

ఏ ఆభిజాత్యాల ఊసులసలెత్తని
ఆ సార్వభౌమాధిపత్యాల
నైర్మల్య నిర్వికారముల జూడు


ఏ హెచ్చుతగ్గుల రేతులసలెన్నని
ఆ పీఠాధిపత్యాల
సౌశీల్య సంస్కారముల జూడు

నీ బింకాల భ్రమలకు కూసింత
కనువిప్పు కలుగునో లేదో
నీ నుంచి నువు కాసేపు వైదొలిగి
నిన్ను నువు
ఒక్క సారన్న తేరిపార జూడు

■ **బైరెడ్డి కృష్ణారెడ్డి**
✆ 94400 72211



బసవన్న ముగ్ధభక్తి



1.

బసవణ్ణ (1131-1167) లేదా బసవేశ్వరుడి గురించి ఇంకా పరిశోధనలూ అధ్యయనాలూ కొనసాగుతూనే ఉన్నాయి. ఈయన 12వ శతాబ్దానికి చెందిన వ్యక్తి. సామాజిక, ధార్మిక, సాహితీ రంగాల్లో బసవన్న తెచ్చిన విప్లవం అనూహ్యమైనది (నిజానికి బసవణ్ణ అనే అనాలి, ఎందుకంటే కన్నడలో 'అణ్ణ' అంటే జ్యేష్ఠ సోదరుడనీ 'అన్న' అంటే అన్నమనీ అర్థాలున్నాయి. అయితే తెలుగు పాఠకుల కోసం బసవన్న అనే మార్చి రాస్తున్నాను). ఈ శివాద్వైతి త్రికరణశుద్ధిగా నమ్మిందే చెప్పాడు, చేశాడు, బోధించాడు. ఇటువంటి వ్యక్తులు ఎంత అరుదంటే, గాంధీ గురించి ఐన్‌స్టీన్ అన్నట్టుగా, ఈయన కొన్ని శతాబ్దాల క్రితమే మన దేశంలోనే అదీనూ పొరుగు రాష్ట్రంలో పుట్టి, జీవించి ప్రపంచాన్ని గౌతమ బుద్ధుని తరువాత అంతగానూ ప్రభావితం చేసిన వ్యక్తి అంటే నమ్మడం కష్టం. బసవన్న చెప్పినవీ రాసినవీ వచనాలు. వచనం అంటే, thing said అని ఎ.కె. రామానుజన్ అనువాదం. తెలుగు పాఠకులకు వచనం అన్నమాటను వేరే అనువదించి చెప్పక్కర్లేదు, అయినా బసవన్న వచన సారళ్యత తెలియజేసేందుకు ఎ.కె. రామానుజన్ ప్రసక్తి తెచ్చాను. బసవన్న ఎన్ని వచనాలు రాశాడన్నదీ, ఇవాళ బసవన్న వచనాలని ప్రచారంలో ఉన్నవాటిల్లో ఏవి ప్రక్షిప్తాలన్న విషయమూ నేటికీ పరిశోధనాంశాలే. ఈ పరిచయంలో నేను పరిశోధనల వైపు పోను. బసవన్న వచనాలను చాలామంది అనువదించారు. తెలుగులోనూ ఇవి ఇంతకు ముందు లభ్యమే. చినవీరభద్రుడి అనువాదం సరళమైన ఆధునిక తెలుగు వాక్యాన్నే ఆధారం చేసుకున్నది. మూలంలో కనిపించే బసవన్న పొందిన ఆధ్యాత్మికానుభూతిని సామాజిక బాధ్యతనూ ఈ అనువాదకుడు తెలుగు పాఠకుల్లో కలిగించాడు.

చినవీరభద్రుడిని తను రచనలు చేస్తున్న తొలినాళ్ళ నుంచీ నేను ఎరుగుదును. చినవీరభద్రుడు ఏ కవిలోనైనా ప్రతిభ ఉంటే కవి ప్రతిభావంతుడనే అంటాడు. చాలా మందిలో ప్రతిభతో పాటుగా వ్యుత్పత్తీ, అభ్యాసమూ కనిపించడం కద్దు. త్రికరణ శుద్ధి ఉన్న నైతిక మనీషిని మాత్రమే చినవీరభద్రుడు "ఈయన కదా మానవుడంటే" అని అబ్బురపడతాడు, హారతి పడతాడు. చినవీరభద్రుడు బసవన్న వచనాలను అనువదించడంలో నాకు ఒక న్యాయం కనిపించింది. న్యాయం అంటే, T.S. Eliot St. John Perse ని అనువాదం చెయ్యడంలో కనిపించే న్యాయం. న్యాయం అంటే, శ్రీశ్రీ మయకోవ్‌స్కీని అనువదించడం లాంటి న్యాయం. పరిణతజ్ఞానంతోనూ అనుకంపించే హృదయంతోనూ సమాజాన్నీ మనిషినీ ప్రేమించే కవి సామాజిక, నైతిక, ధార్మిక, సాహితీ దిగ్గంతిని "ఇతను కదా మానవుడు" అని ఆనందబాష్పాల మధ్య పెట్టిన కేక ఈ అనువాదం. చినవీరభద్రుడు అనువదించిన మూడువందల (299 + 1 అధికవచనం) బసవన్న వచనాలు చినవీరభద్రుడు మనసు పెట్టి రాసిన ఏ కవితైనా బాగున్నట్టే, ఇవీ బాగున్నాయి. అది చెప్పడం కాదు, ఈ పరిచయం ముఖ్యోద్దేశం, ఈ పుస్తకానికి చినవీరభద్రుడు రాసిన ఏభై పేజీల ముందుమాట ముఖ్యం. పాఠకులీ ముందుమాటను ముందే చదివినా సరే, లేక, నా లాగ, బసవన్న వచనాలు చదివిన తరువాత చదివినా సరే, ఈ ముందుమాటలో ఉంది అసలు రహస్యం.

"ఎడమ చేతిలో పాలగిన్నె/ కుడి చేతిలో బెత్తం పట్టుకొని" వస్తున్న బసవన్న చినవీరభద్రుడిని ఎలా ఆకట్టుకున్నదీ, మన దేశంలో వివిధ ధార్మికమతనాల అంతస్స్రోతం, ఏ ధర్మవీరుణ్ణైనా ఎలా అనుసరించాలో తెలిసీ తెలియని తనంతో తదనుయాయులు చేసే పనులూ, ధర్మసంస్థాపకుడి నిర్యాణానంతరం అనుయాయుల్లో కనిపించే చీలికలూ, ప్రజలు ఏ మతాన్నైనా ఎవరు చెప్పినా ఎందుకు నమ్మాలన్న చింతనా, దాదాపుగా అసలు మనిషికి ఏం కావాలన్న తొలి ప్రశ్న- ఇన్ని వివరాలూ ఈ ముందుమాటలో ఉన్నాయి. ఇంతే కాక, బసవన్న ఉపనయ కర్మను తిరస్కరించి, పుష్కరకాలం గురుకులంలో చదువుకొని అన్ని వేదవేదాంగాలూ అభ్యసించి లింగధారియై శివాద్వైతిగా ఏకేశ్వరోపాసన చేస్తూ జంగమదేవరలను కొలుస్తూ ప్రజల భాషలో ప్రజల కోసమై చెప్పిన వచనాల origin and provenance కూడా ముందుమాటలో ఉన్నాయి. చినవీరభద్రుడికి ఈ పుస్తకానికి ముందుమాట రాయడానికే ఎక్కువ టైమ్ పట్టిందా లేక బసవన్నను అనువదించడానికి ఎక్కువ టైమ్ పట్టిందా? ఏమో!

2.

ఇవి బసవన్న రాసిన (చెప్పిన) షట్‌స్థల వచనాలు. బసవన్న భక్తి జ్ఞానభక్తి అనీ శాంతభక్తి అనీ కొందరనగా చినవీరభద్రుడు బసవన్నది ముగ్ధభక్తి అని నమ్ముతున్నాడు. బసవన్న కాలపు వీరశైవం నిమ్నకులస్థులకు శివదీక్షనిచ్చినా వారిని తమతో కలుపుకోలేదు. ఇక్కడ బసవన్న క్రాంతదర్శిగా కనిపిస్తూ అందరినీ కలుపుకున్నాడు. అందరూ ఒక్కటే అని నమ్మిన శివాద్వైతి నుంచి అందరూ ఏమాశిస్తారో అదే చేశాడు బసవన్న. కనుకనే ప్రజ పెద్ద ఎత్తున స్పందించీ

> **భారతదేశంలో భక్తికవులు చూపిన వెలుగులో తమ తమ రాజకీయ, సామాజిక మేనిఫెస్టోలను కార్యాచరణలనూ రూపొందించుకున్న గాంధీ, అంబేద్కర్ వంటి వారు సాధించిన విజయాలను వామపక్ష రాజకీయాలు సాధించలేకపోవడానికి కారణం, విప్లవ పక్షాలకు భక్తికవి లేకపోవడమే అని చినవీరభద్రుడు అంటున్నాడు.**



బసవన్న అనుయాయులయ్యారు. శంకరుడూ, రామానుజుడూ తాత్త్వికంగా సత్యమొకటే అని ప్రతిపాదించినా, వ్యవహారంలోకి వచ్చినప్పటికి వారికి ఉన్న అడ్డంకులను బసవన్న తోసిరాజని నమ్మిన సత్యాన్నే ఏకేశ్వరోపాసననే ఉద్ఘాటిస్తూ అట్టడుగున ఉన్న అణగారిన ప్రజల పక్షం వహించి positive discriminationని తొలిగా కనబర్చాడు. సహజంగానే బసవన్న ప్రభావం కొన్ని వర్గాలకు కంటగింపై అతని మీద ఫిర్యాదులు పుట్టాయి. అవి రాజు దాకా వెళ్ళినా, బసవన్న మారలేదు. చివరికి కూడల సంగమం చేరి బసవన్న అక్కడే శివైక్యం చెందాడు.

భారత దేశంలో భక్తికవులు చూపిన వెలుగులో తమ తమ రాజకీయ, సామాజిక మేనిఫెస్టోలను కార్యాచరణలనూ రూపొందించుకున్న గాంధీ, అంబేద్కర్ వంటి వారు సాధించిన విజయాలను వామపక్ష రాజకీయాలు సాధించలేకపోవడానికి కారణం, విప్లవ పక్షాలకు భక్తికవి లేకపోవడమే అని చినవీరభద్రుడు అంటున్నాడు. ఇక్కడ చెరబండరాజు ఒక exception అని నేను నమ్ముతాను. ఏ మతానుయాయులైనా తమ మతం social ascendancy లో ఉండగా లభించిన privileges కు బానిసలై ఐహిక సుఖాల్లో ఓలలాడుతూంటే, క్రమేపీ వారి మతం అంతస్సంఘర్షణకు లోనై బలహీనపడుతుందనీ చినవీరభద్రుడు చారిత్రక ఆధారాలతో చెబుతున్నాడు. నిజానికిక్కడ సమాజంలో ఉన్నది బహుదేవతారాధనా లేక ఏకేశ్వరోపాసనా అన్నది కాదు, మత పెద్దల నైతిక నడవడి ఎటువంటిదనేదే ప్రశ్నగా నిలుస్తోంది.

3.

బసవన్న శివాద్వైతానికి ఉదాహరణ: (వచనం 139):

"శివభక్తుడుండే చోటే శివలోకం
అతడి ఇంటి ముంగిలి వారణాసి
అతడి కాయమే కైలాసం."

బసవన్న తరువాతి వారైన శ్రీనాథుడ్నీ ధూర్జటినీ మేల్కొలిపిన వచనం 161:

"ముదిమికి నీ ముఖకళ మాసిపోక ముందు
మృత్యువు ముట్టక ముందు
పూజించు, కూడలసంగమదేవుని"

ఈ కింది వచనం 174 ఎన్నో భాషల్లో సామెత అయిపోయింది.

"రేపూ మాపూ మర్నాడూ అనొద్దు
శివుడ్ని
వేడుకోడానికి
ఈ రోజే
మంచి రోజు"

ఈ కింది వచనం 255 బసవన్న వ్యక్తుల పైపై మెరుగులకూ ధార్మికచిహ్నాలకూ విలువనివ్వడనీ, శివ శరణులనే ఎన్నుతాడనీనూ తన భక్తి గూర్చీనూ చెపుతోంది:

"పొడిపించుకొని
భక్తులమయ్యామంటారు
తల నరుక్కుని భక్తులమయ్యామంటారు.
గుండు కొట్టించుకొని
భక్తులమయ్యామంటారు
తిట్లు తిట్టించుకొని
భక్తులమయ్యామంటారు

కూడలసంగన
శరణుల్ని పట్టించుకోక-
నా భక్తి సగమయ్యింది"

బసవన్న వినయశీలతనూ భక్తిగాంభీర్యతనూ చూపెట్టే వచనం:

"ఎప్పటికీ మిమ్మల్నే
తలుచుకుంటూ ఉండేవారి
ఇంటికుక్కగా
ఉండనివ్వు నన్ను"

దైవం మానుష రూపేణా:

"భక్తికి నిరుపేదనయ్యా నేను
కక్కయ్య ఇంట్లో యాచించాను
చెన్నయ్య ఇంట్లో యాచించాను
దాసయ్య ఇంట్లో యాచించాను
పురాతన భక్తులందర్నీ
గుర్తుపట్టి
పోయి వేడుకున్నాకనే
కూడలసంగమదేవా!
నా భక్తిభిక్షాపాత్ర
నిండిందయ్యా"

చినవీరభద్రుడు ఈ అనువాదానికి జోడించిన అదనపు నవ్యత ప్రతి వచనానికీ దాని మొదటి పంక్తిలోని మాటల్నే శీర్షికగా పెట్టడం. చివరిగా ఒకే ప్రశ్న మిగిలిపోతుంది. బసవన్నలో ఇంత బహుముఖీనమైన ప్రజ్ఞతోపాటూ హిమాలయం అంతెత్తెదిగిన నైతికతకూ నమ్మిన విశ్వాసాలకు చూపిన నిబద్ధతకూ మూలమనదగినవయిన బసవన్న బాల్యంలోని అనుభవాలేమిటి? ఇది బహుశా భవిష్యత్తరం కనుక్కోవాలి.

■ **వాసు**
✆ 99011 55133

ఓ జ్ఞాపకం ఓ రాత్రి

తన జ్ఞాపకం
ఒక వ్యక్తాతీత అనుభవం
రెండు హృదయాల బహిరంతర సంగమం
అనేక ప్రశ్నలు లుంగచుట్టుకున్న
పల్చటి నిశ్శబ్దం
పిడికిట్లోంచి జారిపోతున్న అస్పష్ట ప్రేమపత్రం

చెట్ల కొమ్మల్లో ముడుచుకుంటున్న
చీకటి పిట్టలు
ఎద ముంగిట తచ్చాడుతున్న చిక్కని పరిమళం
తలుపు తట్టిన ఊపిరి చప్పుడు
తెరిచేందుకు సహకరించని అవయవ వ్యవస్థ

నువ్వు ఎప్పుడు వచ్చావో గుర్తులేదు
వెళ్లిపోవడం మాత్రం..
గుండె కొట్టుకుంటున్న ప్రతీసారి గుర్తు వస్తోంది
నువ్వు వచ్చి వెళ్లిన దారి నాకు తెలుసు
నువ్వు అసలు రాకుండా ఉంటే బాగుండేదేమో..!

దుఃఖాన్ని కప్పుకున్న ఈ రాత్రి
సన్నటి నిట్టూర్పుతో ఒళ్ళు విరుచుకుంది

గుమ్మం బయట పొగ మంచు వాన
దూరం నుంచి సముద్రం పిలుస్తున్న కేక
ఆ ఒంటరి పక్షికి ఎంతకూ నిద్ర పట్టదు
విషాదగీతమేదో గుండెలోనుంచి ఆలపిస్తుంది

నువ్వు వెళ్లిన రోజు నాకు గుర్తుంది
నా చెవి అంచున నీ గుండె చప్పుడు
ఇంకా వినపడుతూనే ఉంది
అయినా నువ్వు రాకుండా ఉండాల్సింది..
వచ్చినా.. వెళ్ళేటప్పుడు నీ స్మృతుల చిహ్నాల్ని
చెరిపేసి పోవాల్సింది..!

■ **సునీత గంగవరపు**
✆ 94940 84576



బౌద్ధ దృక్పథంతో తెలుగులో మొదటి కథా సంకలనం

బౌద్ధం నేపథ్యంగా కథా సంకలనం తేవాలన్న ఆలోచన ఎందుకు కలిగింది? దీనికి ఎలాంటి పరిశోధన చేయాల్సి వచ్చింది?

బుద్ధుడికి సంబంధించిన జీవిత చరిత్ర, బౌద్ధ గాథలు, జాతక కథలు చిన్నప్పటి నుంచి మనసు మీద గాఢమైన ముద్రవేశాయి. స్వీయ సత్యాన్వేషణలో బౌద్ధం ప్రధాన పాత్ర వహించింది. బుద్ధుడు పేరెత్తగానే మనసంతా ఒక రకమైన ప్రశాంతతకు లోనవుతుంది. ఈ అలౌకికమైన ఆకర్షణ, ప్రత్యేకత బౌద్ధ ధర్మాలలోనే కాదు బుద్దిస్ట్ ఈస్థటిక్స్‌లో కూడా ఉన్నాయి. బౌద్ధానికే చెందిన ప్రత్యేకమైన భాష, చిత్రకళ, శిల్పం, సాహిత్యం మన మిగతా సాంప్రదాయకమైన సాంస్కృతిక వాతావరణానికి భిన్నంగా ఉంటాయి. తెలుగు సమాజంలో ప్రొఫెసర్ లక్ష్మీనరసు మొదలుకొని అన్నపరెడ్డి బుద్ధఘోషుడు వంటి అనేక మంది లబ్ధప్రతిష్ఠులు తమదైన మార్గంలో బౌద్ధం మీద విశేషమైన కృషి చేశారు. తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి గారి జాతకకథలు తరవాత తెలుగు సాహిత్యంలో బౌద్ధం మీద కథల పరంగా నిర్దిష్టమైన సంకలనం లేదు. బౌద్ధంలోని కథలు పద్య రూప కావ్యాలుగా, రవీంద్రుని అనువాదాలుగా, ధమ్మపద కథలు వంటివి కూడా వచ్చాయి. ఇవన్నీ చాలావరకు గ్రాంథిక భాషలో ఉండిపోయాయి. ఈ సందర్భంలో గురజాడ మొదలుకుని శ్రీసుధ మోదుగు వరకు బౌద్ధం పునాదిగానో, చారిత్రక నేపథ్యంగానో వచ్చిన సృజనాత్మక కథలను ఒక సంకలనంగా తెస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. పైగా 'ఆధునికాంధ్ర కవిత్వంపై బౌద్ధమత ప్రభావం' అనే అంశంపైన అధ్యయనం చేసి థీసిస్ సమర్పించి ఉన్నాను. బౌద్ధం పైన 'మిసిమి', 'బుద్ధభూమి' వంటి పత్రికలలో అనేక వ్యాసాలు రాసాను. ఈ పరిశోధనలో భాగంగా బౌద్ధం మీద సేకరించి పెట్టుకున్న కథలు ఇలా సంకలనంగా తేవడానికి ఉపకరించాయి. ఈ సందర్భంలో సహ సంపాదకులు అజయ్ ప్రసాద్ గారు తను కూడా కొన్ని బౌద్ధ కథలు సేకరించి పెట్టుకున్నానని చెప్పగానే ఆయన సహకారంతో ఈ పుస్తకాన్ని తేవడం జరిగింది.

మీరు ఎంపిక చేసుకున్న ఈ ఇరవై కథలు ఎలాంటి అంశాల చుట్టూ నడిచాయి?

అన్ని కథలకూ బౌద్ధమే ఉమ్మడి నేపథ్యం. కానీ భిన్నమైన కథాంశాలు సంకలనాన్నీ పరిపుష్టం చేస్తున్నాయి. బుద్ధుని కాలంలోనే ఆంధ్రదేశంలో బౌద్ధం ప్రవేశించింది అన్న అరుదైన గౌరవానికి చిలుకూరి ఉమామహేశ్వ శర్మ కథ 'బావరి' నిదర్శనమౌతుంది. అస్సక గణరాజ్యం ద్వారా అంటే నేటి తెలంగాణ నుండి ఆంధ్ర దేశంలోకి బౌద్ధం ప్రవేశించింది అనడం చారిత్రక సత్యం. బౌద్ధాన్ని స్వీకరించిన తొలి గురువు, జ్ఞానోదయం సందర్భంలో స్వయంగా బుద్ధుని నుండి మొదటగా భిక్షుక దీక్షను గ్రహించిన కొండన్న తొలి తెలుగు వాడు కాగా, బుద్ధుని కాలంలోనే ఆంధ్ర దేశానికి బౌద్ధాన్ని తెచ్చిన వారు బావరి.

గ్లోబల్ సమస్యగా మారనున్న అదే నీటి సమస్య బుద్ధునికాలంలో ఏర్పడినప్పుడు- ఒకరు పూర్తిగా నాశనం కావడంకన్నా, తాము కొంత నష్టపోవడంలో తప్పులేదని, కరుణతో మైత్రి భావనతో ఆలోచించి నిర్ణయం తీసుకోవలసింది భూమిని సాగు చేస్తున్న రైతులే కానీ ప్రభుత్వాలు కావు అని గొప్ప సందేశాన్ని తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి 'రోహిణి' ఇస్తుంది.

దుఃఖ కారణాన్ని తెలుసుకుంటే నివారణ మార్గం సులభమని చెప్పే బౌద్ధంలోని ఆర్యసత్యానికి పిలకా గణపతిశాస్త్రి 'సిద్ధార్థాన్వేషణ' కథ; ఆ ఆర్యసత్యానికి పొడిగింపుగా బాల్యంలో ఏర్పడిన అభిప్రాయాలు మనసు మీద గట్టి ముద్రను వేస్తాయని, ఆ ప్రభావంతో తమ జీవిత గమ్యాన్ని మలుచుకోవడం అపురూపమైన విషయమని కూనపరాజు కుమార్ 'లిటిల్ బుద్ధాస్' కథ, తాను చేసే తప్పులను సరిదిద్దుకునే అవకాశం బౌద్ధంలో లభిస్తుంది అన్నదానికి ఉదాహరణగా పాలగుమ్మి విశ్వనాథం 'మహాభినిష్క్రమణం' కథ నిలుస్తాయి.

ఒకప్పుడు పరిఢవిల్లిన బౌద్ధం క్షీణదశను చేరినప్పుడు ప్రజలలో వచ్చిన మార్పులను చెబుతూ, దానికి సామాజిక పరమైన కారణాలను కూడా అన్వేషించిన అజయ్ ప్రసాద్ కథ 'జాతక కథ', సముద్రాంతరాలను దాటి వ్యాపారాలు సాగించిన బౌద్ధాన్ని చూపించే ఉణుదుర్తి సుధాకర్ కథ 'పూర్ణ చంద్రోదయం', బౌద్ధం ఆంధ్రదేశంలో క్షీణ దశకకు వచ్చినా, సింహళంలోని మూల గ్రంథాలను కాపీ చేసుకు వచ్చిన నాటి బౌద్ధ భిక్షువుల సాహసాలను చెప్పే ఉణుదుర్తి సుధాకర్ మరో కథ 'తూరుపు గాలులు'... ఇలా ఇందులోని అన్ని కథలు దేనికదే ప్రత్యేకమైనవి.



సంపాదకులు: రాయదుర్గం విజయలక్ష్మి, బి. అజయ్ ప్రసాద్

3? మూడు ప్రశ్నలు

రాయదుర్గం విజయలక్ష్మి



ఈ పుస్తకం ద్వారా పాఠకులకు మీరు ఎలాంటి సారం అందాలని ఆశించారు?

వర్తమాన ప్రపంచ పరిస్థితులు మధ్యయుగాలనాటి మతయుద్ధాలకి ఏమాత్రం తీసిపోలేదని స్పష్టంగా మనకు అర్థమవుతో ఉంది. ముఖ్యంగా మన దేశంలో మతప్రాతిపదికన స్పష్టమైన విభజన రేఖలు ఏర్పడుతున్నాయి. ఈ వాతావరణంలో స్వేచ్ఛ, సమానత్వం మైత్రీభావం వంటి ఆదర్శ భావాలు కొరవడుతున్నాయి. ఇటువంటి ఆదర్శ భావాలు జన సామాన్యంలో మరింతగా విస్తరించడానికి బౌద్ధం సరికొత్త మార్గాన్ని చూపిస్తుంది. ఎవరికి వారు స్వీయానుభవంతో సత్యాన్వేషణ చేయడానికి తద్వారా వ్యక్తిగత జీవితంలోనూ, సమాజంలోనూ శాంతిని నెలకొల్పడానికి బౌద్ధం ఉపకరిస్తుంది. సమస్త శాంతి సౌభ్రాతృత్వాలకు సమాజంలో పునాదిగా పేరుకుపోయిన లోటుపాట్లను మరింత లోతుగా అర్థం చేసుకుని తొలగించుకోడానికి ఈ కథలు ఉపకరిస్తాయని మా నమ్మకం.

ప్రశాంతంగా గణపతి నిమజ్జనం : సీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణపతి నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 6,619 విగ్రహాలు నిమజ్జనం కాగా, సెంట్రల్ జోన్ పరిధిలో 2,766, ఈస్ట్‌జోన్ పరిధిలో 2,190, వెస్ట్‌జోన్ పరిధిలో 1,963 విగ్రహాలు వివిధ చెరువుల్లో నిమజ్జనం అయ్యాయన్నారు. నవరాత్రులు ప్రశాంతంగా ముగియడంలో సహకరించిన ఉత్సవ కమిటీలకు ధన్యవాదాలు తెలపడంతోపాటు కృషిచేసిన పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు.



వావ్.. రెడ్ మూన్!

- ఆకట్టుకున్న సంపూర్ణ చంద్ర గ్రహణం
- ఉమ్మడి జిల్లాలో తిలకించిన జనం

హనుమకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో ఆదివారం అద్భుతం జరిగింది. సంపూర్ణ చంద్రగ్రహణం అందరినీ ఆకట్టుకున్నది. రాత్రి 9.56 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి 1.26 గంటలకు ముగిసింది. మొత్తం 3.30గంటల పాటు ఈ సుదీర్ఘ గ్రహణం సంభవించింది. గ్రహణం సందర్భంగా పూర్తి ఎరుపు రంగుతో రక్త చంద్రుడిగా దర్శనమిచ్చాడు. 2018 తర్వాత భారత దేశంలోని అన్ని ప్రాంతాల్లో కనిపించిన మొదటి గ్రహణం ఇదే. 2022 తర్వాత ఇలాంటి గ్రహణం సంభవించడం ఇదే మొదటి సారి. ఇది రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం అయినందు వల్ల కొన్ని రాశులవారు ఈ గ్రహణాన్ని చూడరాదని పండితులు చెప్పారు. అయినప్పటికీ అదేం లెక్క చేయక వేలాది మంది భవనాలపైకి ఎక్కి, రోడ్ల మీదికి వచ్చి, ఎత్తైన ప్రాంతాలకు వెళ్లి గ్రహణాన్ని ఆసక్తిగా తిలకించడం కనిపించింది. ఈ గ్రహణం

(మిగతా 7లో..)



భద్రకాళి దేవాలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

ఆలయాల ద్వారబంధనం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గుడులను మూసేసిన అర్చకులు

6

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ప్రైవేట్ టీచర్స్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌లో హాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రైవేట్ టీచర్స్ ఫెలిసిటేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులందరూ వ్యక్తిగత విజయాలకు కాకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడుతూ వారి ద్వారా విజయాలు సాధించాలన్నారు. ప్రైవేటు టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి రాజీపడకుండా పనిచేస్తానన్నారు. ప్రైవేటు టీచర్లంతా సంఘటితమై హక్కుల కోసం పోరాడాలన్నారు. అనంతరం ప్రైవేటు టీచర్లతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం పలువురు టీచర్లను ఉత్తమ గురువులుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడియం రామచంద్రయ్య, ఐఎన్‌టీయూసీ కూర వెంకట్, టీజీఎస్టీయూ ఫౌండర్ ముజీబ్‌ఖాన్, ప్రెసిడెంట్ పర్హానా తాజీమ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

- మిల్స్‌కాలనీ పీఎస్‌లో పలు సెక్షన్‌లు
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

6



- 10 శాతం తగ్గుతుండటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు
- బైక్‌లపై రూ.60వేలు, కార్లపై రూ.1.50లక్షల వరకు తగ్గే అవకాశం
- రెండు వారాలు కొనుగోలు వాయిదా వేసుకుంటున్న జనం
- వ్యవసాయ ట్రాక్టర్లు, టైర్లు, పురుగు మందుల ధరలూ తగ్గింపు
- కేంద్రం జీఎస్టీ కొత్త టారిఫ్ ప్రకటనతో గణనీయ మార్పులు
- ఓరుగల్లులో భారీగా తగ్గిన కొనుగోళ్లు

వేచిచూద్దామా?!

ఈ నెల 22 నుంచి అమల్లోకి కొత్త జీఎస్టీ టారిఫ్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కేంద్ర ప్రభుత్వం కొత్త జీఎస్టీ టారిఫ్‌లను ప్రకటించటంతో ఓరుగల్లు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ నెల 22వ తేదీ నుంచి అనేక వస్తువులు, వాహనాలపై జీఎస్టీ భారం భారీగా తగ్గుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లను మరోరెండు వారాలు వాయిదా వేసుకుంటున్నారు. ప్రధానంగా వాహనాల కొనుగోళ్లలో హైదరాబాద్ తరువాత రెండోస్థానంలో ఉన్న వరంగల్‌లో.. కొత్త బుకింగ్‌లు భారీగా నిలిచిపోయాయి. సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలుపై కూడా ప్రభావం కనపడనుంది. వీటితోపాటు వ్యవసాయరంగానికి సంబంధించిన ట్రాక్టర్లు, పురుగు మందులు, నీటిపారుదల శాఖకు సంబంధించిన మోటార్లు, విద్యకు సంబంధించిన పుస్తకాలు, ఇతర వాటిపై కూడా జీఎస్టీ తగ్గింపు ప్రభావం ఉండనుంది. నిత్యావసర వస్తువులపై కూడా జీఎస్టీ తగ్గుతుండటంతో మధ్యతరగతి ప్రజలు సంతోషపడుతున్నారు. ఈ క్రమంలో 22వ తేదీ వరకు కొనుగోళ్లు నెమ్మదించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది ఓరుగల్లు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది.

వాహన మార్కెట్‌పై ప్రభావం

కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులు, వాహనాలు, నిత్యావసర సరుకులపై జీఎస్టీని భారీగా తగ్గించింది. ఈ మేరకు సెప్టెంబరు 3వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. దసరాకు పది రోజుల ముందు సెప్టెంబరు 22వ తేదీ నుంచే తగ్గించిన కొత్త జీఎస్టీ అమల్లోకి వస్తుందని కేంద్రం ప్రకటించింది. దీంతో అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉన్న ఓరుగల్లు ప్రజలకు ఊరట కలుగనుంది. ప్రధానంగా జీఎస్టీల తగ్గింపు ప్రభావం వాహన మార్కెట్‌పై తీవ్రంగా కనిపించనుంది. ప్రభుత్వం సెప్టెంబరు 3న కొత్త జీఎస్టీ శ్లాబులను ప్రకటించటంతో వాహనాలు కొనుగోలు చేయాలనుకునేవారు ఆలోచనలో పడ్డారు. కొత్త జీఎస్టీలో 28శాతం నుంచి 18శాతానికి వాహనాలపై జీఎస్టీని తగ్గించారు. 10శాతం జీఎస్టీ తగ్గుతుండటంతో వాహనాలు కొనుగోలు చేసేవారు మరో రెండువారాలు నిరీక్షించేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్ తరువాత వాహనాల విక్రయాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రెండోస్థానంలో ఉంది. మధ్య తరగతి ప్రజలు అధికంగా వినియోగించే 350 సీసీ లోపు బైకులపై జీఎస్టీని ప్రభుత్వం 28శాతం నుంచి 18శాతానికి తగ్గించింది. పదిశాతం జీఎస్టీ తగ్గుదలతో భారీగా ధరల్లో మార్పు కనిపిస్తుంది. అలాగే 100 సీసీ, ఆపై సామర్థ్యం ఉన్న బైకుల ధర రూ.1లక్షకు పైగా ఉన్నాయి. ఇక ఇటీవల ఎక్కువ క్రేజీ ఉన్న ఎలక్ట్రికల్ బైక్‌ల ధర రూ.30వేల నుంచి రూ.లక్షకుపైగా ఉన్నాయి. వీటిపై కూడా 10శాతం జీఎస్టీ తగ్గుదల ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో

(మిగతా 7లో..)

వ్యవసాయ రంగానికి ఊరట

జీఎస్టీల తగ్గింపు వ్యవసాయరంగానికి కొంత ఊరట కలిగించనుంది. ప్రధానంగా రాష్ట్రంలోనే వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉమ్మడి వరంగల్ జిల్లా మొదటి స్థానంలో ఉంది. వ్యవసాయం యాంత్రీకరణ జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ గతంలో 18శాతం, 12శాతం ఉండగా, ప్రస్తుతం 5శాతానికి తగ్గించారు. దీంతో ట్రాక్టర్లతో వ్యవసాయ సంబంధిత యంత్రాలపై భారీగా తగ్గింపులు రానున్నాయి. దీంతో పాటు పురుగుల మందులపై కూడా జీఎస్టీని 5శాతానికి కుదించారు. దీంతో రైతులకు పురుగుల మందులపై భారీగా లబ్ధిచేకూరనుంది. అలాగే నీటి పారుదల శాఖకు సంబంధించిన వ్యవసాయ మోటార్లు, పైపులు తదితర వాటిపై కూడా జీఎస్టీ 5శాతానికి తగ్గించారు. కొత్త జీఎస్టీతో రైతులకు కూడా భారీగా ఊరట కలిగించనుంది.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.



అండర్‌బ్రిడ్జిలో నిలిచిపోయిన బస్సు



ప్రయాణికులను బయటకు తీసుకువస్తున్న సీఐ షూకూర్

నగరంలో కుండపోత

తెల్లవారుజామున దంచికొట్టిన వర్షం

- హనుమకొండ, వరంగల్‌లో పలు కాలనీలు జలమయం
- అండర్ బ్రిడ్జి వద్ద వరద నీటిలో చిక్కుకున్న బస్సు
- ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన బృందాలు

వరంగల్ సిటీ/ వరంగల్ టౌన్/హనుమకొండ టౌన్/వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ముఖ్యం గా వరంగల్ నగరంతో పాటు ఖిలా వ రంగల్ మండలాల పరిధిలో భారీ వర్షం పడగా.. మిగతా మండలాల్లో ఓ మోస్త రు వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం 7గంటల నుంచి 8.30 వరకు కురిసిన భారీ వర్షంతో పలు కాలనీలు జలమయమయ్యాయి. అలాగే హనుమకొండలో ఆదివారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. రెండుగంటల పాటు కురిసిన భారీవర్షానికి లోతట్టు ప్రాంతా లు జలమయమయ్యాయి. బాలసముద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల బ్లాక్‌లలో గ్రౌండ్ ఫ్లోర్‌లో నీరు చేరి లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీలు లేక భారీ వర్షానికి

(మిగతా 6లో..)



భారీ వర్షంతో హనుమకొండ చౌరస్తాలో నీటమునిగిన ప్రధాన రహదారి

రేవంత్‌రెడ్డి, కడియం మోసగాళ్లు



పాదయాత్రను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

- కేసీఆర్‌ది రైతు రాజ్యం.. కాంగ్రెస్‌ది రాక్షస రాజ్యం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- వెంకటాపురంలో పాదయాత్ర

ఐనవోలు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను, ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలను మోసం చేయడంలో ఘనతను సాధించారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధి ఐనవోలు మండలం వెంకటాపురం నుంచి నష్కల్-ఉప్పుగల్ రిజర్వాయర్ వరకు స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య రైతన్న కోసం రాజన్న పాదయాత్ర'ను ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. అంతకుముందు రాజయ్యతో కలిసి ఎర్రబెల్లి మాట్లాడారు. దేవాదుల కాలువల్లోకి నీరు రాక, యూరియా లభించక రైతులు అరిగోసపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. యూరియా సమస్యను సీఎం, మంత్రులు ఏరోజైనా క్షేత్రస్థాయిలో పరిశీలించారా? అని ప్రశ్నించారు. మూడున్నరేళ్ల కిందట దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు ఉప్పుగల్లు, చెన్నూరు, పాలకుర్తి మూడు రిజర్వాయర్లను రూ.350కోట్లతో 70 శాతం పనులు చేయిస్తే, ఇప్పటి ప్రభుత్వం రీఎస్టిమేషన్ల పేరిట రూ.వేయి కోట్లు అదనంగా పెంచిందన్నారు. ఎవరి స్వార్థం కోసం పెంచి పనులు చేయకుండా వదిలేశారో ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి తక్షణమే ఆ పనులను పూర్తి చేసి యాసంగి వరకు రైతులకు సాగునీరు అందచేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.104కోట్లతో తరిగొప్పుల, గుండ్ల సాగరం, ఉప్పుగల్-నష్కల్ మూడు లిఫ్టులను మంజూరు చేస్తే.. తట్టెడు మట్టి తీయకుండా పెండింగ్‌లో పెట్టారని ఎర్రబెల్లి ధ్వజమెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగునీటి కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంట పడి దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించానని, దానిని కేసీఆర్ పూర్తిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి, ఐనవోలు మండల కన్వీనర్ తంపుల మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్‌రావు, ఇన్‌చార్జి రాంమూర్తి, దేవదాసు, ఐనవోలు, వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన ముగ్గురిపై కేసు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ అదాలత్ సెంటర్‌లో శనివారం కానిస్టేబుల్ అశోక్ విధులు నిర్వర్తిస్తున్నాడు. అక్కడ ట్రాఫిక్ మళ్లిస్తుండగా హనుమకొండకు చెందిన కంప వినోద్ తన బైక్ అడ్డుగా పెట్టాడు. బైక్‌ను ఆపినందుకు కానిస్టేబుల్ అశోక్‌పై వినోద్.. రాజ్‌కుమార్, రాజుతో కలిసి దాడి చేశారు. ఈ విషయాన్ని కానిస్టేబుల్ అశోక్ పోలీసుస్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో మరో ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికి చేరుకున్నారు. అక్కడ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి దాడిచేసిన ముగ్గురిని సుబేదారి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ అశోక్ ఫిర్యాదు మేరకు ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, గతంలో కూడా కంప వినోద్ రోడ్డుపై న్యూసెన్స్ చేసి పోలీసులను ఇబ్బందులకు గురిచేయడంతో అతడిపై కేసు ఉన్నట్లు పేర్కొన్నారు.

చార్‌బౌళి పాఠశాల ఎస్జీటీకి షోకాజ్

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా పీజీ పరీక్షలకు హాజరైన ఓ ఉపాధ్యాయుడికి డీఈవో షోకాజ్ నోటీసు జారీచేశారు. చార్‌బౌళి పాఠశాల ఎస్జీటీ శ్రవణ్ డిప్యూటేషన్‌పై ఏడాది కాలంగా వరంగల్ డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్నారు. గత జూలై 25న ఆఫీస్‌లోని అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి అదే రోజు మధ్యాహ్నం ఆర్ట్స్ కళాశాలలో ఎం.ఏ. తెలుగు రెండో సంవత్సరం పరీక్షలకు హాజరయ్యారు. ఇలా ఆ నెలలో జరిగిన అన్ని పరీక్షలకు ఆయన అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి పరీక్షలు రాశారు. గత ఏడాది సైతం పాఠశాల అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి మొదటి సంవత్సరం పరీక్షలు రాసినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఇటీవలే డీఈవోగా బాధ్యతలు చేపట్టిన రంగయ్యనాయుడికి విషయం తెలిసి శ్రవణ్‌కు ఈ నెల 3వ తేదీన షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించరాదన్న నిబంధనను పక్కనబెట్టి, పాఠశాలలో సదరు టీచర్ అవసరం ఉన్నప్పటికీ అప్పటి డీఈవో జ్ఞానేశ్వర్ శ్రవణ్‌కు డిప్యూటేషన్‌పై కార్యాలయంలో నియమించడం గమనార్హం.

సమస్యల పరిష్కారానికి డాక్ అదాలత్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజలు తపాలాశాఖ సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు 51వ డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆదివారం జిల్లా తపాలా శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 8లోపు తపాలాశాఖలో వివిధ సమస్యలను పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు ప్రజలు పంపించాలని అన్నారు. పోస్టల్ కవర్‌లో కె.శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్) పోస్టుమాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్ 500001కు కవర్‌పై 51వ డాక్ అదాలత్ అని రాసి పంపించాలని కోరారు. డాక్ అదాలత్ 2025 సెప్టెంబరు17న ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గుగుల్ మీట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ

ఉమ్మడి వరంగల్ అధ్యక్షుడిగా ప్రశాంత్



హనుమకొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా సుంకరి ప్రశాంత్‌ను నియమించినట్లు లోక్ సంస్థ ఉద్యమ సంస్థ తెలంగాణ రాష్ట్ర సమన్వయ కర్తలు పర్చా కోదండరామారావు, బండారు రామ్మోహన రావు ఆదివారం తెలిపారు. సుంకరి ప్రశాంత్ అవినీతి వ్యతిరేక సంస్థ జ్వాల ఏర్పాటు చేసి అవినీతి వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించారు. లోక్ సత్తా ఉద్యమంలో విద్యార్థి దశ నుంచి పాల్గొంటూ ఉమ్మడి జిల్లాలో రెండు దశాబ్దాలుగా క్రియాశీలకంగా వ్యవహరించారు. లోక్‌సత్తా జిల్లా, రాష్ట్రస్థాయి యువజన విభాగంలో కీలక పదవులు నిర్వహించాడు.

ప్రొఫెసర్ రాజ్‌కుమార్‌కు

గురుబ్రహ్మ అవార్డు

కేయూక్యాంపస్ సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేయూ చరిత్ర, టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ ప్రతిష్ఠాత్మకమైన గురుబ్రహ్మ అవార్డును అందుకున్నారు. విశాఖపట్నంలోని సెయింట్ మదర్ థెరిస్సా ఆర్గనైజేషన్ 2025 ఏడాదికి విద్యాభివృద్ధి, పర్యటన, సామాజిక అంశాలపై చేసిన కృషికి రాజ్‌కుమార్‌ను గురుబ్రహ్మ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం ఏపీలోని విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సెయింట్ మదర్ థెరిస్సా ఆర్గనైజేషన్ బాధ్యులు అందచేశారు. రాజ్‌కుమార్ 2021 నుంచి కేయూలో అధ్యాపకులుగా నిబద్ధతతో పనిచేస్తున్నారు. కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా, బీఆర్ అంబేద్కర్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఎన్ఎస్ఎస్, కాలుష్య నియంత్రణకు కృషిచేసి ప్రజలను చైతన్యపరుస్తున్నారు. అల్లూరి సీతారామారాజు మెమోరియల్ సేవ జ్యోతి అవార్డు 2025, శ్రీశ్రీ మెమోరియల్ ట్రస్టు విద్యాజ్యోతి స్టేట్-2025 అవార్డులనూ అందుకున్నారు. అవార్డు పొందిన రాజ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

గ్రహణం వేళ ఆలయాలు బంద్



కొత్తకొండ ఆలయాన్ని ద్వార బంధనం చేస్తున్న అర్చకులు, సిబ్బంది



ఊకల్ నాగమయ్య ఆలయాన్ని మూసి వేస్తున్న శ్రీహర్షాచార్యులు



ఐనవోలు ఆలయ ద్వారాన్ని మూసివేస్తున్న అర్చక సిబ్బంది



వేయిస్తంభాల ఆలయాన్ని ద్వారబంధనం చేస్తున్న అర్చకులు గంగు ఉపేంద్రశర్మ

వరంగల్ కల్చరల్/హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భాద్రపద శుద్ధ పౌర్ణమి ఆదివారం చంద్రగ్రహణం సంభవించడంతో గ్రహణానికి మూడు జాముల ముందుగా దేవాలయాలను మూసివేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాలయాల్లో మధ్యాహ్నం 12.30 లోగా పూజలు, ఆర్జిత సేవలు, నైవేద్య నివేదనలు నిర్వహించి తలుపులు మూసి వేశారు. వరంగల్ నగరంలోని భద్రకాళి దేవాలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు దర్శనం కల్పించి ఆ తరువాత మూసివేశారు. తిరిగి సోమవారం తెల్లవారు జామున ఆలయాన్ని సంప్రోక్షణ శుద్ధి చేసిన అనంతరం ఉదయం 7 గంటలకు అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు.

● రాహుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి నగరంలోని అన్ని ప్రముఖ ఆలయాలను ద్వారబంధనం చేశారు. ఇందులో భాగంగా నిత్యం సందర్శకులతో కిటకిటలాడే ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మధ్యాహ్నం మహానివేదన అనంతరం ద్వారబంధనం చేశారు. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని అంతా సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం ఉదయం 7గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్ చెప్పారు. ప్రసిద్ధ భద్రకాళి ఆలయంతోపాటు హనుమకొండలోని పద్మాక్షి, సిద్ధేశ్వర ఆలయాలు, షిరిడీ సాయిబాబా మందిరంతోపాటు అన్ని ఆలయాలు మూతబడ్డాయి.

● గీసుగొండ: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ఊకల్‌లో నాగేంద్రస్వామి, కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలను మూసివేశారు. కాగా, ఉదయం నాగేంద్ర స్వామి ఆలయంలో నిత్య కైంకర్యాలను, పూజాదులు నిర్వహించి ఆలయాన్ని మూసివేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు తెలిపారు. ఆదివారం రాత్రి 9.35 చంద్రగ్రహణం ప్రారంభమై అర్ధరాత్రి 1.35 వరకు పూర్తవుతున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ అనంతరం స్వామివారి దర్శనాలు ఉంటాయని చెప్పారు.

● భీమదేవరపల్లి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని ద్వార బంధనం చేసి మూసివేశారు. తిరిగి సోమవారం ఆలయాన్ని సంప్రోక్షణం నిర్వహించిన అనంతరం ఆలయాన్ని తెరుస్తామని ఈవో కిషన్‌రావు తెలిపారు. సోమవారం నుంచి యథావిధిగా అర్చనలు, అభిషేకాలు, స్వామివారి ఆర్జిత సేవలు నిర్వహిస్తామని తెలిపారు.

● కాజీపేట: చంద్రగ్రహణం సందర్భంగా కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయం ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. భక్తుల దర్శనానికి తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ అధికారులు చెప్పారు. గ్రహణం ప్రారంభమయ్యే ముందు ఆలయ ద్వారాలు మూసివేసి, గ్రహణం ముగిసిన అనంతరం ఆలయంలో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి తిరిగి భక్తులకు దర్శనానికి అనుమతిస్తారని ఆలయ సిబ్బంది చెప్పారు.

● ఐనవోలు: చంద్రగ్రహణం దృష్ట్యా ఆదివారం ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ద్వార బంధనం చేశారు. అంతకుముందు స్వామి వారికి అభిషేకం, నైవేద్యం, మంగళహారతులు ఇచ్చి మధ్యాహ్నం 1 గంటకు ద్వారా బంధనం చేశారు. దీంతో ఆలయంలో ఆర్జిత సేవలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం 6 గంటలకు స్వామి వారికి అభిషేకం, మహా సంప్రోక్షణ క్రతువు నిర్వహించాక భక్తులకు స్వామి వారి దర్శనం, ఆర్జిత సేవలు ప్రారంభమవు తాయని ఈవో సుధాకర్, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ తెలిపారు.

లంబాడీల రిజర్వేషన్లు చట్టబద్ధమే..

●లంబాడీ, కోయ, గోండుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలను తిప్పి కొట్టాలి

● మాజీ ఎంపీ సీతారాంనాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నేత వాసూనాయక్



నర్సంపేటలో ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్న లంబాడీ నాయకులు

నర్సంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : లంబాడా. కోయ, గోండుల మధ్య భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆదిలాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సోయం బాబూరావు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టి లంబాడాల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని మాజీ ఎంపీ అజీర సీతారాంనాయక్, లండాల హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసూనాయక్ అన్నారు. నర్సంపేట పట్టణంలో ఆదివారం లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి వరంగల్ రోడ్‌లోని ఐఎంఏ హాల్ వరకు ర్యాలీని నిర్వహించాక ఆత్మగౌరవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లంబాడీల రిజర్వేషన్లు చట్టబద్ధమేనని వారు పేర్కొన్నారు. గోండు, కోయ, లంబాడీ కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా ఎదగాలనే దురుద్దేశంతో వెంకట్రావు, బాబూరావులు కుట్రచేస్తున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 342 సవరణ ప్రకారం జీవో 149 ద్వారా 1978 మే 3న పార్లమెంట్‌లో చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో ఎస్టీలుగా చేరారని అన్నారు. తెల్ల వెంకట్రావు, సోయం బాబూరావులను సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌సింగ్, డాక్టర్ మనోజ్‌లాల్, బానోతు సారంగపాణి, జాటోత్ జెత్‌రాంనాయక్, బోడ గోల్యానాయక్, డాక్టర్ రాజ్‌కుమార్, రమేశ్‌నాయక్, భూక్య జగన్‌నాయక్, శంకర్‌నాయక్, వినోత్‌నాక్, సుభాష్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే ధ్యేయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత వెంకటేశ్వర్లు

హసన్‌పర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమమే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కుడా మాజీ చైర్మన్, ఓబీసీ అధ్యక్షులు సుందర్‌రాజు యాదవ్ అన్నారు. ఆదివారం గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహంలో ఓబీసీ కమిటీ, ఆర్గనైజింగ్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లుయాదవ్, డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ టి.విజయలక్ష్మీతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. బీసీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న బాలికలకు కార్పొరేట్ స్థాయి వైద్యులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీసీ పిల్లల విద్య, ఉపాధి కోసం ఎంత వరకైనా పోరాటం చేస్తామన్నారు. చదువు, ప్రతిభ ఉన్న బీసీ విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థుల కోసం మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు మేఘన, ఆశాదేవి, మోహన్‌క్రిష్ణ, శృతిక, హరీష్ యాదవ్, గుజ్జుల శాంతన్, గుజ్జుల సౌమ్యతో పాటు పలువురు వైద్య బృందం సభ్యులు 130 మంది విద్యార్థినీలకు ఉచితంగా గైనిక్, థైరాయిడ్, దంత, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.విజయలక్ష్మీ, జాయింట్ సెక్రటరీలు ఎంఎస్.మూర్తి, కె.నాగరాజు, హాస్టల్ వార్డెన్ ప్రియాంక, విద్యార్థినీలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌పై కేసు

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 07, (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌పై కేసు నమోదైనట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అపార్ట్‌మెంట్ బిల్డర్ అయిన వేముల శ్రీనివాస్.. ఓ వ్యక్తి నుంచి అపార్ట్‌మెంట్ నిర్మాణ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో బాధితుడు సీపీకి ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ ఆదేశాలకు మేరకు హనుమకొండ పోలీసులు శ్రీనివాస్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా, గతంలో ఇదే విధంగా వ్యవహరించడంతో వేముల శ్రీనివాస్ జైలుకు వెళ్లిన వెళ్లిన విషయం విదితమే.

ఎంజీఎంలో గాడితప్పిన పాలన

● సూపరింటెండెంట్ సెలవుపై వెళ్లడంతో సిబ్బంది ఇబ్బందులు

● నిలిచిపోయిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు





సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎం ఆస్పత్రిలో పాలన గాడితప్పుతోంది. కొన్నేళ్లుగా ఎంజీఎం ఇన్‌చార్జి పాలనలోనే నడుస్తోంది. దీంతో పాలన పడకేస్తోందని సిబ్బంది, ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ చిట్టీలు, చివరికి బ్యాండేజ్‌లు కూడా లేని పరిస్థితి దాపురించింది.

సెలవుల్లో సూపరింటెండెంట్

గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ప్రస్తుత ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ సెలవుల్లో వెళ్లారు. దీంతో పరిపాలనా బాధ్యతలను డాక్టర్ చిలుక మురళికి అప్పగించారు. అయితే జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆగ్రహంతోనే సూపరింటెండెంట్ సెలవుల్లోకి వెళ్లినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో తిరిగి విధుల్లో చేరుతాడా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వ్యక్తిగత కారణాలతోనే సెలవులో వెళ్లారని మరికొందరు చెబుతున్నారు. కాగా, సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ పనితీరు పట్ల కలెక్టర్ సత్యశారద కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఓ సమీక్ష సమావేశంలో పూర్తిస్థాయి సూపరింటెండెంట్ కోసం ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విలవిల

ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్ సెలవుపై వెళ్లడంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. కొద్ది రోజులుగా బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తూ వస్తున్నారని కన్నీటి పర్యంతం అవుతున్నారు. దసరా పండగ వరకైనా తమ వేతన బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదే విధంగా సీనియర్ సిటిజన్లు, ప్రభుత్వ ఉద్యోగుల రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా కుప్పలు తెప్పలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆరునెలలుగా ఎదురు చూస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రజా ప్రతినిధులు స్పందించి పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను నియమించి పరిపాలనను గాడిలో పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

● మిల్స్‌కాలనీ పీఎస్‌లో పలు సెక్షన్‌లు ● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ వంచనగిరి సురేశ్ అలియాస్ కోతి సురేశ్‌పై మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'గణపతి ఊరేగింపులో రౌడీషీటర్ వీరంగం' అనే వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి పోలీసులు స్పందించారు. కరీమాబాద్‌లోని రామస్వామి గుడి వీధిలో జరిగిన దాడిలో పాల్గొన్న రౌడీషీటర్ అనుచరుడిని ఆదివారం ఆదుపులోకి తీసుకున్నట్లుగా విశ్వసనీయమైన సమాచారం. దాడి చేసిన రౌడీషీటర్ పరారీలో ఉండటంతో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లుగా తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదుతో రౌడీషీటర్ సురేశ్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులపై 118 (1), 296 (బి), ఆర్‌డబ్ల్యూ 3(5) బీఎన్ఎస్ సెక్షన్‌ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కేసు నమోదు కావడంతో రాజీ కోసం తన అనుచరులను బాధితుల ఇంటికి పంపుతూ వేధిస్తున్నట్లుగా సమాచారం.

పలు ఘర్షణల్లో..

కరీమాబాద్‌లో జరిగిన గొడవ రోజే మండిబజార్‌తో పాటు కరీమాబాద్‌లో మరికొంత మందితో రౌడీషీటర్ సురేష్ ఘర్షణపడ్డట్టుగా సమాచారం. ప్రతీ సారి ఏదో వివాదంలో తలదూర్చి దాడులకు తెగబడి రెండు మూడు నెలలు కనిపించకుండాపోయి కొంతమంది ప్రజాప్రతినిధుల మధ్యవర్తిత్వంతో పోలీసులకు లొంగిపోవడం ఆయనకు షరా మామూలైనట్లుగా తెలుస్తోంది. ఓ రాజకీయ నాయకుడి పేరు చెప్పి బాధితులను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

నగరంలో కుండపోత

(5వ పేజీ తరువాయి)

ఇంట్లోకి వరద చేరి ఇబ్బందులు పడ్డట్లు తెలిపారు. ఇంట్లోకి చేరిన నీటిని డబ్బాలతో బయటకు ఎత్తిపోసినట్లు పేర్కొన్నారు. అలాగే బస్టాండ్ ప్రాంగణం వర్షానికి నీట మునిగింది. బస్సులు బయటకు వెళ్లే ప్రాంగణంలో భారీగా నీరు నిలిచాయి. వరద తాకిడికి బస్టాండ్ ప్రాంగణంలో భారీ గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అండర్‌బ్రిడ్జి వద్ద చిక్కుకున్న బస్సు

వరంగల్‌లో బ్రిడ్జి కింద నుంచి వెళుతున్న ఆర్టీసీ బస్సు వరదనీటిలో చిక్కుకుంది. హఠాత్తుగా బస్సు ఆగిపోవడంతో అందులో ఉన్న 30 మంది ప్రయాణికులు భయభ్రాంతులకు గురై హాహాకారాలు చేశారు. సమాచారం అందుకున్న జీడబ్ల్యూఎంసీ మాన్‌సూన్ బృందాలు, ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఎఫ్‌వో శంకర్‌లింగం ఆధ్వర్యంలో సుమారు 30 మంది బృందం రెండు టీములుగా ఏర్పడి అండర్ రైల్వే బ్రిడ్జి కింద రెండు ఆర్టీసీ బస్సులలో చిక్కుకున్న ప్రయాణికులను పోలీసు, రెవెన్యూ, శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో సురక్షితంగా బయటకు తీశారు. అదే విధంగా నీటిలో చిక్కుకున్న బస్సులను క్రేన్‌ల సహాయంతో బయటకు తీశారు. అనంతరం అక్కడి నిలిచిన నీటిని డీవాటరింగ్ చేసి నీటిని కింద ప్రాంతానికి తరలించారు. తర్వాత అక్కడ పేరుకుపోయిన చెత్తను శానిటేషన్ సిబ్బంది సకాలంలో తొలగించినట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌లు తెలిపారు. అండర్ రైల్వే గేట్ రహదారిపై పడిపోయిన చెట్లను డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగించారు.



జలమయమైన హనుమకొండ బస్టాండ్ రహదారి



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



నీటిలో చిక్కిన బస్సును బయటకు తీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఉల్లాస్‌ంగా సంపూర్ణ అక్షరాస్యత



- మహిళా గ్రూపుల భాగస్వామ్యంతో అక్షరాస్యత కార్యక్రమం
- వయోజన విద్య, విద్యాశాఖ, సెర్ప్, ఓపెన్ స్కూల్ భాగస్వామ్యంతో ఎన్ఐఎల్పీ
- నేడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నవభారత్ సాక్షరత (New India Literacy Program - NILP) కార్యక్రమంలో భాగంగా 'సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసం యొక్క అవగాహన' (Understanding of Life long Literacy for All in Society- ULLAS) ద్వారా నిర్దేశిత లక్ష్యాలను చేరేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నవభారత్ సాక్షరత అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వయోజన విద్య, విద్యాశాఖ, సెర్ప్, ఓపెన్ స్కూల్ భాగస్వామ్యంతో జిల్లాల్లో పూర్తి స్థాయిలో అక్షరాస్యత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సెప్టెంబరు 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

మహిళా గ్రూపుల సహకారంతో..

అందరినీ అక్షరాస్యులను తీర్చిదిద్దేందుకు ఈ సారి నవభారత్ సాక్షరత మిషన్ వినూత్న కార్యక్రమాన్ని రూపొందించింది. డీఆర్డీఏలోని సెర్ప్ విభాగం మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేసింది. గ్రామాల్లోని మహిళా సంఘాల పరిధిలో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులు చేసేందుకు మహిళా సంఘాలు కీలకపాత్ర పోషించనున్నాయి. క్షేత్ర స్థాయిలో ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులు సంబంధిత గ్రామం, యూనిట్‌లో నిరక్షరాస్యులు ఎంత మంది ఏ స్థాయిలో ఉన్నారో గుర్తించి వారికి అవసరమైన కార్యక్రమాన్ని సంబంధిత వారు సంబంధిత అధికారులకు నివేదిస్తారు. ఈ నివేదిక ఆధారంగా ఎవరెవరికి ఎలాంటి ప్రోగ్రాం అందించాలో నిర్ధారిస్తారు.

నాలుగు విభాగాల భాగస్వామ్యం

నవ భారత సాక్షరత కార్యక్రమం నాలుగు విభాగాలను భాగస్వామ్యం చేసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టు అధికారి పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. నవభారత్ సాక్షరత కార్యక్రమంలోని వయోజన విద్య, జిల్లా విద్యాశాఖలు, స్వయం సహాయక మహిళా సంఘాలు, ఓపెన్ స్కూల్ విభాగాలను భాగస్వామ్యం చేశారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనకు..

ఉమ్మడి జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యతకు వయోజన విద్య అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. క్షేత్ర స్థాయిలో మహిళా సంఘాల సభ్యులు నిరక్షరాస్యులు, వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తిస్తారు. పూర్తి నిరక్షస్యరాస్యులకు శిక్షణ పొందిన మహిళా సంఘాల సభ్యులతో వయోజన విద్య కార్యక్రమాన్ని అందిస్తారు. ఇక అనివార్య కారణాలతో 10, ఇంటర్ మధ్యలో మానేసిన వారిని గుర్తించి వారిని ఓపెన్ స్కూల్ ద్వారా ఓపెన్ టెన్త్, ఇంటర్ పూర్తి చేయించేందుకు విద్యాశాఖతో పాటు వయోజన విద్య అధికారులు కృషి చేస్తారు. నవ భారత్ సాక్షరత మిషన్ ద్వారా పూర్తి స్థాయిలో అందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు.

పూర్తయిన శిక్షణ

ఉమ్మడి జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా మార్చేందుకు నవ భారత్ సాక్షరత కార్యక్రమం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకుంటుంది. ఇప్పటికే జిల్లా స్థాయి, మండల స్థాయి, గ్రామ/యూనిట్ స్థాయిలో ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం పూర్తి చేసింది. అధికారికంగా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని చర్యలు పూర్తి చేశారు. మరికొద్ది రోజుల్లోనే అందరిని అక్షరాస్యులను చేసే బహత్తర కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో ప్రారంభం కానుంది.

సాధించాల్సిన లక్ష్యాలు..

వయోజన విద్య ద్వారా ఉమ్మడి జిల్లాలోని విభజిత జిల్లాల్లో లక్ష్యాలను నిర్దేశించారు. 2025 - 26 సంవత్సరంలో లక్ష్యాలను ఛేదించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని ముందుకు సాగుతోంది.

2011 జనాభా లెక్కల ప్రకారం..

జిల్లా పేరు	అక్షరాస్యత శాతం
వరంగల్	71.90
హనుమకొండ	76.17
జనగామ	61.44
ములుగు	62.26
జయశంకర్ భూపాలపల్లి	58.98
మహబూబాబాద్	57.13

అన్ని విభాగాల భాగస్వామ్యంతో పూర్తి చేస్తాం..



నవ భారత్ సాక్షరత కార్యక్రమం ద్వారా ఉమ్మడి జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామనే విశ్వాసం ఉంది. నాలుగు విభాగాల భాగస్వామ్యంతో అందరి సహకారంతో ప్రణాళికత బద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశాం. క్షేత్ర స్థాయిలో అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అన్ని జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. త్వరలోనే ఉమ్మడి జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత కార్యాచరణ ప్రారంభం అవుతుంది.

తుమ్మ రమేష్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా వయోజన విద్య ప్రాజెక్టు అధికారి

జిల్లా పేరు	నిర్దేశిత లక్ష్యం (వేలల్లో)
వరంగల్	29,739
హనుమకొండ	28,904
జనగామ	24,137
ములుగు	7,581
జయశంకర్ భూపాలపల్లి	29,484
మహబూబాబాద్	35,764

సాంస్కృతిక, సామాజిక

చైతన్యమూర్తి అనిశెట్టి రజిత

- రజిత యాది సభలో సాహితీవేత్తలు
- నివాళులర్పించిన ప్రముఖులు



అనిశెట్టి రజిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి, సామాజిక కార్యకర్త, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజయిత యాది సభను వరంగల్ సాహిత్య, సామాజిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఆదివారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో అనిశెట్టి రజిత చిత్రపటానికి పూలమాలలలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ సాహిత్య, ప్రజా సంఘాల సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు, కళాకారులు మాట్లాడారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి రజిత రచనలు చేసిందన్నారు. హేతువాదిగా, స్త్రీవాదిగా, ఉద్యమకారిణి రజిత చేసిన పోరాటం ఎందరికో అనుసరణీయమని అన్నారు. అక్షరాన్ని జీవితంగా బతికిందన్నారు. వితంతు వ్యవస్థపై గ్రంథాలను రాసి కార్యాచరణ రూపొందించి చైతన్యపరచడంతో పాటు సామాజిక మార్పే లక్ష్యంగా పనిచేశారని చెప్పారు. రజిత తన మరణాంతరం కేఎంసీకి అవయవదానం చేసి కాళోజీ బాటలో నడిచారని కొనియాడారు. రజిత మరణం సాహిత్యలోకానికి తీరని లోటని చెప్పారు.

యాది సభకు కన్వీనర్‌గా బూర భిక్షపతి వ్యవరించగా బిల్లా మహేందర్, నిర్వాహకులు నిధి, కొమర్రాజు రామలక్ష్మి, డాక్టర్ శంకర్ నారాయణలతోపాటు ఆయా సంస్థల ప్రతినిధులు, సభ్యులు ఉద్యమ మిత్రులు, ఉపాధ్యాయులు తిరుణగిరి దేవకిదేవి, పల్లేరు వీరాస్వామి, మెటుట రవీందర్, డాక్టర్ చంద్రభాను, కొడం కుమారస్వామి, జుపాకసుభద్ర, మానస ఎండ్లూరి, తమ్మెర రాధిక, నెల్లుట్ల రమాదేవి, వీఆర్ విద్యార్థి, పి.చందూ, గూడూరు సీతామహాలక్ష్మి, సిగరాజు, రామాదేవి, బిట్ల అంజనీదేవి, శైలజ, విద్యాదేవి, చందనాల సుమిత్రదేవి, వల్లంపట్లనాగేశ్వర్‌రావు, బండారి సుజాత, కల్యాణి కుంజ, డాక్టర్ తాళ్లపల్లియాకమ్మ, కాజీపేట పురుషోత్తం, వెంగల్‌రెడ్డి, శంకర్‌రావు, పిట్ట సాంబయ్య, దండ్రె రాజమౌళి, శోభారమేశ్, వకులవాసు, కీర్తిపతాక, బి.రమాదేవి, డాక్టర్ ఏరుకొండ నర్సింహస్వామి, శ్యామల, కుమారస్వామి, డాక్టర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

వేచి చూద్దామా..?!

5వ పేజీ తరువాయి

ప్రతీనెల సుమారుగా 5వేల పైగా బైకులు విక్రయాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ద్విచక్రవాహనాలపై కనిష్ఠంగా రూ.6వేల నుంచి గరిష్ఠంగా రూ.25వేల వరకు ధరలు తగ్గనున్నాయి. దీంతో ప్రతీనెల బైకులపై గరిష్ఠంగా సుమారు రూ.12.50కోట్ల వరకు వినియోగదారులకు పన్ను తగ్గింపుతో లబ్ధిచేకూరే అవకాశం ఉంది. అలాగే డీజిల్, పెట్రోల్, ఎలక్ట్రికల్ కార్లపై కూడా జీఎస్టీ ప్రభావం తీవ్రంగానే ఉంది. ప్రతీ నెల ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 600 నుంచి వెయ్యి వరకు ఆయా సీజన్‌లను బట్టి అమ్ముడుపోతున్నాయి. కార్లపై కూడా 28శాతం జీఎస్టీని 18శాతానికి తగ్గించారు. 10శాతం జీఎస్టీ తగ్గుదలతో కార్లపై కనిష్ఠంగా రూ.60వేల నుంచి రూ.1.50లక్షల వరకు ధరలు తగ్గనున్నాయి. ఈ లెక్కన కార్లపై నెలకు రూ.6కోట్ల నుంచి రూ.15కోట్ల వరకు జీఎస్టీ తగ్గింపుతో కొనుగోలుదారులకు లబ్ధిచేకూరే అవకాశం ఉందని అంచనా. మొత్తంగా జీఎస్టీ తగ్గింపుతో ప్రతీఏటా బైకులు, కార్ల కొనుగోళ్లపై సుమారుగా రూ.100కోట్ల నుంచి రూ.150కోట్ల వరకు వినియోగదారులపై భారం జీఎస్టీ తగ్గనుంది. ఈ మేరకు జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం తగ్గనుంది. మొత్తానికి జీఎస్టీ తగ్గుదలతో వాహనరంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

కేంద్రం ప్రకటనతో ప్రస్తుతం షోరూముల్లో బుకింగ్‌లు భారీగా తగ్గిపోయాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారు మరో రెండు వారాలు ఆగితే తగ్గింపు ధర లభిస్తుందనే ఆశతో ఉన్నారు. అయితే కొనుగోలుదారులను ఆకర్షించేందుకు షోరూమ్ నిర్వాహకులు కొత్త ఆఫర్లను ప్రకటిస్తున్నారు. ముందుగా బుకింగ్ చేసుకుని 22వ తేదీ తరువాతే డెలివరీ చేసుకోవచ్చునని ప్రకటిస్తున్నారు. కొన్ని కంపెనీలు 22వ తేదీ నాటికి వర్తించే జీఎస్టీనే తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. దీంతో ముందస్తుగా బుకింగ్‌పై కొనుగోలుదారులు అయోమయంలో పడిపోతున్నారు. మరోవైపు సెకండ్ హ్యాండ్ వాహనాలపై కూడా జీఎస్టీ తగ్గింపు తీవ్ర ప్రభావం చూపనుంది. హైదరాబాద్, కరీంనగర్ తరువాత సెకండ్ హ్యాండ్ వాహనాల అమ్మకంలో వరంగల్ మూడోస్థానంలో ఉంది. అయితే జీఎస్టీల తగ్గింపుతో సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోళ్లు భారీగా నిలిచి పోయాయి. బైకులు, కార్లపై 10శాతం తగ్గింపు వస్తుండటంతో పాటు దసరా, దీపావళి ఆఫర్లను ఆయా కంపెనీలు ప్రకటిస్తుండటంతో చాలామంది కొత్త వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో సెకండ్‌హ్యాండ్ మార్కెట్ తీవ్ర నష్టాల వైపు చూస్తుందని నిర్వాహకులు వాపోతున్నారు.

మరికొన్నింటిపై తగ్గింపు

అధిక ధరలతో ఆందోళన చెందుతున్న సామాన్యులకు కేంద్రం సవరించిన జీఎస్టీ భారం ఊరట కలిగిస్తుంది. ప్రధానంగా వస్తు సేవా పన్నుల కౌన్సిల్ ప్రతిపాదించిన విధానంలో కొత్తగా జీఎస్టీ మూడు స్లాబ్‌లుగా విభజించారు. పాత విధానంలో ఉన్న 12శాతం, 28శాతం స్లాబులను పూర్తిగా తీసివేస్తూ.. 5శాతం, 18శాతంతో పాటు విలాసవంతమైన వాటిపై 40శాతం జీఎస్టీని చేర్చుతూ కొత్త సంస్కరణలను కేంద్రం తీసుకువచ్చింది. పేదలకు ఊరట కలిగించేలా నిత్యావసర వస్తులపై పన్నుల భారాన్ని భారీగా తగ్గించింది. ప్రధానంగా హెయిర్ ఆయిల్, షాంపులు, నెయ్యి, చీజ్, నామ్కిన్లు, వంట పాత్రలు, తదితర వాటిపై ఉన్న 12శాతం, 18శాతం జీఎస్టీని తగ్గించి 5శాతం జీఎస్టీ స్లాబ్‌లో చేర్చారు. అలాగే ఆరోగ్య, జీవిత బీమాలపై గతంలో 18శాతం ఉన్న జీఎస్టీని పూర్తిగా తొలిగించి, జీరో జీఎస్టీగా మార్చటం కూడా ప్రజలకు ఊరట కలిగించేవే. అలాగే ఆరోగ్యానికి సంబంధించిన డయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకోమీటర్లు, కళ్లద్దాలు కూడా జీరో జీఎస్టీ పరిధిలోకి రావటం మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరటగా చెప్పుతున్నారు. అలాగే విద్యకు సంబంధించిన మ్యాప్‌లు, పుస్తకాలు, క్రేయాన్‌లు, ఎరేజర్‌లు తదితర విద్య, విద్యార్థులకు సంబంధించిన వాటిపై గతంలో ఉన్న 5శాతం, 12శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించి, జీరో జీఎస్టీ పరిధిలోకి తీసుక రావటం పేద విద్యార్థులకు ఊరట కలిగించే అంశం. ఇక వీటితో పాటే అనేక ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు ఇతర నిత్యావసర వస్తువులపై భారీగా జీఎస్టీ తగ్గింపులు చేస్తుండటంతో 22వ తేదీ కోసం కొనుగోళదారులు ఎదురు చూస్తున్నారు.

కాళోజీ కళాక్షేత్రాన్ని అందరికీ

అందుబాటులోకి తెస్తా..

- మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- నేత్రపర్వంగా కాకతీయ కళా పురస్కారాలు



కాకతీయ కళా వైభవం కార్యక్రమంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనేక వ్యయప్రయాలకోర్చి కోట్లాది రూపాయలతో ప్రజాకవి కాళోజీ పేరిట నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళాకారులు, కవుల సమావేశానికి నామమాత్రపు ధరలో అందుబాటులోకి తెచ్చేందుకు తనవంతుగా కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ హామీ ఇచ్చారు. ఆదివారం కాళోజీ కళాక్షేత్రం వేదికగా శాంతికృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా మూడున్నర గంటల పాటు నిర్వహించిన కాకతీయ కళావైభవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సేవా సమితి చైర్మన్ డాక్టర్ వంగాల శాంతికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. కాళోజీ కళాక్షేత్రాన్ని కళాకారులందరూ తమ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా తాను కృషి చేస్తానన్నారు.

తెలుగు అకాడమీ పూర్వ కార్యదర్శి డాక్టర్ తెన్నేటి సుధ మాట్లాడుతూ.. డాక్టర్ విద్వాన్ సుబ్బారావు కూతురిగా, ప్రసిద్ధ రచయిత్రిగా పేరుగడించిన క్రమంలో అదంతా ఈ ఓరుగల్లు మట్టి చలువేనని కాళోజీతో తన సాన్నిహిత్యాన్ని నెమరువేసుకున్నారు. విశిష్ట అతిథిగా హైదరాబాద్‌కు చెందిన వంశీ ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపకుడు శిరోమణి వంశీ రామరాజు మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో కవులకు, కళాకారులకు గుర్తింపు తెచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శాంతికృష్ణను అభినందించి సత్కరించారు. గాయత్రి పీఠాధిపతి శ్రీకాంతాచార్యస్వామి జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో రామడుగు నర్సింహస్వామి, రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, ఈగ మల్లేశం, గట్టు మహేశ్‌బాబు, హైదరాబాద్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకుడు పద్మాకర్ రావు తదితర అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంపటి శ్రావణి శిష్యులు, హైదరాబాద్‌కు చెందిన పద్మజా శిష్య బృందం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పురస్కారం పొందిన వారు

పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, ఆర్య వైశ్య జాతీయ నాయకుడు గట్టు మహేశ్ బాబు, అర్చక సమాఖ్య నేత గంగు ఉపేంద్రశర్మ, ఆచార్య బన్న అయిలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, ఆచార్య తిరుపతయ్య, డాక్టర్ ఘంటశాల గుజ్జారి రమేశ్, డాక్టర్ గడ్డం వెంకన్న, కళాకారిణి పద్మజ, సయ్యద్ మగ్దూం, బాలాజీ రవీందర్, పల్లె నాగేశ్వర్‌రావు, డాక్టర్ అడ్డూరి వెంకటేశ్వర్లు, చక్రవర్తుల శ్రీనివాస్, సురేశ్, రోజా శ్యామ్, రంగస్థల కళాకారులు ఓడపల్లి చక్రపాణి, ఆకుల సదానందం, సీతాల రఘువేందర్, కళా రాజేశ్వర్‌రావు, జడల శివ, చొల్లేటి కృష్ణమాచార్య తదితరులకు కాకతీయ పురస్కారాలు అందుకున్నారు.

శాస్త్రీయ విద్యా విధానం కావాలి

- ప్రజల్లో మూఢ విశ్వాసాలను రూపుమాపాలి
- జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి భిక్షపతి



చంద్ర గ్రహణాన్ని వీక్షిస్తున్న రామంచ భిక్షపతి

కేయూక్యాంపస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్యా విధానంతో ప్రజల్లో మూఢనమ్మకాలను రూపుమాపాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రామంచ భిక్షపతి అన్నారు. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా కేయూ స్కాలర్లు, డీవైఎఫ్ఐ, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా 'ఖగోళంలో అరుదైన సంఘటలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేయూ గెస్ట్‌హౌస్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గ్రహణం సందర్భంగా అందరు కలిసి భోజనాలు చేశారు. చంద్రగ్రహణాన్ని ప్రత్యేక పరికరాలతో వీక్షించారు. మూఢనమ్మకాలను పారదోలాలని నినదించారు.

ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, జేవీవీ నేత రాజు, వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్‌లు మాట్లాడారు. వర్సిటీల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ప్రజలలో మూఢనమ్మకాలను పారదోలేందుకు కృషి చేయాలని అన్నారు. సైన్స్ అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. దేశంలో ఎక్కువ జనాభా ఉందన్నారు. మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యం చేయడంతో వర్సిటీలు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ప్రణయ్‌కుమార్, అజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి, వేడపల్లి నవీన్, పీడీఎస్‌యూ సెక్రటరీ మర్రి మహేశ్, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, మంద శ్రీకాంత్, కామగోని శ్రావణ్, స్వేరోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, చిరంజీవి, శివతో పాటు ఎస్ఎఫ్ఐ, ఇతర ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల కందికొండ తిరుపతి, గోవర్ధన్, రోనాల్డ్ తదిరులు పాల్గొన్నారు.

గ్రహణ వీక్షణానికి టెలీస్కోపులేవి?

- రీజనల్ సైన్స్ సెంటర్‌లో మూలనపడ్డ వైనం
- పట్టింపులేని ప్రభుత్వాలు



వరంగల్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ప్రాంతీయ సైన్స్ కేంద్రం అలంకారప్రాయంగా ఉంటోంది. నిధుల కేటాయింపుల లేకపోవడంతో సైన్స్ సెంటర్‌లోని చాలా పరికరాలు పాడైపోయి నిరుపయోగంగా పడి ఉన్నాయి. పరికరాల అలా పడి ఉంటే భవన సముదాయం శిథిలావస్థలోకి చేరింది. రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఉన్న మూడు టెలీస్కోపులు పనిచేయకుండా పాడై పోయి ఉన్నాయి. గత ఏడాది వరకు మూడింటిలో ఒకటి పనిచేయగా, ఇప్పుడది కూడా పాడై పోవడంతో సైన్స్ సెంటర్ నిర్వాహకులు గ్రహణ వీక్షణానికి ఏర్పాట్లు చేయలేదు. దీంతో నగరంలోని సైన్స్ అభిమానులు సైన్స్ సెంటర్ నిర్వహణ పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే నిధుల లేమితోనే పరికరాల మరమ్మతులు చేపట్టలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆదివారం చంద్రగ్రహణ వీక్షణం సైన్స్ సెంటర్ వేదికగా కాలేకపోయింది. ఇప్పటికైనా రీజనల్ సైన్స్ సెంటర్‌ను అలంకార ప్రాయంగా కాకుండా ఉపయోగపడే విధంగా సైన్స్ సెంటర్‌ను రూపుదిద్దాలని కోరుతున్నారు.

వావ్.. రెడ్ మూన్!

5వ పేజీ తరువాయి

వల్ల ఎలాంటి రేడియేషన్ ఉండదని చెప్పడంతో చాలామంది ఈ అరుదైన అద్భుతాన్ని తిలకించేందుకు ఉత్సాహం చూపారు. ఎటువంటి రక్షణ పరికరాలు లేకుండానే వీక్షించారు. పలువురు బైనాక్యులర్లను వినియోగించారు. అపార్టుమెంట్లలో నివసించే వారు కుటుంబసభ్యులతో భవనం పైకి ఎక్కి గ్రహణాన్ని వీక్షించారు. ఇళ్లలోనివారు బయటకు వచ్చి ఆకాశంలోని అద్భుతాన్ని ఆసక్తిగా గమనించారు. చంద్రుడు ఎర్రగా మారే మొత్తం దశ రాత్రి 11.01 నుంచి 12.23గంటల మధ్య 82 నిమిషాల పాటు కొనసాగింది. సూర్యుడు, చంద్రుడికి మధ్య భూమి రావడంవల్ల ఎక్కువ తరంగదైర్ఘ్యం కలిగిన కాంతి వాతావరణంలోకి చెల్లాచెదురుగా వెళ్లడంతో చంద్రుడు ఇలా బ్లడ్ మూన్‌గా కనిపించాడు.

నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారం



హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాళోజీ పురస్కారం రచయిత్రి నెల్లుట్ల రమాదేవికి దక్కింది. ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకంగా ఏటా ఆయన జయంతి అయిన సెప్టెంబరు 9న ప్రదానం చేయనున్న ప్రతిష్ఠాత్మక అవార్డును ఆదివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అందెశ్రీ అధ్యక్షతన ప్రభుత్వం నియమించిన కాళోజీ అవార్డు కమిటీ.. రమాదేవిని ఎంపిక చేసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ శివునిపల్లికి చెందిన రమాదేవి.. ఆంధ్రాబ్యాంకు అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ప్రవృత్తి రీత్యా ఆమె కార్టూనిస్టు కాక అనేక పుస్తకాలను వెలువరించి ఓరుగల్లు సాహిత్యరంగంలో తన పేరును సుస్థిరం చేసుకున్నారు. 2011లో మనస్సు భాష సాహిత్యాన్ని ప్రకటించిన ఆమె.. తన సాహిత్య ప్రతిభతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం సినారే సాహిత్య పురస్కారంతోపాటు అనేక అవార్డులు పొందారు. ఈనెల 9న సాయంత్రం 6గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వం పక్షాన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లు ఆమెను రూ.లక్ష నగదుతో కాళోజీ పురస్కారాన్ని అందచేస్తారు. కాగా, కాళోజీ పురస్కారం పొందిన రమాదేవిని వరంగల్ ఎంపీ కడియం కావ్యతో పాటు పలువురు అభినందించారు.

వర్షాకాలం పాములతో పైలం



నల్లబెల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో రైతన్నలు పాములతో చాలా జాగ్రత్తగా ఉండాలి. వర్షాకాలం ప్రారంభం కాగానే పొలం గట్లలపై నీటి మడుగుల వద్ద, గడ్డి మొక్కలు ఉన్న ప్రాంతాల్లో అపరిశుభ్రంగా ఉండే ప్రాంతాలు, కుంటలు, పశువులు, పాకలు, గడ్డివాములు, ఉండే ప్రాంతాల్లో విష సర్పాలు, విషపు పురుగులు ఎక్కువగా సంచరిస్తూ ఉంటాయి. వర్షానికి పుట్టలోంచి వరద నీరు చేరడంతో అవి బయటకు ఎక్కువగా వస్తుంటాయి. వానాకాలంలో పాముకాటు బారిన పడిన వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. వర్షాకాలంలో రైతులు ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. రైతులు వ్యవసాయ పంట చేనుల వద్దకు ఉదయం, రాత్రి వేళలనే తేడా లేకుండా వెళుతుంటారు. పొలాల, పొదల మధ్యన పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. రాత్రి సమయాల్లో పొలాల్లో తిరిగి వారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

విష సర్పాల గుర్తించడం ఇలా..

నాగుపాము, తాచుపాము, రక్తపింజర, కట్లపాము, తెట్టెపురుగు, తేళ్లు, జెర్రిలు అత్యంత విషపూరితమైనవి. విష సర్పాలు కాటు వేసినట్టయితే ఆలస్యం చేయకుండా చికిత్స కోసం దవాఖానాకు వెళ్లాలి. నాగుపాము, తాచుపాము, కట్లపాము కాటువేస్తే విషం నేరుగా నాడీ వ్యవస్థ మీద, ఊపిరితిత్తుల మీద పని చేస్తోంది. హృదయ స్పందన ఆగి మనిషి అక్కడికక్కడే మృతి చెందడం జరుగుతుంది. రక్తపింజర విషం ఎక్కువగా రక్త నాళాలపై ప్రభావం చూపుతుంది. రక్తనాళాలు చిట్లీ నోటి నుంచి రక్తం వస్తుంది. రక్త నాళాల్లో రక్త ప్రసరణ ఆగిపోతుంది. రక్తం గడ్డ కట్టడం వల్ల కాటుకు గురైన వ్యక్తి మృతి చెందుతాడు. పాము కాటు వేసిన చోట రెండు గాట్లు పడినట్టుయితే అది విషసర్పం కాటుగా గుర్తించాలి. అంతకంటే ఎక్కువ గాట్లు పడితే అది సాధారణ పాముగా గుర్తించాలి.

పాము కాటుకు ప్రథమ చికిత్స ఇలా..

పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. అతని పక్కన మరొక వ్యక్తి ఉండి ధైర్యం చెప్పాలి. పాము కాటు వేసిన పై భాగంలో వెంటనే తాడుతో లేదా గుడ్డతో కొంత శరీరాన్ని రక్తం ఆడకుండా బిగించి కట్టాలి. గాయం చేసి రక్తం కారనివ్వాలి. పాము కాటుకు గురైన వ్యక్తిని నడిపించడం కానీ, పరుగులు పెట్టించడం కానీ చేయకూడదు. అలాగే పాము కాటుకు గురైన వ్యక్తిని నిద్రపోకుండా చూసుకొని, కదిలించకుండా తక్షణమే దవాఖానాకు తరలించాలి. అంతేకాక, పాము కాటు గాయాన్ని కడగడం గాని, ఐస్ పెట్టడం గాని చేయకూడదు.

నేత్రదాతల కుటుంబాలకు నేడు సన్మానం

హసన్‌పర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ ముచ్చర్ల మహిళా కమ్యూనిటీ హాలులో సోమవారం ఉదయం 9 గంటలకు తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో నేత్రదాతల కుటుంబాలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కొన్‌రెడ్డి మల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, విశిష్ట అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గౌరవ అతిథిగా హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భరత్‌కుమార్, 1వ డివిజన్ కార్పొరేటర్ వరంగటి అరుణకుమారితో పాటు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పెండ్లి ఉపేందర్ రెడ్డి, అసోసియేషన్ అడ్వైజర్ మండల రవిందర్, అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు బోగి సుజాత, మునిగాల పద్మ, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.జనార్ధన్ రెడి హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పరిమళకాలనీ, సప్తగిరికాలనీ, పూరిగుట్ట, పోలీస్ కాలనీ, ఆర్‌టీసీ కాలనీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కేయూసీ పరిధిలోని సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్‌నగర్, ఆదర్శకాలనీ ఏరియాలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, నయింనగర్, లష్కర్‌సింగారం ఏరియాలో ఉదయం 10 గంటల నుంచా 12 గంటల వరకు, ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

వారాల కుల సంఘం కమిటీ ఎన్నిక



హసన్‌పర్తి వారాల కుల సంఘం నూతన కమిటీ సభ్యులు

హసన్‌పర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి వారాల కుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు ఆదివారం ప్రకటించారు. మండల కేంద్రంలోని వారాల కుల సంఘం భవనంలో ఆదివారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పావుశెట్టి నర్సింహరాములు, కందుకూరి సంజీవ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి వారాల కుల సంఘం నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర బాధ్యులు పావుశెట్టి వెంకటేశం, గుండమీది రవీందర్‌లు హాజరుకాగా ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పావుశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శిగా గుండమీది కృష్ణమోహన్, కోశాధికారిగా గుండమీది రాజేందర్, ఉపాధ్యక్షులుగా గుండమీది విజయ్‌మోహన్, కందుకూరి శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా కనపర్తి అశోక్, పాపిశెట్టి ప్రవీణ్, జోనల్ కౌన్సిలర్‌గా గంట నాగేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా గౌరిశెట్టి సురేందర్, కొండమీది సంతోష్, గంట జలందర్, పాపిశెట్టి జితెందర్, నన్నెంశెట్టి మహేష్, మొలుగూరి శారద, పాపిశెట్టి అభిలాష్, అమిరిశెట్టి శ్రవణ్‌కుమార్, ముక్త మహేష్, దాసరి బాలరాజులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు.

భారీ వర్షం.. అతలాకుతలం

» లోతట్టు ప్రాంతాలు జలమయం » కాలనీల్లో నిలిచిన వర్షపు నీరు » అవస్థలు పడిన ప్రజలు



హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లో ఏరులై పారుతున్న వరద నీరు

వడ్డేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి హనుమకొండలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం ఉదయం సుమారు 6.30 గంటల నుంచి 9 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు అతలకుతలమయ్యాయి. వర్షం నీరు చేరడంతో కాలనీల్లోని ప్రజలు నానాఅవస్థలు ఎదుర్కొన్నారు. గ్రేటర్ 56వ డివిజన్ జవహర్ కాలనీ, పరిమళ కాలనీ, ద్వారకా సాయి కాలనీ ప్రాంతాలు వర్షప్రభావానికి గురయ్యాయి. హనుమకొండ 57వ డివిజన్‌లోని గోకుల్ నగర్, అశోక కాలనీ, వెంకట్రాం నగర్ కాలనీతో పాటు భవానీ నగర్, ఇందిరా నగర్, పలు లోతట్టు ప్రాంతాలు వర్షం నీరు ఇళ్లల్లోకి చేరడంతో నానా అవస్థలు పడ్డారు. అశోక కాలనీలో రెండు చెట్లు కూలిపోవడంతో ఆర్డీఎఫ్ సిబ్బంది వాటిని తొలగించారు.

అశోక కాలనీలో రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో ఎన్‌పీడీసీఎల్ అధికారులు వెంటనే స్పందించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గోకుల్ నగర్‌లో వర్షపు నీరు పేదలు నివాసం ఉంటున్న ఇళ్లల్లోకి చేరి నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ గోకుల్ నగర్ , అశోక కాలనీలను సందర్శించి లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పేదలకు 250 పాల ప్యాకెట్లు, అన్న ప్యాకెట్లను అందజేశారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూప రాణి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు హనుమాస్ తిరుపతి రెడ్డి ఆరోపించారు. డివిజన్‌లో అభివృద్ధి కొరవడడం వలనే అంబేద్కర్ భవన్ రోడ్డును ఆనుకొని ఉన్న అశోక కాలనీ , గోకుల్ నగర్ జలమయమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కాలనీలలో ముంపును అరికట్టేందుకు శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు.

హనుమకొండ చౌరస్తా జలమయం

హనుమకొండ చౌరస్తా : భారీ వర్షానికి హనుమకొండ చౌరస్తా జలమయమైంది. ప్రధాన రోడ్లతో పాటు సమీపంలోని పలు కాలనీలకు వరద నీరు పెద్దఎత్తున చేరింది. హనుమకొండ చౌరస్తాలో వరద నీరు ప్రధాన రోడ్డు వెంబడి మోకాళ్ల లోతు వరద పొంగి ప్రవహించడంతో రోడ్లన్ని చెరువులను తలపించాయి. డ్రైనేజీలు నిండి మురుగు నీరు రోడ్లపైకి చేరి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లడంతో స్థానికులు, అటుగా వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. హనుమకొండ చౌరస్తా నుంచి ములుగురోడ్డుకు వెళ్లే మెయిన్ రోడ్డులో భారీగా వరదనీరు చేరింది. పార్కింగ్ చేసిన పలు వాహనాలలోకి వర్షపు నీరు చేరడంతో మొరాయించాయి. అదే విధంగా హనుమకొండ చౌరస్తాకు ఆనుకొని ఉన్న టైలర్‌స్ట్రీట్ రోడ్లు వరద నీటితో వాగులను తలపించాయి. 8, 9, 10 డివిజన్లలోని పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు వరద నీటితో మునిగిపోవడంతో స్థానికులు భయాందోళన చెందారు.



9వ డివిజన్ రాయపురలో ప్రవహిస్తున్న వరద



వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న హనుమకొండ చౌరస్తా రోడ్డు



గోకుల్ నగర్ వద్ద డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పేదల భూములపై అక్రమార్కుల కన్ను

» 40 ఏళ్ల కిందట సర్కారు ఇచ్చిన స్థలాల కబ్జా
» అక్రమ నిర్మాణాలు.. విక్రయాలు
» పట్టించుకోని అధికారులు, పాలకులు



బాలసముద్రంలోని అంబేద్కర్ నగర్‌లో వివాదస్పదంగా మారిన ప్రభుత్వ భూమి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని అంబేద్కర్ నగర్, శ్రీనివాస్‌నగర్‌లో ప్రభుత్వభూములపై కబ్జాలు పెరిగిపోతున్నాయి. స్థానిక నాయకులు, అధికారుల అండదండలతో విలువైన ప్రభుత్వ భూములను కబ్జాదారులు కొల్లగొడుతున్నారు. 40 ఏళ్ల కిందట నిరుపేదలకు 60 గజాల చొప్పున సుమారుగా 300 మందికి పైగా పట్టాలు పంపిణీ చేశారు. అయితే ఈ స్థలాల్లో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

హెచ్చరిక బోర్డు మాయం

అంబేద్కర్ నగర్, శ్రీనివాస్ నగర్ కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో గతంలో కొంత మంది కబ్జాలకు పాల్పడుతున్నారని కాలనీ వాసులు ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులు సర్వే నంబర్‌తో కూడిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల తర్వాత కొంత మంది కబ్జాదారులు బోర్డులను మాయం చేసి జేసీబీలతో స్థలాలను చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. స్థానికంగా కొందరు రాజకీయ నేతల మద్దతుతోనే ఒకే సర్వే నంబర్‌తో రెండు మూడు చోట్ల ఇళ్ల నిర్మాణం చేసి విక్రయాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాలు కొనసాగిస్తున్నారని, దీంతో ప్రభుత్వ భూములు వివాదాస్పదంగా మారుతున్నట్లు చెబుతున్నారు. 898 సర్వే నంబర్‌లో అక్రమణలు జరిగితే చర్యలు తీసుకుంటామని గతంలో పనిచేసిన తహసీల్దార్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

కమ్యూనిటీ హాల్ స్థలంపై ఉద్రిక్తత

అంబేద్కర్ నగర్, శ్రీనివాస నగర్ కాలనీలకు కమ్యూనిటీ హాల్ కోసం గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టరు పనులు చేపట్టేందుకు వెళ్లగా కొంత మంది ఇది తమ పట్టా భూమి అని, కమ్యూనిటీ హాల్ నిర్మించవద్దని గొడవ పడ్డారు. ఈ గొడవలో రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో కొందరిపై కేసులు నమోదయ్యాయి. అయినా కూడా మళ్లీ కబ్జాల పర్వం కొనసాగుతోందని చెబుతున్నారు. అధికారులు సైతం మౌనం పాటించడంలో ఆంతర్యం ఏమిటని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి గతంలో పంపిణీ చేసిన పట్టాలు ఎన్ని?, కబ్జాలో ఎంత మంది ఉన్నారో గుర్తించి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని, కబ్జాలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాని కాలనీల వాసులు కోరుతున్నారు.

శ్మశానవాటిక కూల్చివేతపై దర్యాప్తు

ఇన్‌స్పెక్టర్ రవికుమార్

హసన్‌పర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేయూసీ పోలీసు స్టేషన్ పరిధి చింతగట్టు కెనాల్ కాలువ సమీపంలోని ఎర్రగట్టుగుట్ట శ్మశానవాటిక కూల్చివేతపై దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేయూసీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. ఈ నెల 3న శ్మశాన వాటిక గద్దెల కూల్చివేతపై కాలనీవాసుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

బీఆర్ అంబేద్కర్ భావజాలాన్ని విస్తృత పర్చాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మిద్దెపాక ఎల్లయ్య

వడ్డేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ భావజాలాన్ని ఊరూరా, పల్లెపల్లెనా విస్తృతపర్చి ప్రజలను చైతన్యపర్చాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొమ్మల్ల అంబేద్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్స సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారితో పాటు దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ మాట్లాడారు. అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ సభను ఈనెల 21న వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాలలో నిర్వహించాలని అంబేద్కర్ వాదులకు పిలుపునిచ్చారు. తొలుత అంబేద్కర్ సంఘ కార్యాలయాల ముందు నీలి రంగు జెండాలను ఆవిష్కరించి డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సందేశాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి యాడాల రవీందర్, తప్పెట్ల వీరన్న, పుల్ల మల్లయ్య, డీకొండ కాంతారావు, ఏనుట్ల రవీందర్, డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, సురేష్, వెంకటేశ్వర్లు, ఇల్లందుల శ్రీకాంత్, సునిల్, రాజయ్య, యాడాల జగపతి, శ్రీను, శ్యామ్, రాంబాబు, రాజయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



మౌనిక చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు

మృతురాలి కుటుంబానికి పరామర్శ

హసన్‌పర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 2వ డివిజన్ పరిధి విజయలక్ష్మీ కాలనీకి చెందిన అడ్వకేట్ దండు మోహన్ కుమార్తె మౌనిక ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. మృతి విషయం తెలిసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి మౌనిక చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి వెంట స్థానిక నాయకులు బండి రజనీకుమార్, జట్టి రాజేందర్ ఉన్నారు.

'నేత్రదానంతో మరో జీవితం'

మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

ఖిలావరంగల్,సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరో జీవితంలో వెలుగులను చూడవచ్చని అవయవ దాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆదివారం 38వ డివిజన్ ఖిలావరంగల్‌లోని పద్మశాలి భవనంలో గాయత్రీ మహిళా సంఘం నేతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అనువంశీక డాక్టర్ తాళ్ళ సమ్మయ్య, డాక్టర్ దర్శిని, మహిళా సంఘాల ప్రతినిధులు తాళ్ళ సావిత్రి, కళ్యానపు కవిత, వనం సుమతి, బేతిదీప, వడిచెర్ల కళావతి, మణేమ్మ, నిర్మల, వరలక్ష్మి, స్వప్న, సమత, రాజేశ్వరి పాల్గొన్నారు.

మార్మోగిన విష్ణు సహస్ర నామం



గోవిందరాజుల గుట్టపై విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న భక్తులు

గిర్మాజీపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ శ్రీగోవిందరాజస్వామి గుట్ట ఆదివారం విష్ణునామ స్మరణతో ఓలలాడింది. ఉదయం 10 గంటలకు గుట్టపై ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసస్వామితో పాటుగా అర్చకులు గోవిందాద్రి గోశాల విష్ణు సహస్ర నామ పారాయణ బృందం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోశాల విష్ణు సహస్ర నామ పారాయణం బృందం సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకులు వరయోగుల లక్ష్మణస్వామి, పారాయణ బృందం వ్యవస్థాపకులు గర్నెపల్లి సుధాకర్, అర్చకులు వరయోగుల ప్రసాద్ స్వామి, గోపి స్వామి, శ్రీధర స్వామి, మురళీకృష్ణ స్వామి పాల్గొన్నారు.

చిత్తడే.. చిత్తడి

» పరిమళ కాలనీలో సమస్యలు పాగా
» రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యం
» కనీస వసతులు కల్పించాలని కోరుతున్న కాలనీవాసులు



పరిమళ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు

వడ్డేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 56వ డివిజన్ పరిమళ కాలనీలో సమస్యలు పాగ వేశాయి. రోడ్లు, డ్రెయినేజీలు మృగ్యమయ్యాయి. చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. కనీస వసతులు కల్పించాలని కాలనీవాసులు జీడబ్ల్యూఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

బురదమయంగా రోడ్లు..

పరిమళ కాలనీలోని రోడ్లన్నీ మట్టి రోడ్లే కావడంతో చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. కాలనీలోని రోడ్డు నంబర్ 14 ఏలో డ్రెయినేజీలు, రోడ్లు లేక చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయమవుతున్నాయి. కాలనీలోని రోడ్డు నంబర్ 17లోని ఖాళీ ప్లాట్లల్లో నిరుపయోగమైన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పాములు, తేళ్లకు విడిదిగా మారాయి. కాలనీలో కోతులు, పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వీటితో ప్రజలు బయటకు రావడానికే బెంబేలెత్తుతున్నారు. కనీస వసతులు కల్పించాలని జీడబ్ల్యూఎంసీ అధికారులకు ఎన్నోమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా కాలనీలో కనీస వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా రోడ్లు నిర్మించాలి



పెద్దిరెడ్డి రమాదేవి, పరిమళ కాలనీ

పరిమళ కాలనీలో పక్కా రోడ్లు నిర్మించాలి. మట్టి రోడ్లు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. పక్కా డ్రెయినేజీలు నిర్మించి కనీస వసతులు కల్పించాలి. కోతులు, పశువుల బెడదను అరికట్టాలి.



పరిమళ కాలనీలో ఖాళీ ప్లాట్‌లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

బేబీ స్పాలు వచ్చేశాయి!

పెద్దలు ఒత్తిడి తగ్గించుకునేందుకు, మసాజ్ కోసం స్పాలకు వెళ్తుంటారు. శిశువులకు కూడా హీలింగ్‌థెరపీ అందించేందుకు దేశంలోనే మొట్టమొదటిగా ఆస్పత్రి ఆధారిత బేబీ స్పా హైదరాబాద్‌లోని ఫెర్నాండెజ్ ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. బేబీ స్పాలో నెలన్నర నుంచి 10 నెలల మధ్య వయసు శిశువులకు హైడ్రోథెరపీ, మసాజ్.. మొదలైన సేవలు అందిస్తారు. అయితే పిల్లలకు స్నానం చేయించే విషయంలో, స్పా విషయంలో ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. వాటిలో నిజమెంతో తెలుసుకుందాం..



సాధారణంగా పెద్దవారు శిశువులకు శరీరమంతా కొబ్బరి నూనె రాసి చాలా బలంగా రుద్దుతూ ఉంటారు. ఇలా చేస్తే మంచిదని అనుకుంటారు. కానీ అలా చేయకూడదు. పిల్లల శరీరం చాలా సున్నితంగా ఉంటుంది. పిల్లలకు చాలా సున్నితంగా నూనె మర్దనా చేయాలి. అందులోనూ పిల్లలకు కొబ్బరి నూనె కన్నా ఆలివ్ నూనెతో మర్దనా చేస్తే మంచిది. డెర్మటాలజిస్టును కలిసి వారు చెప్పినవి వాడితే ఇంకా మంచిది.

- కొంతమంది పిల్లలకు స్నానం చేయించేందుకు కొంచెం వేడి ఎక్కువగా ఉన్న నీరు వాడతారు. దీని వలన చర్మం దెబ్బతింటుంది. శిశువుల స్నానానికి గోరువెచ్చని నీరు మాత్రమే వాడాలి.
- జలుబు, జ్వరం ఉన్నప్పుడు పిల్లలకు స్నానం చేయించకూడదని అలా చేస్తే జలుబు, జ్వరం మరింత ఎక్కువ అవుతుందని అనుకుంటారు. కానీ అలాంటిదేమీ ఉండదు. వాస్తవానికి స్నానం చేయించడం వలన పిల్లలకు ఉపశమనం కలుగుతుంది. కొంతమంది అయితే పుట్టిన కొన్ని నెలల వరకు శిశువులకు ఒక పూట మాత్రమే స్నానం చేయిస్తారు. దీని వలన పిల్లలకు నష్టం ఉండదు. కానీ రెండు పూటలా స్నానం చేయిస్తే పిల్లలకు హాయిగా ఉండి ప్రశాంతంగా నిద్రపోతారు. ఉత్సాహంగా ఆడుకుంటారు.
- పిల్లలకు మసాజ్, స్నానం ఎప్పుడు పడితే అప్పుడు చేయించకూడదు. పిల్లలు పాలు లేదా ఆహారం తీసుకున్న అరగంట తరువాతనే మసాజ్, స్నానం చేయించాలి. ఇంకా పిల్లలు నిద్రపోయి లేచి పూర్తి మెలకువతో ఉన్న సమయంలో చేయించడం మంచిది.
- పిల్లలకు ఇంట్లో పెద్దవారు స్నానం చేయిస్తారు. అయితే తల్లితండ్రులు స్నానం చేయించడం అలవాటు చేసుకోవాలి. దీని వలన కూడా పిల్లలకు వారితో అనుబంధం పెరుగుతుంది.

బేబీ స్పా మీద భయాలు వద్దు

హాస్పిటల్ ఆధారిత బేబీ స్పా మీద ఎలాంటి భయాలు అక్కర్లేదు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శిశువులకు థెరపీ అందిస్తారు. పిల్లల ఎదుగుదలను ఫిజియోథెరపిస్టులు నిరంతరం పర్యవేక్షిస్తారు. అవసరాన్ని బట్టి ఏ థెరపీ అవసరమో నిర్ణయిస్తారు. కేవలం శిశువుల శారీరక, మానసిక ఆరోగ్యం మాత్రమే కాకుండా తల్లిదండ్రులతో బిడ్డ బంధం బలంగా ఏర్పడుతుందా లేదా అన్నది కూడా పరిశీలిస్తారు. ఎందుకంటే కొంతమంది శిశువులకు తల్లితో అనుబంధం త్వరగా ఏర్పడదు. అలాంటి వారికి అవసరాన్ని బట్టి ఇంటి వద్ద ఏం చేయాలన్న సలహాలు కూడా అందిస్తారు. పిల్లలకు హైడ్రో థెరపీ అందించేటప్పుడు పిల్లలకు శరీరానికి సరిపడా ఉష్ణోగ్రత ఉన్న నీటినే వినియోగిస్తారు. పిల్లలకు అలర్జీలు రాకుండా వారి శరీరానికి నప్పే నూనెనే వాడతారు.

● డాక్టర్ బి సుష్మ
కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్, ఫెర్నాండెజ్ హాస్పిటల్ స్టోర్క్ హోమ్, బంజారాహిల్స్, హైదరాబాద్.



అభిరుచి



లోయకు ఫ్యాషన్ హంగులు

చిన్నప్పటి నుంచీ ఒక ఆశ... ఫ్యాషన్ డిజైనర్ కావాలని. పెరిగే వయసులో ఒక ఆశయం... కశ్మీర్ సంప్రదాయ దుస్తులకు పూర్వ వైభవం తేవాలని. రెండిటినీ నెరవేర్చుకుని... లోయలో తొలి ఆన్‌లైన్ ఫ్యాషన్ స్టోర్ నెలకొల్పిన ఘనత ఆమెది. స్థానిక వెరైటీలకు వైవిధ్యాన్ని జోడించి... పదేళ్లలో తమ వస్త్ర శ్రేణులను దేశం దాటి విదేశాల్లోనూ విక్రయించే స్థాయికి ఎదిగిన ఇక్రా అహ్మద్ ఫ్యాషన్ జర్నీ ఇది.

"కలలు అందరూ కంటారు. కానీ కొందరే వాటిని నెరవేర్చుకోగలుగుతారు. అందుకు మన ప్రయత్నమే కాదు.. పరిస్థితులు కూడా అనుకూలించాలనేది నా అభిప్రాయం. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. నా శ్రమకు ఇంట్లోవాళ్ల సహకారం తోడైంది. కనుకనే ఇవాళ మరో పది మందికి ఉపాధి కల్పించగలుగుతున్నాను. ప్రాకృతిక అందాలే కాదు... అద్భుత కళాకృతులు, కళలకు నిలయమైన కశ్మీర్ మాది. ఎందుకో తెలియదు... చిన్నప్పటి నుంచీ ఫ్యాషన్ డిజైనర్‌ను కావాలని కలలు కనేదాన్ని. వయసు పెరుగుతున్నకొద్దీ ఆ ఆకాంక్ష నాలో బలపడుతూ వచ్చింది. పాఠశాల విద్యాభ్యాసం తరువాత డిజైనింగ్‌లో కోర్సు చేయాలని అనుకున్నా. కానీ కశ్మీర్‌లో ఫ్యాషన్ స్కూళ్లు ఏవీ లేవన్న విషయం అప్పుడు తెలిసింది.

ఉద్యోగ వేటలో...

వేరే ప్రాంతానికి వెళ్లి ఫ్యాషన్ కోర్సు చేస్తానంటే ఇంట్లో వాళ్లు ఒప్పుకోరని తెలుసు. దాంతో స్థానిక కాలేజీలో చేరాను. ఎకనామిక్స్, సైకాలజీల్లో ఎంఏ చదివాక కశ్మీర్ విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రం పూర్తి చేశాను. డిగ్రీలు చేత పట్టుకుని ఉద్యోగాల వేట మొదలుపెట్టాను. ఆ ప్రయత్నంలోనే నాలో మరుగున పడిపోయిన ఫ్యాషన్ డిజైనర్ కల కళ్ల ముందు మెదిలింది. ఇక వేరే ఆలోచనలకు అవకాశం ఇవ్వలేదు. నేనే సొంతంగా ఆన్‌లైన్ ఫ్యాషన్ స్టోర్ పెట్టాలని నిర్ణయించుకున్నాను. అదికూడా సంప్రదాయ కశ్మీర్ వస్త్ర శ్రేణులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తేవాలన్న బలమైన ఆశయంతో అడుగు ముందుకు వేశాను.

నానమ్మ, నాన్న నుంచి...

ఆన్‌లైన్ స్టోర్ ప్రారంభించాలని అనుకున్నప్పుడు ఫ్యాషన్ డిజైనింగ్‌లో నాకు ఓనమాలు తెలియదు. కానీ మా సంస్కృతి, కళల గురించి అవగాహన ఉంది. కొత్తగా ప్రయత్నించాలనే పట్టుదల, నన్ను నేను నిరూపించుకోవాలనే దృఢమైన సంకల్పం ఉన్నాయి. ఇందుకు కారణం... మా నాయనమ్మ, మా నాన్న. నాయనమ్మ అలంకరించుకున్న సంప్రదాయ కశ్మీరీ నగలు, ధరించే ఫిరన్ నన్ను బాగా ఆకట్టుకునేవి. ఇక మా నాన్న... లోయ అందాలు, అందులో ఇమిడిన విభిన్న సంస్కృతుల గురించి కథలుగా చెప్పేవారు. వీటన్నిటి నుంచి స్ఫూర్తి పొందాను. వివిధ మాధ్యమాల ద్వారా డిజైనింగ్ నేర్చుకున్నాను. ఒకరిని అనుకరించకుండా... నాలోని సృజనకు రెక్కలు తొడిగాను.

దేశవిదేశాల్లో...

దేశంలోనే కాకుండా ఇతర దేశాలకు కూడా మా ఉత్పత్తులు వెళుతున్నాయి. మా వ్యాపార వృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటి సామాజిక మాధ్యమం. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా ఎంతో ప్రచారం లభించింది. ప్రస్తుతం మా సంస్థలో పది మంది మహిళలు పని చేస్తున్నారు. స్వశక్తితో నేను నిలదొక్కుకోవడమే కాకుండా... మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నందుకు గర్వంగా ఉంది. కశ్మీర్ సంస్కృతి, సంప్రదాయ కళా వారసత్వాన్ని నిలబెడుతున్నందుకు అంతకు మించిన సంతృప్తి కలుగుతోంది."



నిత్యం కళ్లముందు కదలాడే అందాలను మేళవించి, సంప్రదాయ సోయగాలకు ఆధునిక హంగులు అద్దాను. అలా కేవలం పది వేల రూపాయల పెట్టుబడితో 2015లో ఆన్‌లైన్ స్టోర్ 'తుల్ పలవ్' ప్రారంభించాను. విశేషం ఏంటంటే.. లోయలో మొట్టమొదటి ఆన్‌లైన్ ఫ్యాషన్ స్టోర్ మాదే.

సవాళ్లు ఎదురైనా...

స్టోర్ ప్రారంభించిన తొలి రోజుల్లో ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. సమస్యాత్మక ప్రాంతం కావడంతో, ఇంటర్నెట్ ఎప్పుడు ఉంటుందో... ఎప్పుడు పోతుందో తెలియదు. అప్రకటిత అత్యవసర పరిస్థితులవల్ల కస్టమర్లకు ఆర్డర్ పంపించాలన్నా ఇబ్బందులు తలెత్తేవి. అన్నిటికీ మించి మన ఉత్పత్తుల మీద, మన సేవల మీద నమ్మకం కుదరాలంటే వారికి అనుకున్నది అనుకున్న సమయానికి డెలివరీ చేయగలగాలి. ఇలా మెటీరియల్ సమకూర్చుకోవడం నుంచి డిజైనింగ్ వరకు, స్థానిక కళాకారులను సంప్రదించడం నుంచి ఆకర్షణీయమైన వస్త్రశ్రేణులను రూపొందించడం వరకు... అడుగడుగునా సవాళ్లే. ఒక్కొక్కటీ అధిగమిస్తూ వచ్చాను.

అందరికీ అందుబాటులో...

కొన్నాళ్లకు నా కృషి ఫలించింది. లోయలోనే కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి కూడా ఆర్డర్లు మొదలయ్యాయి. దీంతో ఆన్‌లైన్‌తో పాటు స్థానికంగా ఒక ఫ్యాషన్ స్టోర్ నెలకొల్పాను. మా వద్ద ప్రధానంగా కశ్మీరీకే ప్రత్యేకమైన ఫిరన్, కుర్తాలు, వెడ్డింగ్ డ్రెస్‌లు ఎన్నో వెరైటీలు ఉన్నాయి. మా స్టోర్‌లో అత్యధికంగా అమ్ముడయ్యే ఉత్పత్తి... 'టిల్లా' వర్క్ ఫిరన్. బంగారం, వెండి దారాలతో చేసే ఎంబ్రాయిడరీ దీని ప్రత్యేకత. ఇరాన్‌లోని జరీ గ్రామానికి చెందిన ఈ కళను... మిర్ సయ్యద్ అలీ హమ్‌దానీ శతాబ్దాల కిందట కశ్మీర్‌కు తీసుకువచ్చారు.

చిత్తు కాగితాలిస్తే... నోట్‌బుక్స్ ఇస్తారు

"పర్యావరణాన్ని నాశనం చేయడానికి పెద్దగా కష్టపడక్కర్లేదు. కానీ దానివల్ల సంభవించే విపత్తులు మానవాళికి ముప్పుగా మారుతాయి. ఎన్నో ఏళ్ళు కొనసాగుతాయి. ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. బాధ్యతగా మెలగాలి" అంటారు ప్రీతూ. ఆమె సంస్థ 'లిటిల్ లీఫ్' లక్ష కిలోలకు పైగా చిత్తుకాగితాలను రీసైకిల్ చేసింది. దానితో నోట్ పుస్తకాలు తయారు చేయించి పేద విద్యార్థులకు పంపిణీ చేస్తోంది.





"మన దేశంలో ఏ ప్రాంతమైనా కావచ్చు... ప్లాస్టిక్ వ్యర్థాలు, చిత్తుకాగితాలు కనిపించని వీధి దాదాపుగా ఉండదు. ప్రజల్లో పర్యావరణంపై తగిన అవగాహన లేకపోవడం దీనికి ఒక కారణం అయితే, వాటిని మళ్ళీ ఉపయోగించుకొనే పద్ధతుల గురించి తెలియకపోవడం మరో కారణం. కాగితాలు భూమిలో కలిసిపోతాయి కాబట్టి వాటివల్ల ముప్పు లేదని అనుకుంటాం. కానీ ఒక టన్ను కాగితం తయారు కావాలంటే... పూర్తిగా ఎదిగిన పది నుంచి పదిహేను చెట్లను మనం కోల్పోవాల్సి ఉంటుంది. అంతేకాదు... కొన్ని వేల లీటర్ల నీరు వినియోగించాలి. దీనికి బదులుగా... చిత్తు కాగితాలనే రీసైకిల్ చేసి, నోట్ పుస్తకాలుగా మార్చితే... వాటిని పేద పిల్లలకు పంచిపెడితే... రెండు సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. మేము చేస్తున్నది అదే.

మహాత్ముడి స్ఫూర్తితో...


నేను వారణాసిలో పుట్టి పెరిగాను. కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత... ఒక కంపెనీలో అయిదేళ్ళపాటు పని చేశాను. చిన్న వయసునుంచే నాకు పర్యావరణ స్పృహ ఎక్కువ. ప్రతి వీధిలో కుప్పలు కుప్పలుగా చెత్త పోగు పడడం నన్ను కలవరపెడుతూ ఉండేది. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగం కావడం కూడా కాలేజీ రోజుల్లోనే మొదలయింది. పేద పిల్లల చదువుకు సాయం చెయ్యడం, పుస్తకాలు, బ్యాగ్‌లు ఇవ్వడం లాంటివి చేసేదాన్ని. సమాజం అంతటికీ పనికివచ్చే ఏదైనా పని చేయాలనే ఆలోచన నన్ను వెంటాడుతూ ఉండేది. ముఖ్యంగా వ్యర్థాలను రీసైకిల్ చేయడం వల్ల పర్యావరణానికి మేలు జరగడంతోపాటు... తద్వారా చేసిన ఉత్పత్తులను ఉచితంగా ఇవ్వడం ద్వారా అణగారినవర్గాలకు సాయం చేయవచ్చని అనుకున్నాను. మహాత్మాగాంధీ నాకు ఆదర్శం. ఆయన స్ఫూర్తితో... 2014 అక్టోబర్ రెండున వారణాసిలో 'లిటిల్‌లీఫ్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. వ్యర్థాలను సేకరించడం, రీసైక్లింగ్ చేసే సంస్థలకు వాటిని అప్పగించడం. మొదట్లో మా ఉద్దేశం అదే. ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలపైనే మా దృష్టి ఉండేది. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్న వ్యక్తులతో కలిసి పని చేస్తున్నప్పుడు... నోట్ పుస్తకాల తయారీకి రీసైకిల్ చేసిన పేపర్‌ను తయారీదారులు ఉపయోగిస్తారనే సంగతి తెలిసింది. చెత్త కాగితాలను సేకరించి, రీసైకిల్ చేసి, నోట్ పుస్తకాలుగా మార్చి, వాటిని కొనుక్కొనే స్తోమత లేని విద్యార్థులకు అందించాలనే ఆలోచన అలా రూపుదిద్దుకుంది. ఈలోగా కొన్ని కారణాలవల్ల 2018లో మా సంస్థను పుణే నగరానికి మార్చాల్సి వచ్చింది. అక్కడే మా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాం.

జనం అనుమానించారు...

చెత్త కాగితాల సేకరణ అంత సులువుగా జరిగిపోలేదు. ఇంటింటికీ నేను, మా వాలంటీర్లు వెళ్ళి అడిగితే... వాటిని అమ్ముకోవడానికి మేము సేకరిస్తున్నామేమోనని జనం అనుమానపడ్డారు. వారి సందేహాలను నెమ్మదిగా తొలగించాం. పనికిరావనుకున్న కాగితాలను వీధుల్లో, చెత్త కుండీల్లో పడేయకుండా... రీసైక్లింగ్‌కు ఇచ్చేలా ప్రజల్ని ప్రోత్సహించడం కోసం ఒక ప్రణాళిక రూపొందించాం. వాటిని వారి ఇళ్ళ దగ్గరే సేకరించేలా ఏర్పాటు చేశాం. రెండు కిలోల చెత్త కాగితాలను ఎవరైనా ఇస్తే... దానికి బదులు... రీసైకిల్డ్ నోట్‌బుక్ ఒకటి వారు తీసుకోవచ్చు లేదా మా ద్వారా ఎవరైనా పిల్లలకు విరాళంగా ఇవ్వొచ్చు. దీనివల్ల సామాజిక సేవలో తాము భాగస్వాములని ప్రజలు భావిస్తారని అనుకున్నాం. మా పిలుపునకు అనూహ్యమైన స్పందన వచ్చింది. ఫలితాలు కూడా ఆశావహంగా ఉన్నాయి. ఇప్పటివరకూ లక్ష కిలోలకు పైగా చిత్తు కాగితాలను రీసైకిల్ చేశాం. యాభైవేలకు పైగా నోట్ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లోని పేద పిల్లలకు పంచిపెట్టాం. చాలా కుటుంబాల్లోని పిల్లల చదువు ఖరీదైన వ్యవహారం. వారికి మా వంతుగా సాయం చెయ్యడం ఎంతో సంతోషంగా ఉంది. మామూలు కాగితం తయారీతో పోలిస్తే రీసైక్లింగ్ పేపర్ తయారీకి దాదాపు పదోవంతు నీరు సరిపోతుంది. ఇక పర్యావరణపరమైన ప్రయోజనాలు అసంఖ్యాకం. ప్రతి పుస్తకం మీదా... పర్యావరణ పరిరక్షణతోనే మానవుల భవిష్యత్తు ఉందనే సందేశాన్ని ముద్రించి, పిల్లల్లో అవగాహన కల్పిస్తున్నాం. వ్యర్థాలపట్ల ప్రజల దృక్పథం మార్చడానికి, రీసైక్లింగ్ పట్ల అవగాహన కలిగించడానికి మా సంస్థ కృషి చేస్తోంది. దీనికి కొన్ని కార్పొరేట్ సంస్థలు కూడా సహకారం అందిస్తున్నాయి. దాతల నుంచి తయారీదారుల వరకూ ప్రతి ఒక్కరికీ మా ప్రయత్నం ప్రేరణ కలిగిస్తోంది."

ఔషధ 'అగ్నిమంత'!

ప్రకృతి ఎంతో అద్భుతమైనది. మనకు ఉండే ఎన్నో అనారోగ్య సమస్యలకు పరిష్కారం ఈ ప్రకృతిలోనే లభిస్తుంది. అలా పలు అనారోగ్యలకు ప్రకృతి అందించే ఓ సహజ పరిష్కారం 'అగ్నిమంత' మొక్క అనేక రోగాలకు ఔషధమయిన ఈ మొక్క గురించి వివరాలు తెలుసుకుందాం..



దీనిని హెడేక్ ట్రీ అని కూడా అంటారు. ఇది భారత దేశంలో పాటు ఆసియా, ఉత్తర ఆస్ట్రేలియాలలో పలు ప్రాంత్రాల్లో కనిపిస్తుంది. ఈ మొక్క ఎక్కువగా తీరప్రాంత అడవుల్లో, నదీతీరాల్లో పెరుగుతుంది. కరువును కూడా తట్టుకోగలగడం దీని ప్రత్యేకత. ఈ మొక్క సాధారణంగా 10 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. ఇది గుబురుగా పొదలా వ్యాపిస్తుంది. ఈ మొక్క ఆకులు అండాకారంలో ఉంటాయి. ఆ ఆకులను నలిపినప్పుడు సువాసన వెదజల్లుతాయి. ఈ మొక్కకు చిన్నని పూలు పుస్తాయి. ఇవి కూడా సువాసన వెదజల్లుతాయి. ఈ పూలు పసుపు వర్ణంలో ఉంటాయి. ఈ పువ్వుల నుంచి చిన్నని నల్లటి కాయలు కాస్తాయి. ఆ కాయల్లో ఒకేఒక్క విత్తనం ఉంటుంది. ఈ మొక్కను ఆయుర్వేద వైద్యంలో వినియోగిస్తారు. వాపులు, నొప్పులు, జ్వరం, శ్వాసకోశ సమస్యలను తగ్గించేందుకు వాడతారు. ఈ మొక్క వేరు, కాండం ఆర్థరైటిస్, ఆస్థమా, జీర్ణసమస్యల మందుల సూత్రీకరణలలో వాడతారు. దీని ఆకులను గాయాలు, చర్మ ఇన్‌ఫెక్షన్లను తగ్గించేందుకు వాడతారు. ఆకులను రుబ్బి గాయాల మీద మందుగా రాస్తారు.

● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

పోషకాల 'పుట్ట'గొడుగు!



వర్షాకాలంలో ఎక్కువగా దొరికే పుట్టగొడుగులంటే చాలామందికి ఇష్టం. ఈ పుట్టగొడుల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం..

- పుట్టగొడుగుల్లో పొటాషియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.
- పొటాషియం రక్తపోటును నియంత్రించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
- ఫైబర్ జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధశక్తిని పెంపొందిస్తాయి.
- వీటిలో ఉండే కాల్షియం, విటమిన్ డి ఎముకల దృఢంగా ఉండేలా సహాయపడుతుంది.
- పుట్టగొడుగుల్లో ఐరన్ ఉంటుంది. దాంతో రక్తహీనత దరిచేరదు.
- పుట్టగొడుగుల్లో నీటి శాతం ఎక్కువ. క్యాలరీలు తక్కువ కూడా కాబట్టి బరువును తగ్గించడంతో సహాయపడుతుంది.
- పుట్టగొడుగులు రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయి. మతిమరుపు రాకుండా నియంత్రిస్తాయి.
- పుట్టగొడుగుల్లోని కొన్ని యాంటీ ఆక్సిడెంట్లు మతిమరుపు రాకుండా అడ్డుకుంటాయి. .

నల్లటి వలయాలు ఇలా మాయం

కళ్ల కింద నల్లటి వలయాలు.. ప్రస్తుతం చాలామందిని ఇబ్బంది పెడుతున్న సమస్య ఇది. ఒత్తిడి, హార్మోన్ల ప్రభావం, నిద్రలేమి, కంప్యూటర్లు, ఫోన్ల వాడడం, మారిన జీవన విధానం.. మొదలైనవి ఈ సమస్యకు కారణాలు. అయితే ఇంట్లో ఉండే పదార్థాలతో సహజంగానే వాటిని తగ్గించుకోవచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం..



- పచ్చి పాలలో దూదిని ముంచి దానిని కళ్ల కింద నల్లటి వలయాల మీద పెట్టాలి. 20 నిమిషాల తరువాత కడిగేసుకోవాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- బంగాళాదుంప రసాన్ని తీసి అందులో దూదిని ముంచి నల్లటి వలయాల మీద పెట్టి పదినిమిషాల తర్వాత చల్లటి నీటితో కడగాలి. బంగాళాముక్కను కళ్ల కింద 10 నిమిషాలు రుద్ది నీటితో కడగవచ్చు కూడా.
- ఒక చెంచా టమాటా రసంలో కొంచెం నిమ్మరసం కలిపి కళ్ల కింద రాయాలి. రోజుకు రెండు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- రోజూ రాత్రి బాదం నూనెను కళ్ల కింద రాసి మర్దనా చేయాలి. ఉదయాన్నే చల్లటి నీటితో కడిగేసుకోవాలి.
- రాత్రి పూట కలబంద గుజ్జునుకళ్ల కింద రాసి మర్దనా చేసి ఉదయాన్నే కడిగేయాలి.
- నారింజ రసంలో కొంచెం గ్లిజరిన్ కలిపి కళ్ల కింద రాయాలి. ఇలా చేస్తే నల్లటి వలయాలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుంది.
- గులాబీ నీళ్లలో దూదిని ముంచి దానిని నల్లటి వలయాల మీద ఉంచాలి. పావుగంట తర్వాత చల్లటి నీటితో కడగాలి.
- కీరదోసను గుండ్రటి ముక్కలు చేసి వాటిని కళ్లపై ఉంచాలి.
- పుదీనా ఆకులను పేస్టు చేసి కళ్ల కింద రాసి ఓ పది నిమిషాలు ఆగి కడిగాలి. రోజు రాత్రి ఇలా చేస్తే నల్లటి వలయాలు తగ్గుతాయి.
- మజ్జిగలో పసుపు కలిపి పేస్టులా చేసి దానిని కళ్ల కింద రాయాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి.
- గ్రీన్ టీ సంచులను నీటిలో ముంచి తీసి కొంచెం సేపు ఫ్రిడ్జ్‌లో ఉంచాలి. ఆ తర్వాత 10 నిమిషాల పాటు కళ్ల మీద పెట్టాలి.

పరగడుపున ఇవి తింటే..?

చాలా మందికి ఉదయాన్నే టీ లేదా కాఫీ తాగడం అలవాటు. కానీ వాటి బదులు ఉసిరి, తేనె వంటివి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం..



- ఉసిరిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. విటమిన్ సి కూడా అధికంగా ఉంటుంది. కాబట్టి రోజూ ఉసిరి కాయను పరగడుపున తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- తేనెలో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. అవి శరీరంలోని హానికర బ్యాక్టీరియాతో పోరాడతాయి. కాబట్టి ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో తేనె, నిమ్మరసం కలుపుకుని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే బరువు కూడా తగ్గుతారు.
- తులసి ఆకుల వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే ఆ ఆకులు తిని, ఆ నీరు తాగితే దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లు దరిచేరవు.

బిట్స్ లా స్కూల్ అడ్మిషన్స్

ముంబాయిలోని బిట్స్ లా స్కూల్‌లో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్)లో అడ్మిషన్స్ కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఈ కోర్సులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం ఉందని సంస్థ వెబ్‌సైట్ పేర్కొంది. టెక్నాలజీ అండ్ మీడియా లా, కార్పొరేట్ అండ్ ఫైనాన్షియల్ లా, ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ లా, ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిజల్యూషన్, అండ్ మీడియేషన్ అనే స్పెషలైజేషన్లు ఇందులో ఉన్నాయి.

బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) 120 సీట్లు,
బీబీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) 60 సీట్లు
మొత్తం 180



అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. అలాగే క్లాట్/ఏఐఎల్ఈటీ/స్లాట్/ఎల్‌నాట్/బిట్స్ లాట్‌లో స్కోరు సాధించి ఉండాలి. ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఎచీవ్‌మెంట్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.
ఎంట్రెన్స్: పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు 60 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. నెగెటివ్ మార్కింగ్ లేదు. రీజనింగ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి.
ఫీజు: కాలేజీ ఫీజు రూ.7,37,100/-, హాస్టల్ ఫీజు 3,27,600/-.(కాలేజీలో స్కాలర్‌షిప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.
చివరి తేదీ: 2026 జనవరి 6
క్లాసులు ప్రారంభం: 2026 జూలై
వెబ్‌సైట్: www.bitslawschool.edu.in

గ్రామీణ బ్యాంకుల్లో పోస్టులకు
ఐబీపీఎస్ నోటిఫికేషన్

దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో క్లర్క్, ఆఫీసర్ల నియామకాల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 13,217 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఇందులో తెలంగాణలో 798 పోస్టులు(450 ఆఫీస్ అసిస్టెంట్లు, 348 ఆఫీసర్లు), ఏపీలో 152(150 ఆఫీస్ అసిస్టెంట్, 2 ఆఫీసర్) పోస్టులు ఉన్నాయి.

పేరు	పోస్టులు
ఆఫీస్ అసిస్టెంట్స్	7972
ఆఫీసర్ స్కేల్-1(అసిస్టెంట్ మేనేజర్)	3907
స్కేల్ 2, స్కేల్ 3	1338

(ఈ స్కేల్ 2, స్కేల్ 3లో అగ్రికల్చర్ ఆఫీసర్, లా ఆఫీసర్, సీఏ, ఐటీ, జనర్ బ్యాంకింగ్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్, ట్రెజరీ మేనేజర్ తదితరాలు ఉన్నాయి).



వయస్సు: ఆఫీస్ అసిస్టెంట్‌కు 18-25 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-1కు 18-30 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-2కు 21-32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-1కు 21-40 ఏళ్లు ఉండాలి. సరైన కటాఫ్ డేట్స్ కోసం నోటిఫికేషన్ చూడవచ్చు.
ఎంపిక విధానం: ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ(కొన్ని పోస్టులకు ఇంటర్వ్యూ లేదు) ద్వారా ఎంపిక జరుగుతుంది. మల్టీ పర్పస్ అసిస్టెంట్ ప్రిలిమినరీ పరీక్షలో రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీపై 80 మార్కులకు, 80 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 45 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఆఫీసర్ ప్రిలిమినరీ పరీక్షలో రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 80 మార్కులకు, 80 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 45 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. మెయిన్స్‌లో రీజనింగ్, కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి.
పరీక్ష: 2025 నవంబర్/డిసెంబర్‌లో ప్రిలిమ్స్, 2025 డిసెంబర్ /2006 జనవరిలో మెయిన్స్ ఉంటుంది.
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 29 **వెబ్‌సైట్:** https://ibps.in/

SCHOLARSHIP ALERT

Schaeffler India Social Innovator Fellowship Program 2025

Description: Schaeffler India invites applications from individuals aged 18 to 35 who are building innovative, sustainable solutions with the potential to create meaningful social impact across India.
Eligibility: Applicants must be Indian residents aged 18 to 35 years as of 1st July 2025. The fellowship is open to early-stage start-ups or NGOs with a working prototype ready for implementation.
Prizes & Rewards: Exclusive mentorship at IIMA Ventures, IIM Ahmedabad, paired with an inspiring fellowship grant and access to extensive networking opportunities.
Last Date to Apply: 15-09-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SIA4

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative of Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) disciplines.
Eligibility: The applicants must be female students from India.
- They should have successfully completed their Class 12 examinations.
- Eligible students include those enrolled in the first year of undergraduate STEM courses at recognised NIRF-accredited institutions. Additionally, second-year B.Arch students and those pursuing five-year Integrated or Dual Degree programs are also welcome to apply.
- Female students intending to pursue engineering and medical courses in government colleges not listed in the NIRF rankings are also eligible to apply.
- The annual family income of the applicants must not exceed 8,00,000.

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1,00,000 per annum, covering actual expenses, for the duration of the course.
Last Date to Apply: 15-09-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS3

buddy4study.com

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

మొత్తం ఖాళీలు 260

ఇండియన్ నేషనల్ అకాడమీ(ఐఎన్ఏ) నుంచి షార్ట్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ వెలువడింది. 2026 జూన్‌లో ప్రారంభమయ్యే ఈ కోర్సుకు అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
కోర్సు వివరాలు: షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్, 2025

బ్రాంచి వివరాలు:
- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(జీఎస్(ఎక్స్)/హైడ్రో కేడర్): 57
- పైలెట్: 24
- నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: 20
- ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: 20
- లాజిస్టిక్స్: 10
- నేవల్ ఆర్నమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: 20 పోస్టులు
- లా: 2
- ఎడ్యుకేషన్: 15
- ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) 36
- ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) 40
- నేవల్ కన్‌స్ట్రక్టర్: 16




అర్హత: పోస్టును బట్టి సంబంధిత బ్రాంచీలో బీఎస్సీ, బీకాం, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, లా, పీజీ, పీజీ డిప్లొమా ఉండాలి. అభ్యర్థులకు నోటిఫికేషన్‌లో పేర్కొన్న శారీరక, వైద్య ప్రమాణాలు ఉండాలి.
వయస్సు: 2001 జూలై 2 నుంచి 2007 జనవరి 1 లోపు జన్మించి ఉండాలి.
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 8.
వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

బీహెచ్ఈఎల్‌లో గ్రేడ్-4 ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు 515

భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బీహెచ్ఈఎల్)లోని హైదరాబాద్, విశాఖపట్నం సహా దేశ వ్యాప్తంగా ఉన్న 11 యూనిట్లలోని 515 ఆర్టిసన్ గ్రేడ్-4 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. (ఫిట్టర్ 176, వెల్డర్ 97, టర్నర్ 51, మెషినిస్ట్ 104, ఎలక్ట్రీషియన్ 65, ఎలక్ట్రానిక్ మెకానిక్ 18, ఫౌండీమన్ 4)
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 12
అర్హత: పదో తరగతితోపాటు ఐటీఐ/ సమాన అర్హత ఉండాలి.
వయస్సు: 2025 జూన్ 1 నాటికి జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 27 సంవత్సరాలు, ఓబీసీ వారికి 30, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 32 మించి ఉండకూడదు. సంబంధిత ట్రేడ్ అనుభవం ఉంటే వయోపరిమితిలో ఏడు సంవత్సరాల సడలింపు ఉంటుంది.
వెబ్‌సైట్: https://careers.bhel.in

ఎల్ఐసీలో అప్రెంటిస్‌షిప్



ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌లో తెలంగాణ, ఏపీ సహా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 22
వెబ్‌సైట్: www.lichousing.com/careers


పబ్లిక్ ప్రాసిక్యూటర్స్

తెలంగాణ స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా టీజీ ప్రాసిక్యూషన్ సర్వీస్(కేటగిరి) విభాగంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(ఏపీపీ)గా పనిచేసేందుకు నోటిఫికేషన్ వెలువడింది. మొత్తం 118 ఏపీపీ పోస్టులు ఉన్నాయి. అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నారు.
పోస్టులు: అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(ఏపీపీ) - 118 ఖాళీలు
మల్టీ జోన్-1: 50 పోస్టులు(డైరెక్ట్ 38, బ్యాక్‌లాగ్ 12)
మల్టీ జోన్-2: 68 పోస్టులు(డైరెక్ట్ 57, బ్యాక్‌లాగ్ 11)
వయస్సు: 2025 జూలై 1 నాటికి 34 సంవత్సరాల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్స్‌కు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు 10 ఏళ్ల సడలింపు ఉంటుంది.
అర్హత: బ్యాచిలర్ డిగ్రీతోపాటు లా డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. కనీసం మూడు సంవత్సరాలు క్రిమినల్ కోర్టు ప్రాక్టీసు చేసి ఉండాలి. అలాగే 2025 ఆగస్టు 15 తేదీ నాటికి ప్రాక్టీసింగ్ అడ్వకేట్‌గా నమోదు అయి ఉండాలి.
ఎంపిక విధానం: రాత పరీక్ష ద్వారా నియామకం జరుపుతారు.
పేపర్-1: 200 మార్కులకు ఆబ్జెక్టివ్ పేపర్ ఉంటుంది. ఇందులో నెగటివ్ మార్కింగ్ ఉంది. పేపర్-2 రెండు వందల మార్కులకు డిస్క్రిప్టివ్ పేపర్ ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
దరఖాస్తులు ప్రారంభం: 2025 సెప్టెంబర్ 12
దరఖాస్తుకు చివరి తేదీ: 2025 అక్టోబర్ 5
వెబ్‌సైట్: www.tgprb.in/

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఉత్కంఠకు లోనయ్యా

- ఇమ్రాన్ హష్మీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఈనెల 25న ప్రపంచ వ్యాప్తంగా తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది. కాగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఈ చిత్రం ద్వారా తొలిసారిగా తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. ఇందులో ఆయన ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇమ్రాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సినిమా కోసం నన్ను సంప్రదించినప్పుడు ఉత్కంఠకు లోనయ్యా. ఇది నాకు తెలుగులో తొలి సినిమా. సూపర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలసి తెరను పంచుకోవడం కంటే గొప్ప విషయం ఇంకేముంటుంది. పవన్ కల్యాణ్, చిత్ర దర్శకుడు సుజీత్‌తో కలసి పనిచేయడం అద్భుతమైన అనుభవం' అని చెప్పారు.

నయన్‌తో డ్యూయెట్





చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. నేటి నుంచి హైదరాబాద్‌లో చిరంజీవి, నయనతారపై ఓ పాటను చిత్రీకరించనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, డ్యాన్స్ మాస్టర్ విజయ్ పోలంకి నృత్య రీతులు సమకూర్చుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఊహకందని మలుపులతో...



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ప్రేక్షకులు చాలా హారర్ సినిమాలు చూసి ఉంటారు. కానీ 'కిష్కింధపురి' చాలా ప్రత్యేకం. థ్రిల్లింగ్ అంశాలతో ఊహకందని మలుపులతో సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్స్ అద్భుతంగా వచ్చాయి' అని అన్నారు. అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి హారర్ చిత్రాలంటే చాలా ఇష్టం. 'కిష్కింధపురి' ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. హారర్ ఎలిమెంట్స్ అబ్బురపరుస్తాయి' అని చెప్పారు.

బిగ్‌బాస్ 9 ప్రారంభం



బుల్లితెర ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న టెలివిజన్ రియాలిటీ షో 'బిగ్‌బాస్ సీజన్ 9' ఆదివారం ప్రారంభమైంది. ఈ సీజన్ ఊహకందని మార్పులు, ఊహించని మలుపులతో ఉండబోతోందని వ్యాఖ్యాత నాగార్జున అన్నారు. ఈసారి సెలబ్రిటీలతో పాటు సామాన్యులకూ సమాన అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపిక చేసిన కంటెస్టెంట్లను ప్రేక్షకులకు పరిచయం చేశారు.

ఈ సీజన్ కంటెస్టెంట్లు

1. కన్నడ నటి తనూజ పుట్టస్వామి	సెలబ్రిటీ
2. హీరోయిన్ ఫ్లోరా సైనీ(ఆశా సైనీ)	సెలబ్రిటీ
3. కల్యాణ్ పడాల	సామాన్యుడు
4. 'జబర్దస్త్' ఇమ్మాన్యుయేల్	సెలబ్రిటీ
5. కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ	సెలబ్రిటీ
6. హరిత హరీశ్(మాస్క్ మెన్)	సామాన్యుడు
7. నటుడు భరణి	సెలబ్రిటీ
8. నటి, యాంకర్ రీతూ చౌదరి	సెలబ్రిటీ
9. డిమాన్ పవన్	సామాన్యుడు
10. నటి సంజన గల్రానీ	సెలబ్రిటీ
11. గాయకుడు రాము రాథోడ్	సెలబ్రిటీ
12. శ్రీజ దమ్ము	సామాన్యురాలు
13. హాస్య నటుడు సుమన్ శెట్టి	సెలబ్రిటీ
14. ప్రియ శెట్టి	ఆడియెన్స్ పోల్
15. మర్యాద మనీశ్	ప్రత్యేక ఎంపిక

గాయకుడిగా ప్రకాశ్ రాజ్

ఇప్పటి వరకు వెండి తెరపై తన విలక్షణ నటనతో మెప్పించిన ప్రకాశ్ రాజ్ ఇప్పుడు గాయకుడిగా కూడా అలరించబోతున్నారు. ఇందుకోసం ఆయన తన బృందంతో కలసి శ్రీలంక చేరుకున్నారు. ఇక్కడి క్యాండీ నగరంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తోన్న 'నియేలిని గ్లోబల్ సమ్మిట్'లో ప్రకాశ్ రాజ్ పాల్గొంటున్నారు.



ఈ సదస్సుకు 102 దేశాలకు చెందిన పౌర సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, శాస్త్రవేత్తలు సుమారు 500 మంది హాజరవుతున్నారు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఆహారభద్రత, వ్యవసాయ రంగంలో సంక్షోభంపై ప్రముఖంగా చర్చించనున్నారు. ఈ సదస్సుకు సంఘీభావంగా 'సాంగ్స్ ఆఫ్ రెసిలియన్స్' పేరుతో నిర్వహించనున్న కచేరీలో ప్రకాశ్ రాజ్ తన బృందంతో కలసి స్వయంగా కవితాగానం చేయనున్నారు.

అద్భుతమైన ప్రయాణమిది


రాశీ ఖన్నా

'కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా మరచిపోలేని కథలు ఉంటాయి. 'తెలుసు కదా' అలాంటి కథల్లో ఒకటి. అద్భుతమైన అనుభవాలన్నీ కలగలసిన ప్రయాణమిది' అని అన్నారు కథానాయిక రాశీ ఖన్నా. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నీరజా కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సినిమా దీపావళి కానుకగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా తన షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న రాశీ ఖన్నా ఈ చిత్రానికి సంబంధించిన అనుభవాలు పంచుకుంటూ 'ఈ ప్రయాణంలో నాతో నడిచిన చిత్రబృందానికి కృతజ్ఞతలు. మేము సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగుపెట్టే రోజు కోసం ఎదురుచూస్తున్నాను. మీకు అద్భుతమైన అనుభూతిని ఇస్తుందీ చిత్రం' అని అన్నారు.

మిరాయ్ ప్రేక్షకులను మెప్పిస్తుంది


ధ్రువ సర్జా

తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన సూపర్‌హీరో చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. మంచు మనోజ్ ప్రతినాయక పాత్రను పోషించారు. ఈ నెల 12న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బెంగళూరులో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన కన్నడ హీరో ధ్రువ సర్జా మాట్లాడుతూ 'ఒక పండగ లాంటి వాతావరణంలో 'మిరాయ్' సినిమా విడుదలవుతోంది. అద్భుతమైన నటీనటులు, టెక్నీషియన్లు ఈ సినిమా కోసం పనిచేశారు. విశ్వప్రసాద్ భారీస్థాయిలో నిర్మించారు. ప్రచార చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. తేజ సజ్జా మాట్లాడుతూ 'పిల్లలు, పెద్దలు అందరూ కలసి చూసేలా 'మిరాయ్' చిత్రం ఉంటుంది. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'ధ్రువ సర్జాతో ఓ చిత్రం చేయబోతున్నాం. 'మిరాయ్' చిత్రాన్ని మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కించాం' అని తెలిపారు.

డబుల్ ధమాకా



ఒక దెబ్బకు రెండు పిట్టలు! అవును..ఆసియా కప్ ఫైనల్లో విజయ కేతనం ఎగురవేసి ట్రోఫీని అందుకున్న భారత హాకీ జట్టు.. ఈ గెలుపుతో ప్రతిష్టాత్మక వరల్డ్ కప్ బెర్త్‌నూ దక్కించుకుంది. ప్రపంచ కప్ వచ్చే ఏడాది నెదర్లాండ్స్, బెల్జియం వేదికలుగా జరగనుంది. ఆదివారం జరిగిన ఆసియా కప్ తుదిపోరులో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియాను భారత్ చిత్తు చేసింది. తద్వారా అపజయమే ఎరుగకుండా టోర్నమెంట్‌ను ముగించిన ఘనతనూ సొంతం చేసుకుంది.

ఆసియానుగెలిచి.. ప్రపంచ బెర్త్ పట్టేసి..

భారత్‌దే ఆసియా కప్ హాకీ

ఫైనల్లో కొరియా చిత్తు

4 ఆసియా కప్ ట్రోఫీ నెగ్గడం భారత్‌కు ఇది నాలుగోసారి. గతంలో 2003, 2007, 2017లో విజేతగా నిలిచింది.

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ ఆరంభం నుంచి తుది వరకు తిరుగులేని ఆటను ప్రదర్శించిన భారత హాకీ జట్టు చాంపియన్‌గా నిలిచింది. దాంతో ఎనిమిదేళ్ల విరామం తర్వాత ట్రోఫీని ముద్దాడింది. ఫైనల్లో 4-1తో దక్షిణ కొరియాపై ఘన విజయం సాధించిన మనోళ్లు నాలుగోసారి ఆసియా కప్‌ను సొంతం చేసుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దిల్‌ప్రీత్ సింగ్ (28వ, 45వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో చెలరేగగా, సుఖ్‌జీత్ సింగ్ (ఒకటో నిమిషం), అమిత్ రోహిదాస్ (50వ) చెరో గోల్ కొట్టారు. డెయిన్ సన్ (51వ) కొరియా తరఫున ఏకైక గోల్ సాధించాడు. ఈ విజయంతో టీమిండియా.. వచ్చే ఏడాది ఆగస్టు 14 నుంచి నెదర్లాండ్స్, బెల్జియం దేశాల్లో జరిగే ఎఫ్ఐహెచ్ ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించింది.

ఆరంభం నుంచే ఆధిపత్యం: కిక్కిరిసిన స్టేడియంలో అభిమానులు 'భారత్..భారత్' అని ప్రోత్సహిస్తుండగా..టైటిల్ ఫైట్‌లో ఆరంభంనుంచే భారత్ ఆధిపత్యం చెలాయించింది. డిఫెండర్లు, మిడ్‌ఫీల్డర్లు, ఫార్వర్డ్‌లు చక్కటి సమన్వయంతో కొరియాను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఆట మొదలైన 30వ సెకనులోనే హర్మన్‌ప్రీత్ నుంచి వచ్చిన పాస్‌ను సుఖ్‌జీత్ రివర్స్ హిట్‌తో గోల్‌పోస్ట్‌లోకి పంపి జట్టును ఆధిక్యంలో నిలిపాడు. ఆపై మనోళ్లకు పెనాల్టీ స్ట్రోక్ లభించినా.. జుగ్‌రాజ్ షాట్‌ను కొరియా గోల్‌కీపర్ కిమ్ అడ్డుకున్నాడు. ఇక..28వ నిమిషంలో సంజయ్ అందించిన పాస్‌ను ప్రత్యర్థి కీపర్ కాళ్ల కిందనుంచి దిల్‌ప్రీత్ కొట్టిన గోల్ అద్భుతమని చెప్పాలి. ప్రథమార్థాన్ని మనోళ్లు రెండు గోల్స్‌తో ముగించారు. మూడో క్వార్టర్‌లో కొరియాకు వెనువెంటనే రెండు పెనాల్టీ కార్నర్లు దక్కినా..భారత డిఫెండర్లు వాటిని వమ్ము చేశారు. ఇదే క్వార్టర్‌లో దిల్‌ప్రీత్ చేసిన గోల్‌తో భారత్ ఆధిక్యం 3-0కి పెరిగింది. చివరి క్వార్టర్ ఆరంభంలో కొరియా గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ రోహిదాస్ మరో గోల్ అందించాడు. మ్యాచ్ చివరి నిమిషాల్లో లభించిన పెనాల్టీ కార్నర్ ద్వారా కొరియా ఓదార్పు గోల్ సాధించింది. కాగా..చైనాను 3-0తో ఓడించిన మలేసియా మూడో స్థానంలో నిలిచింది. బంగ్లాదేశ్‌పై 6-1తో నెగ్గిన జపాన్‌పై ఐదో స్థానం దక్కించుకుంది.


దిల్‌ప్రీత్ సింగ్

కాంపౌండ్ పురుషుల

భారత జట్టుకు చారిత్రక స్వర్ణం

జ్యోతి జోడీకి రజతమే

ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్





గ్వాంగ్జు (దక్షిణ కొరియా): భారత ఆర్చర్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అదరగొట్టారు. ఓ స్వర్ణం, రజతంతో రెండు పతకాలు కొల్లగొట్టారు. పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు మొట్టమొదటి పసిడి పతకం సాధించడం ఈమారు పోటీల్లో విశేషం. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఫైనల్ చేరిన తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ/రిషభ్ యాదవ్ ద్వయం.. చివరకు రజత పతకంతో సరిపెట్టుకుంది. మరోవైపు స్వర్ణం, రజతం గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న రిషభ్ రెండు పతకాలతో 'డబుల్' సాధించాడు. పురుషుల కాంపౌండ్ టీమ్ ఫైనల్లో రిషభ్ యాదవ్, అమన్ సైనీ, ప్రథమేశ్‌లతో కూడిన భారత త్రయం 235-233 స్కోరు తేడాతో నికోలస్, జీన్ ఫిలిప్, ఫ్రాంక్వోయిస్‌లతో కూడిన ఫ్రాన్స్ జట్టును చిత్తుచేసి తొలిసారి ప్రపంచ విజేతగా అవతరించింది. అంతకుముందు జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రెండు పాయింట్ల తేడాతో స్వర్ణం చేజార్చుకుంది. టైటిల్ ఫైట్‌లో జ్యోతి/రిషభ్ జంట 155-157తో నెదర్లాండ్స్ ద్వయం మైక్ స్కోల్సర్/సానె డీ లాట్ చేతిలో పరాజయం పాలై రజత పతకానికి పరిమితమైంది. హరియాణాకు చెందిన 22 ఏళ్ల రిషభ్‌కు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడం ఇదే మొదటిసారి. ఇక.. విజయవాడకు చెందిన 29 ఏళ్ల జ్యోతి సురేఖకు ఇది తొమ్మిదో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం. ఆమె ఖాతాలో ఓ స్వర్ణం, ఐదు రజతాలు, మూడు కాంస్యాలున్నాయి. ఇక.. 2017 నుంచి పోడియం ఫినిష్ చేస్తూ వచ్చిన భారత కాంపౌండ్ మహిళల జట్టు ఈమారు అనూహ్యంగా ప్రీక్వార్టర్స్‌లోనే నిష్క్రమించి నిరాశపరిచిన సంగతి తెలిసిందే.

ఈ ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్స్‌లో రన్నరప్‌కే పరిమితమైనా, పట్టు వదలని అరియానా సబలెంక.. మూడో ప్రయత్నంలో ఫలితాన్ని రాబట్టింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో యూఎస్ ఓపెన్ టైటిల్ నిలబెట్టుకొని రికార్డు సృష్టించింది. తుదిపోరులో అమెరికా స్టార్, ఎనిమిదో సీడ్ అమండా అనిసిమోవాను చిత్తు చేసిన సబలెంక.. కెరీర్‌లో రెండో యూఎస్ ఓపెన్, ఓవరాల్‌గా నాలుగో గ్రాండ్‌స్లామ్‌ను ఖాతాలో వేసుకొంది.




ట్రోఫీతో సబలెంక


సబలెంక కేక

వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ కైవసం

ఫైనల్లో అమందాకు మరోసారి నిరాశ

ప్రైజ్‌మనీ
సబలెంకకు - రూ. 44 కోట్లు
అమందాకు - రూ. 22 కోట్లు

న్యూయార్క్: డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకొంది. ఈ క్రమంలో సెరెనా విలియమ్స్ (2012-14) తర్వాత ఇక్కడ వరుసగా రెండోసారి విజేతగా నిలిచిన తొలి క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సబలెంక (బెలారస్) 6-3, 7-6(3)తో స్థానిక స్టార్ అమండా అనిసిమోవాపై వరుస సెట్లలో నెగ్గింది. గంటా 34 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో అనిసిమోవా 22 విన్నర్లు కొడితే.. సబలెంక 13 మాత్రమే సంధించింది. అమండా 4 ఏస్‌లతో బెంబేలెత్తించగా, సబలెంక ఒక్క ఏస్‌కే పరిమితమైంది. అయితే, 22 అనవసర తప్పిదాలు చేసి అమండా మూల్యం చెల్లించుకొంది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్‌లో ఓడిన సబలెంక.. యూఎస్ ఓపెన్ టైటిల్‌తో సీజన్‌ను గ్రాండ్‌గా ముగించింది. 27 ఏళ్ల సబలెంకకు ఇది నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2023, 24లో ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచింది. కాగా, గ్రాండ్‌స్లామ్ తుదిపోరులో ఓడడం అమండాకు ఇది వరుసగా రెండోసారి. యూఎస్ ఓపెన్‌కు ముందు వింబుల్డన్ ఫైనల్లో స్వియటెక్ చేతిలో అమండా పరాజయం పాలైంది.


అమందా

తడబడినా.. పుంజుకొని: ఫైనల్ పోరు ఒత్తిడో.. ఏమో? మ్యాచ్ ఆరంభంలో ఇద్దరూ తప్పిదాల మీద తప్పిదాలు చేశారు. ఎక్కువగా అవుట్‌లు కొట్టడంతోపాటు ఒకరి సర్వీస్‌ను ఒకరు బ్రేక్ చేసే అవకాశం ఇచ్చుకున్నారు. ఈ క్రమంలో సబలెంక పలుసార్లు అసహనానికి గురైనా క్రమంగా గాడిలో పడింది. తొలి సెట్ మొదటి గేమ్‌లోనే అరియానా డబుల్ ఫాల్ట్ చేసింది. కానీ, అనిసిమోవా దాన్ని అందిపుచ్చుకోలేక పోయింది. రెండో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంక 2-0తో ముందంజ వేసింది. కానీ, పుంజుకొన్న అనిసిమోవా వరుసగా రెండు గేమ్‌లు గెలిచి 2-2తో సమం చేసింది. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకొంటూ సాగినా.. ఎనిమిదో గేమ్‌లో అమండా సర్వీస్‌ను మరోసారి బ్రేక్ చేసిన సబలెంక సెట్‌ను తన ఖాతాలో వేసుకొంది. ఇక, రెండో సెట్‌లో ఒక దశలో సబలెంక 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ, పట్టువీడని అనిసిమోవా 3-3తో సమం చేసింది. ఏడో గేమ్‌లో మరోసారి బ్రేక్ పాయింట్ సాధించిన అరియానా 5-3తో మ్యాచ్‌ను సులువుగా సొంతం చేసుకొనేలా కనిపించింది. అయితే, పోరాడిన అనిసిమోవా ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ 5-5తో సమం చేసింది. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో 6-6తో సెట్ ఫలితం టైబ్రేక్‌కు మళ్లింది. ఇందులో సబలెంక అనుభవం ముందు అనిసిమోవా తలవంచక తప్పలేదు. 6-3తో మ్యాచ్‌పాయింట్‌పై నిలిచిన అరియానా.. అమండా బ్యాక్ హ్యాండ్ తప్పిదంతో సంబరాలు చేసుకొంది. పురుషుల డబుల్స్ టైటిల్‌ను మార్సెలో గ్రానోల్లర్స్ (స్పెయిన్)/హొరాకియో జెబల్లోస్ (అర్జెంటీనా) జోడీ గెలుచుకుంది. ఫైనల్లో ఐదో సీడ్ మార్సెలో ద్వయం 3-6, 7-6 (4), 7-5తో బ్రిటన్‌కు చెందిన ఆరో సీడ్ జంట నీల్ స్కుప్‌స్కీ/జో సాలిస్‌బరీపై గెలిచింది.

బీసీసీఐ సంపద రూ. 20 వేల కోట్లు

ఐదేళ్లలో మూడు రెట్లపైనే పెరిగిన ఆదాయం

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే ధనిక క్రికెట్ బోర్డు అయిన బీసీసీఐ.. ఆర్థికంగా మరింత పటిష్టమైంది. కేవలం ఐదేళ్లలోనే రూ. 14,627 కోట్ల మేర తన సంపదను పెంచుకొంది. మొత్తంగా బోర్డు బ్యాంక్ బ్యాలెన్స్ రూ. 20,686 కోట్లకు చేరుకొంది. ఈ నెల 28న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరగనుంది. ఈ నేపథ్యంలో గడచిన ఆర్థిక సంవత్సరం 2023-24కు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్ వివరాలు బయటకు వచ్చాయి. 2019లో బ్యాంక్‌లో ఉన్న నిధులు రూ. 6,059 కోట్లు కాగా.. గత ఐదేళ్లలో ఆ మొత్తం రూ. 20 వేల కోట్లు దాటింది. రాష్ట్ర సంఘాలకు, ఇతరత్రా చెల్లింపులు పోను నికర ఆదాయంగా తేలింది. 2022-23లో బ్యాంక్ బ్యాలెన్స్ రూ. 16,493 కోట్లు ఉండగా.. ఆ తర్వాతి ఏడాదికి అది రూ. 4,193 కోట్లు అంటే సుమారు 25 శాతం పెరిగి రూ. 20,686 కోట్లకు చేరుకొంది. బయట ఎక్కువ మ్యాచ్‌లు జరగడంతో మీడియా హక్కుల ఆదాయం 67.8 శాతంమేర తగ్గినా.. వివిధ పెట్టుబడుల ద్వారా అదనంగా రూ. 453.4 కోట్ల రెవెన్యూ లభించింది. మొత్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి బోర్డు రూ. 1623 కోట్ల మిగులును నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఇది రూ. 1168 కోట్లుగా ఉంది. ఇన్‌కంట్యాక్స్ కోసం రూ. 3 వేల కోట్లను పక్కనబెట్టింది.

సంజూకు చోటు లేనట్టేనా!

'బ్యాటింగ్ ఆర్డర్'లో టీమిండియా ప్రాక్టీస్



దుబాయ్: ఆసియా కప్ టోర్నీకి టీమిండియా సన్నాహకాలు ఊపందుకున్నాయి. మంగళవారం నుంచి ఈ టీ20 టోర్నమెంట్ ప్రారంభం కానుంది. బుధవారంనాడు గ్రూప్ 'ఏ'లో తొలి మ్యాచ్‌ను యూఏఈతో ఆడడం ద్వారా భారత జట్టు టోర్నీని మొదలుపెడుతుంది. ఇక..టోర్నమెంట్ బ్లాక్‌బస్టర్ పోరులో పాకిస్థాన్‌తో ఈనెల 14న భారత్ తలపడనుంది. అయితే టీమిండియా తుది కూర్పునకు సంబంధించి ఇప్పటికే చర్చలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా సంజూ శాంసన్‌కు జట్టులో చోటు ఉంటుందా..ఉండదా..అనే విషయమై ఉత్కంఠ ఏర్పడింది. భారత జట్టు ఇప్పటికే రెండు సెషన్ల ప్రాక్టీస్ పూర్తి చేసింది. ఈ రెండు సెషన్లు జరిగిన తీరునుబట్టి చూస్తే సంజూకి తుది 11 మందిలో స్థానం కష్టమేనని తెలుస్తోంది. సాధనలో భాగంగా సూర్యకుమార్ సేన మొదట ఫీల్డింగ్ డ్రిల్స్‌లో పాల్గొంది. అనంతరం బ్యాటర్లు నెట్స్‌లో చెమటోడ్చారు. ఇక..నెట్స్‌లో జితేశ్ శర్మకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం కనిపించింది. ప్రధాన బ్యాటర్లతో కలిసి అతడు ప్రాక్టీస్ చేశాడు. మరోవైపు శాంసన్ బ్యాటింగ్ నెట్స్‌కు ఆఖర్లో వచ్చాడు. సంజూకంటే ముందు అభిషేక్ శర్మ, గిల్, తిలక్ వర్మ సాధనలో పాల్గొన్నారు. ఈ ముగ్గురి తర్వాత సూర్యకుమార్, రింకూ సింగ్, జితేశ్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. బుమ్రా, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్, శివమ్ దూబే, హార్దిక్‌ల బౌలింగ్‌లో బ్యాటర్లంతా ముమ్మర సాధన చేశారు. ఈ ఆర్డర్‌లో బ్యాటర్లు ప్రాక్టీస్ చేయడాన్ని చూస్తే సంజూకు తుది 11 మంది స్థానం లేనట్టేనేది విశ్లేషకుల అంచనా. అసలు గిల్‌కు ఆసియా కప్ జట్టులో చోటు కల్పించడంతోనే సంజూకు దారులు మూసుకుపోయాయనే వ్యాఖ్యలు వినిపించాయి. మరోవైపు స్థానిక బౌలర్ల బౌలింగ్‌లో సంజూ నెట్ ప్రాక్టీస్ చేయడం గమనార్హం.

ఫైనల్లో సౌత్ X సెంట్రల్

దులీప్ ట్రోఫీ

బెంగళూరు: సౌత్‌జోన్, సెంట్రల్ జోన్ జట్లు దులీప్ ట్రోఫీ ఫైనల్లోకి అడుగుపెట్టాయి. నార్త్‌జోన్‌తో సెమీఫైనల్‌ను సౌత్‌జోన్.. వెస్ట్‌జోన్‌తో మరో సెమీస్‌ను సెంట్రల్‌జోన్ డ్రాగా ముగించాయి. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఇరుజట్లు తుదిపోరుకు అర్హత సాధించాయి. ఐదు రోజుల ఫైనల్ ఈనెల 11 నుంచి ఇక్కడే జరగనుంది. సౌత్‌జోన్‌తో మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 278/5తో ఆదివారం, మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన నార్త్‌జోన్ 361 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్ 536 రన్స్ చేయడంతో..ఆ జట్టుకు 175 రన్స్ ఆధిక్యం దక్కింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్ చివరిరోజు ఆఖరికి 95/1 స్కోరు చేసింది.

జైస్వాల్ అర్ధ శతకం: యశస్వీ జైస్వాల్ (64) రాణించడంతో..సెంట్రల్‌జోన్‌తో సెమీస్‌లో వెస్ట్‌జోన్ రెండో ఇన్నింగ్స్‌లో ఆదివారం ఆట ముగిసేసరికి 216/8 స్కోరు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 556/8తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సెంట్రల్ 600 రన్స్‌కు ఆలౌటైంది. వెస్ట్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 438 పరుగులు చేయడంతో..సెంట్రల్‌కు 162 రన్స్ ఆధిక్యం లభించింది.

ప్రీక్వార్టర్స్‌కు లక్ష్య

ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్: భారత బాక్సర్ లక్ష్య చాహర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ముందంజ వేశాడు. 80 కిలోల విభాగంలో లక్ష్య 5-0తో జోర్డాన్ బాక్సర్ హుస్సేన్ లాషైఎను చిత్తుగా ఓడించి ప్రీ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. మరో భారత బాక్సర్ పవన్ బర్త్వాల్ పోరు ప్రీక్వార్టర్స్‌కు ముందే ముగిసింది. 55 కిలోల విభాగం బౌట్‌లో పవన్ 0-5తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన మిర్జాఖలిలోవ్ మిరాజిబెక్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

గుకేష్‌తో అర్జున్ గేమ్ డ్రా

సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్థాన్): ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ నాలుగో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి-గుకేష్ మధ్య గేమ్ డ్రా అయ్యింది. ఈ గేమ్ 46 ఎత్తుల తర్వాత ఫలితం తేలకుండా ముగిసింది. మరో గేమ్‌లో ప్రజ్ఞానందను అభిమన్యు మిశ్రా నిలువరించాడు. జవెరి జియాంగ్‌తో హరికృష్ణ పాయింట్‌ను పంచుకోగా..బాసెమ్ అమీన్‌పై దివ్యా దేశ్‌ముఖ్ నెగ్గింది. మహిళల విభాగం నాలుగో రౌండ్‌లో.. హారిక, వైశాలి గేమ్‌లు కూడా డ్రాగా ముగియగా, వంతిక అగర్వాల్ ఓటమిపాలైంది.

342 పరుగుల తేడాతో..

ఇంగ్లండ్ రికార్డు విజయం

- బెథల్, రూట్ శతక మోత
- మూడో వన్డేలో సౌతాఫ్రికా చిత్తు
- విజృంభించిన ఆర్చర్


ఆర్చర్ (4/18)


బెథల్ (110) రూట్ (100)

సౌతాంప్టన్: జాకబ్ బెథల్ (110), జో రూట్ (100) శతకాలతోపాటు జోఫ్రా ఆర్చర్ (4/18) విజృంభించడంతో.. ఆఖరి, మూడో వన్డేలో ఇంగ్లండ్ 342 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. దీంతో వన్డేల్లో అత్యధిక పరుగుల తేడాతో గెలిచిన జట్టుగా ఇంగ్లండ్ చరిత్ర సృష్టించింది. 2023లో తిరువనంతపురంలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకపై భారత్ 317 పరుగుల తేడాతో గెలిచింది. ఇప్పుడు ఆ రికార్డును ఇంగ్లండ్ బద్దలుకొట్టింది. 2-0తో ఈపాటికే మూడు వన్డేల సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్.. సఫారీలతో నామమాత్రమైన ఆఖరి వన్డేలో అదరగొట్టింది. తొలుత ఇంగ్లండ్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 414 పరుగులు చేసింది. రూట్, బెథల్ మూడో వికెట్‌కు 182 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. బట్లర్ (62 నాటౌట్), జేమీ స్మిత్ (62) అర్ధ శతకాలతో అదరగొట్టారు. కేశవ్ మహరాజ్, కోర్బిన్ బాష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో సౌతాఫ్రికా 20.5 ఓవర్లలో 72 పరుగులకే కుప్పకూలింది. ఆదిల్ రషీద్ 3, బ్రైడన్ కార్స్ 2 వికెట్లు పడగొట్టారు. తొలి పవర్‌ప్లేలోనే ఆర్చర్ దెబ్బకు 24/6తో పీకల్లోతు కష్టాల్లో పడ్డ సౌతాఫ్రికా కోలుకోలేక పోయింది. టాపార్డర్ బ్యాటర్లు మార్‌క్రమ్ (0), రికెల్టన్ (1), ముల్డర్ (0), మాథ్యూ బ్రీట్జ్‌కే (4) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. బాష్ (20), కేశవ్ (17) ఘోర పరాభవాన్ని తప్పించే ప్రయత్నం చేశారు. ఇక, వన్డేల్లో ఇంగ్లండ్ 400లకుపైగా స్కోరు చేయడం ఇది ఏడోసారి. ఈ క్రమంలో అత్యధికసార్లు 400కు పైగా స్కోరు చేసిన భారత్ (7)తో కలిసి ఇంగ్లండ్ రెండోస్థానంలో నిలిచింది. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా (8 సార్లు) టాప్‌లో ఉంది.



టైటాన్స్ మరో గెలుపు

బెంగాల్ వారియర్స్ చిత్తు
ప్రొ కబడ్డీ లీగ్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): సొంతగడ్డపై ఆతిథ్య తెలుగు టైటాన్స్ జోరు పెంచింది. ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-12 తొలి అంచె లీగ్‌లో రెండో గెలుపును నమోదు చేసింది. ఇక్కడి పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 44-34 స్కోరుతో పటిష్టమైన బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. కీలక మ్యాచ్‌లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగిన టైటాన్స్ ఆటగాళ్లు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. టైటాన్స్‌లో ఆటగాళ్లలో భరత్ 12, కెప్టెన్ విజయ్ మాలిక్ 11 పాయింట్లు రాబట్టి జట్టు విజయంలో కీలకపాత్ర వహించారు. మ్యాచ్ 11వ నిమిషంలోనే వారియర్స్‌ను ఆలౌట్ చేసి ఒత్తిడి తెచ్చారు. విజయ్ రైడ్‌లో మూడు పాయింట్లు రాబట్టి టైటాన్స్ శిబిరంలో ఉత్సాహం పెంచాడు. ప్రథమార్థాన్ని 23-14 ఆధిక్యంతో ముగించిన టైటాన్స్ ఆటగాళ్లు ద్వితీయార్థంలోనూ అదే జోరు కొనసాగించి స్కోరు బోర్డును పరుగెత్తించారు. ఈ దశలో వారియర్స్ పుంజుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆఖర్లో వారియర్స్ ఆటగాళ్లు వరుసగా టైటాన్ డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్ ఏకపక్షంగా మారింది. ఉత్కంఠగా సాగిన మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 36-35తో జైపూర్ పింక్‌పాంథర్స్‌పై గెలుపొందింది.

ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద దాడి

» రష్యాలోని చమురు కేంద్రంపై ఉక్రెయిన్ ప్రతీకార దాడి

కీవ్, సెప్టెంబరు 7: ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద దాడి చేసింది. 805 డ్రోన్లు, క్షిపణులతో రాజధాని కీవ్‌లోని ప్రభుత్వ ప్రధాన పరిపాలన భవనాన్ని తొలిసారి లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలో ఏడాది చిన్నారి సహా నలుగురు మృతిచెందారు. 44మంది గాయపడ్డారు. రష్యా తమపై 13 క్షిపణులను కూడా ప్రయోగించిందని తాము 4 క్షిపణులను, 747 డ్రోన్లను కూల్చివేశామని ఉక్రెయిన్ తెలిపింది. రష్యాకు చెందిన 9 క్షిపణులు, 56 డ్రోన్లు మొత్తం 37 ప్రదేశాల్లో పడ్డాయని వెల్లడించింది. రష్యా దాడిలో తొలిసారి మంత్రుల కార్యాలయాలు, నివాసాలున్న ప్రభుత్వ భవనం ధ్వంసమైందని ఉక్రెయిన్ ప్రధాని యూలియా తెలిపారు. దాడిని క్రూరమైనదిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభివర్ణించారు. రష్యా యుద్ధాన్ని పొడిగించాలనుకుంటోందన్నారు. మరోవైపు రష్యాలోని బ్రుజీబా చమురు కేంద్రంపై ఉక్రెయిన్ ప్రతీకార దాడి జరిపింది.

బీడీలపై జీఎస్టీ తగ్గింపు..
ఆరోగ్య నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7: బీడీలపై జీఎస్టీని తగ్గించడం పట్ల ఆరోగ్య నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చవకగా బీడీలు లభించడం వల్ల పేదలు, బలహీనవర్గాల్లో వీటి వినియోగం పెరుగుతుందని హెచ్చరించారు. బీడీలు చాలా హానికరమని, వీటిపై పన్నును తగ్గించడం వల్ల అవి మరింత చవకగా మారి వాడకం పెరగడానికి అవకాశం ఉంటుందని.. ఇది క్యాన్సర్లు, ఇతర వ్యాధుల బారిన పడటానికి దారి తీయవచ్చని ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ విశాల్‌రావు పేర్కొన్నారు. బీడీలపై జీఎస్టీని ప్రభుత్వం 18 శాతానికి తగ్గించి ఇతర పొగాకు ఉత్పత్తులపై మాత్రం 40శాతం నిర్ణయించిందని, అయితే అన్ని పొగాకు ఉత్పత్తులపై ఒకేరకమైన అధిక పన్ను విధించడం వల్ల వాటి వినియోగాన్ని అరికట్టడానికేకాకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి అవకాశం ఉంటుందన్నారు. అధిక పన్ను వల్ల పొగాకు వినియోగం తగ్గడానికి అవకాశం ఉంటుందని ప్రజారోగ్య నిపుణులు, ఢిల్లీ ఎయిమ్స్‌లో రూమటాలజీ విభాగం హెడ్ డాక్టర్ ఉమా కుమార్ పేర్కొన్నారు.

కార్ల ధరలను తగ్గించిన హ్యుండయ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7: జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో తమ మొత్తం మోడళ్ల శ్రేణి ధరలను రూ.2.4 లక్షల వరకు తగ్గించినట్టు ఆదివారం హ్యుండయ్ ప్రకటించింది. ధరల తగ్గింపు శ్రేణి రూ.60,640 (వెర్నాపైన) నుంచి రూ.2.4 లక్షల వరకు (ప్రీమియం ఎస్‌యూవీ టక్సన్‌పై) ఉన్నట్టు తెలిపింది. తగ్గించిన ధరలు ఈ నెల 22 నుంచి వర్తిస్తాయని పేర్కొంది. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాన్ని అందించేందుకు తన వాణిజ్య వాహనాల (సీవీ) ధరలను తగ్గిస్తున్నట్టు టాటా మోటార్స్ వెల్లడించింది. సీవీ శ్రేణి ధరలు రూ.30వేల నుంచి రూ.4.65 లక్షల వరకు తగ్గుతాయని, తగ్గించిన ధరలు ఈనెల 22నుంచి అమల్లోకివస్తాయని పేర్కొంది.

ఎర్రసముద్రంలో తెగిన కేబుల్స్

» భారత్, పాక్‌లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం


దుబాయ్, సెప్టెంబరు 7: ఎర్రసముద్రంలో సముద్రగర్భ కేబుల్స్ తెగిపోవడంతో భారత్, పాక్ సహా మధ్య, దక్షిణాసియాలోని కొన్ని దేశాల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగింది. ఇంటర్నెట్ సదుపాయాన్ని పర్యవేక్షించే నెట్‌బ్లాక్స్.. ఎర్ర సముద్రంలో కేబుల్స్ తెగడంతో ఏర్పడిన అంతరాయాల వల్ల అనేక దేశాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ దెబ్బతిందని, వేగం తగ్గిందని.. వాటిలో భారత్ ఉందని పేర్కొంది. అయితే భారత టెలికాం ఆపరేటర్లు మాత్రం ఇంటర్నెట్, డేటా కనెక్టివిటీ సేవలపై ప్రభావం కనిపించలేదన్నారు. కాగా, కేబుల్స్ తెగిపోవడానికి స్పష్టమైన కారణం తెలియలేదు. ఇది యెమెన్‌కు చెందిన హౌతీ రెబెల్స్ పని అయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. హమాస్‌పై యుద్ధాన్ని ఆ పాలని ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఈ పని చేసి ఉంటారని భావిస్తున్నారు.

బీజేపీకి బ్యాక్ ఆఫీస్‌గా ఈసీ!

ఆ పార్టీ ఓట్ల చోరీకి సహకరిస్తున్న కమిషన్.. స్థానికంలో బ్యాలెట్ వాడాలన్న కర్ణాటక సర్కారు నిర్ణయం భేష్

» దేశానికి మోదీ శత్రువు

» ఆయన అహం వీడాలి: ఖర్గే



బెంగళూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్న బీజేపీకి ఎన్నికల కమిషన్ బ్యాక్ ఆఫీస్ మాదిరి వ్యవహరిస్తోందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన 'ఎక్స్' సందేశంలో ధ్వజమెత్తారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు అంశాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు అంశాన్ని కాంగ్రెస్ బయటపెట్టిందని ఫాం7 ద్వారా వేలాది ఓట్లను తొలగించిన విషయాన్ని బహిర్గతం చేసిందన్నారు. దీనిపై కేసు పెట్టామని ఆ తర్వాత దీనిపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించిందని ఖర్గే తెలిపారు. దీనికి సంబంధించిన కీలక పత్రాలను ఈసీ అందుబాటులో లేకుండా చేసిందని, ఎవరిని కాపాడేందుకు ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోందో దీనిని బట్టి అర్థమవుతుందని ఆయన మండిపడ్డారు. సీఐడీ విచారణను ముందుకు సాగనీయకుండా చేసి బీజేపీ ఓట్ల దొంగతనానికి ఈసీఐ సహకరిస్తోందని, అందుకే దానిని బీజేపీ బ్యాక్ ఆఫీస్‌గా పరిగణిస్తున్నామని ఖర్గే వ్యాఖ్యానించారు. ఇక, స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని ఖర్గే పేర్కొన్నారు. కాగా ఏ ప్రధానీ నరేంద్ర మోదీలా వ్యవహరించలేదని, ఆయన అహం వీడాలని ఖర్గే వ్యాఖ్యానించారు. కలబురగిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తానేం చేసినా చెల్లుతుందనే అహం ప్రధాని మోదీకి ఉందని, అదే ఆయన పతనానికి కారణం కానుందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ స్నేహితులమని చెప్పుకొంటుంటారని, అయితే మోదీ దేశానికి శత్రువుగా మారారని ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ వేసిన 50శాతం టారీఫ్‌లకు దేశ ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు. ఎనిమిదేళ్ల తమ పోరాట ఫలితంగానే కేంద్రం జీఎస్టీని తగ్గించిందన్నారు. ప్రధాని మోదీకి దూరదృష్టి లేదని, అలా ఉండుంటే దేశం కోసం ఏం చేయాలనేది ఆలోచించి పాటిస్తారని ఖర్గే వ్యాఖ్యానించారు. కాగా కలబురగిలో మల్లికార్జున ఖర్గేకు తన కష్టం చెప్పుకొనేందుకు స్థానిక యువ రైతు ఒకరు ముందుకొచ్చారు. తాను సాగు చేసిన పంట అతివృష్టితో దెబ్బతిందని, 4 ఎకరాలలో సాగు చేసిన కంది పూర్తిగా నాశనమైందన్నారు. దానికి తాను 40 ఎకరాలలో కంది, పెసలు, పత్తి, సూర్యకాంతి పంటలు సాగు చేశానని, అవి దెబ్బతిన్నాయని తానెవరికి చెప్పాలని యువరైతును ఖర్గే ఎదురు ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా వద్దకు వెళ్లాలని, ప్రచారం కోసం తన వద్దకు రావద్దంటూ ఆ యువ రైతుపై ఖర్గే విరుచుకుపడ్డారు.

రాహుల్ అందుకే మలేషియా వెళ్లారు: బీజేపీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మలేషియా పర్యటనకు వెళ్లడంపై బీజేపీ ఎద్దేవా చేసింది. బిహార్ రాజకీయాల వేడి సెగ కాంగ్రెస్ యువరాజ్‌కు బాగా తాకిందని, అందుకే విరామం కోసం తొందరపడ్డారని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే, అదృశ్యం కావడం-సెలవుల్లో గడపటం అనే కళను పరిపూర్ణం చేయడంలో రాహుల్ బిజీగా ఉన్నారని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ తరచుగా వియత్నాం, ఇతర దేశాలకు వెళ్లడాన్ని ఈ ఏడాది బడ్జెట్ సమావేశాల సందర్భంగా బీజేపీ ప్రశ్నించింది.

ద్రావిడ ప్రయోజనాలకు
బీజేపీ వ్యతిరేకం కాదు

» దీనికంటే తప్పుడు వాదన మరొకటి లేదు: నిర్మల

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7: ద్రావిడ ప్రయోజనాలకు బీజేపీ వ్యతిరేకం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పునరుద్ఘాటించారు. దీనికంటే అతిపెద్ద తప్పుడు వాదన మరొకటి లేదని ఆదివారం ఆమె ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మంత్రుల అవినీతి, దళితులపై హింస, పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం వంటి అంశాలపై వస్తున్న ఆరోపణలు తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి సమస్యగా మారాయని చెప్పారు. వాటికి సమాధానం చెప్పలేకే భాష, ద్రావిడులకు గుర్తింపు వంటి భావోద్వేగ అంశాలను లేవనెత్తుతూ బీజేపీపై ఎదురుదాడికి దిగుతోందని మండిపడ్డారు. ఇటువంటి విషయాలను పట్టించుకోకుండా వేర్పాటువాదాన్ని తెరపైకి తీసుకొచ్చేందుకు ఆ పార్టీ సమయాన్ని వెచ్చిస్తోందని డీఎంకే తీరును ఆమె తీవ్రంగా ఖండించారు. "సామాజిక న్యాయాన్ని కాపాడుతున్నామని డీఎంకే చెప్పుకొంటున్నప్పటికీ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కుల హింస పునరావృతమైందనేది వాస్తవం. షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు తరచుగా హింసకు గురవుతున్నారు. వారు ఉపయోగించే నీటి వనరులు మానవ మలమూత్రాలతో కలుషితమైన ఘటనలు జరిగాయి" అని ఆమె తెలిపారు. ఇలాంటివి విన్నప్పుడు తన రక్తం మరిగిపోతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పరువు హత్యలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు.

2,500 కోట్ల డ్రగ్స్ రాకెట్‌కు దుబాయ్ లింక్!

» సూత్రధారి పవన్ ఠాకూర్‌పై ఎన్సీబీ సిల్వర్ నోటీస్

» నిందితుడికి దుబాయ్‌లో విల్లా, ఆస్తులు, లగ్జరీ కార్లు

న్యూఢిల్లీ/వాషింగ్టన్, సెప్టెంబరు 7: భారీ డ్రగ్స్ నెట్‌వర్క్ ముఠా లింకులకు సంబంధించిన కీలక వివరాలను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) అధికారులు గుర్తించారు. దుబాయ్ కేంద్రంగా మాదకద్రవ్యాల దందా సాగిస్తున్న పవన్ ఠాకూర్‌ను కీలక సూత్రధారిగా గుర్తించారు. నిందితుడు దుబాయ్‌లో ఖరీదైన విల్లా, లగ్జరీ కార్లు, ఆస్తులు కొన్నట్లు దర్యాప్తులో తేలింది. అతడ్ని పట్టుకొనేందుకు తాజాగా అంతర్జాతీయ సిల్వర్ నోటీస్ జారీ చేశారు. 2024 నవంబరులో ఢిల్లీలో రూ.2,500 కోట్ల విలువైన 82 కిలోల హైగ్రేడ్ కొకైన్ పట్టుబడింది. దేశంలో ఇంత భారీ స్థాయిలో డ్రగ్స్ పట్టుబడిన ఘటనల్లో ఇదొకటి. దీని వెనుక పవన్ ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు ఎన్సీబీ అధికారులు చెబుతున్నారు. ఈ డ్రగ్స్ మెక్సికో నుంచి ఒక భారతీయ పోర్టుకు వచ్చి.. ఆ తర్వాత ట్రక్కు ద్వారా ఢిల్లీకి చేర్చారని, అనంతరం ఒక గిడ్డంగిలో నిల్వ చేశారని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. అప్పట్లో ఐదుగురు ఠాకూర్ అనుచరులను అరెస్టు చేశారు. కాగా, విదేశాల్లో ఉండే మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారుడ్ని పట్టుకొనేందుకు భారత అధికారులు తొలిసారిగా సిల్వర్ నోటీస్‌ను ఉపయోగించారు. ఇది నిందితుడి ఆస్తులు, వ్యాపారాలు, ఆర్థిక కార్యకలాపాలను గుర్తించేందుకు అంతర్జాతీయ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలకు వీలు కల్పిస్తుంది. పవన్ షెల్ కంపెనీల ద్వారా రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లో భారీగా పెట్టుబడులు పెట్టినట్లు భావిస్తున్న యూఏఈ, సింగపూర్, హాంకాంగ్, పలు ఇతర యూరోపియన్ దేశాలకు ఈ నోటీసు పంపారు. దర్యాప్తు అధికారుల వివరాల ప్రకారం.. పవన్ ఠాకూర్ చాలాకాలంగా హవాలా, మనీలాండరింగ్ వ్యాపారాలు చేస్తున్నాడు. ఢిల్లీలో హవాలా ఏజెంట్‌గా ప్రారంభమై క్రమంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలోకి దిగాడు. భారత్, దుబాయ్‌లలో ఇతడి కార్యకలాపాలున్నాయి. డ్రగ్స్ వ్యాపారం ద్వారా వచ్చే నల్లధనాన్ని హవాలా మార్గం ద్వారా మళ్లిస్తుంటాడు. భారత్, చైనా, సింగపూర్, హాంకాంగ్, యూఏఈలలో నిందితుడు క్రిప్టోకరెన్సీ ద్వారా చేసిన లావాదేవీలు, క్రాస్‌బోర్డర్ షెల్ కంపెనీల ద్వారా చేసిన కార్యకలాపాలపై ఆధారాలు సేకరించారు.

ఫుడ్ ఆర్డర్ చేయడం
కాస్త భారమే!

» ప్లాట్‌ఫామ్ ఫీజులు పెంచిన స్విగ్గీ, జొమాటో, మ్యాజిక్‌పిన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7: ఇంటి నుంచే ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ చేసి తెప్పించుకుందామనుకొనే లక్షలాది మందికి ఇది కాస్త చేదు వార్త.. ఫుడ్ డెలివరీ కంపెనీలు స్విగ్గీ, జొమాటో, మ్యాజిక్‌పిన్ తమ ప్లాట్‌ఫామ్ ఫీజులు పెంచాయి. అంతేగాక సెప్టెంబరు22 నుంచి ఫుడ్ డెలివరీ చార్జీలపై కేంద్రం 18శాతం జీఎస్టీ విధిస్తూ నిర్ణయం తీసుకోవడం వల్ల ఫుడ్ ఆర్డర్ చార్జీలు ఇంకాస్త పెరుగుతాయి. స్విగ్గీ కొన్నిచోట్ల తన ప్లాట్‌ఫామ్ ఫీజును జీఎస్టీతో కలిపి రూ.15 చేయగా.. జొమాటో కూడా తన ప్లాట్‌ఫామ్ ఫీజును జీఎస్టీలేకుండా రూ.12.50 చేసింది. మ్యాజిక్‌పిన్ తన ప్లాట్‌ఫామ్ ఫీజును ప్రతి ఆర్డర్‌కు రూ.10 చేసింది. సెప్టెంబరు 22 నుంచి డెలివరీ చార్జీలపై 18శాతం జీఎస్టీ అమలుకానున్నందున జొమాటోలో ఒక్కో ఆర్డర్‌కు రూ.2 అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. స్విగ్గీలో ఆర్డర్ చేసేవారు రూ.2.6 అదనంగా చెల్లించాల్సి వస్తుంది. ప్లాట్‌ఫామ్ ఫీజుల పెంపుపై మ్యాజిక్‌పిన్ కంపెనీ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. తాము ఇప్పటికే ఫుడ్ డెలివరీ చార్జీలపై 18 శాతం జీఎస్టీ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. అందువల్ల తాజాగా జీఎస్టీ శ్లాబుల్లో చేసిన మార్పుల ప్రభావం తమ వినియోగదారులపై పడదన్నారు. అలాగే ప్రతి డెలివరీకి తాము విధిస్తోన్న రూ.10 ప్లాట్‌ఫామ్ ఫీజు ఇతర కంపెనీలతో పోలిస్తే తక్కువేనని పేర్కొన్నారు.

గోవు కడుపులో
28 కిలోల ప్లాస్టిక్, 41 మేకులు

» శస్త్ర చికిత్సలతో తొలగించిన హిమాచల్ పశు వైద్యులు

ఉనా, సెప్టెంబరు 7: గర్భం దాల్చిన గోవు కడుపు నుంచి 28 కిలోల ప్లాస్టిక్, 41 ఇనుప మేకులను ప్రభుత్వ పశువుల ఆస్పత్రి వైద్యులు.. 53 రకాల శస్త్ర చికిత్సలతో తొలగించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని బర్‌నోహ్ జోనల్ పశువుల ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ నిషాంత్ రనౌత్ సారథ్యంలో శనివారం విజయవంతంగా ఈ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. నాలుగైదు రోజులుగా గడ్డి తినకుండా, నీరు తాగకుండా ఉండటంతో కాల్‌రుహి రైతు విపిన్‌కుమార్ నేతృత్వంలో ఐదుగురు రైతులు సదరు గోవును బర్‌నోహ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ గోవుకు నిర్వహించిన పరీక్షల్లో కడుపులో అసహజ వస్తువులున్నట్లు గుర్తించి.. శస్త్ర చికిత్స ద్వారా తొలగించాలని నిర్ణయించినట్లు డాక్టర్ రనౌత్ తెలిపారు. 53 శస్త్రచికిత్సలు చేసి.. గోవు కడుపులో నుంచి 41 మేకులు, 28 కిలోల ప్లాస్టిక్, బట్టలు, తాళ్లు, ఇతర లోహపు ముక్కలు తొలగించారు. ఈ శస్త్రచికిత్స చేసిన వైద్యుల బృందాన్ని అభినందించిన పశు సంవర్ధక విభాగం ఉనా డిప్యూటీ డైరెక్టర్ వీరేంద్ర పాటియాల్.. బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, మేకులు, ఇతర సామగ్రి పడేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

25,100 పైన బుల్లిష్

(సెప్టెంబరు 8-12 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,981-24,433 పాయింట్ల మధ్యన కదలాడి 336 పాయింట్ల లాభంతో 24,741 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,100 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,723, 24,639, 24,793, 24,719 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,100 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 24,250

నిరోధ స్థాయిలు: 24,950, 25,050, 25,150 (24,850 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 24,550,24,450,24,350 (24,650 దిగువన బేరిష్)

టెక్ వ్యూ

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	545
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	113	విజయవాడ	135
వరంగల్	113	గుంటూరు	125
కరీంనగర్	113	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	113	చిత్తూరు	100
కర్నూలు	113	నెల్లూరు	105
విశాఖపట్నం	139	అనంతపురం	105
గోదావరి	135		

జీఎస్‌టీ 2.0తో ఆదాయ లోటు ఉండదు

ద్రవ్య లోటునూ కట్టడి చేస్తాం

ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్



న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల సవరణతో కేంద్ర ప్రభుత్వ ఆదాయానికి, ద్రవ్య లోటుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ స్పష్టం చేశారు. రేట్ల తగ్గింపుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2025-26)కి అంచనా వేసిన రూ.48,000 కోట్ల ఆదాయ లోటును.. పెరిగే వినియోగం, జీడీపీ వృద్ధి రేటు భర్తీ చేస్తాయన్నారు. దాంతో ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్య లోటును జీడీపీలో 4.4 శాతం వద్ద కట్టడి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు.

జీడీపీ మరింత పైకి

జీఎస్‌టీ తాజా సంస్కరణలతో ఈ ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా పెట్టుకున్న 6.3-6.8 శాతం జీడీపీ వృద్ధి రేటు లక్ష్యాన్నీ అధిగమించే అవకాశం ఉందని ఆర్థిక మంత్రి సీతారామన్ అన్నారు. ఈ సంస్కరణను ఆమె ప్రజా సంస్కరణగా అభివర్ణించారు. దీంతో నిరుపేదలతో సహా దేశంలోని ప్రతి ఒక్క కుటుంబానికీ ఎంతో కొంత మేలు జరుగుతుందన్నారు. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనాన్నీ నిశితంగా గమనిస్తున్నట్టు సీతారామన్ తెలిపారు. ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు బలపడడమే ఇందుకు కారణమన్నారు.

డిటర్జెంట్స్, కాస్మెటిక్స్‌కు నిరాశ

అన్ని నిత్యావసర వస్తువులపై పన్ను బాదుడు తగ్గించిన జీఎస్‌టీ కౌన్సిల్.. రోజువారీ నిత్యావసరమైన డిటర్జెంట్లు, కాస్మెటిక్స్ గృహోపయోగ ఇనిసెక్టిసైడ్స్‌ను మాత్రం కరుణించలేదు. వీటిని 18 శాతం శ్లాబులో కొనసాగించడంపై ఎఫ్‌ఎంసీజీ కంపెనీలతో పాటు విశ్లేషకులూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బహుశా ఇది అనుకోకుండా జరిగిన పొరపాటై ఉండవచ్చని, తుది నోటిఫికేషన్‌లో ప్రభుత్వం దీన్ని సవరించే అవకాశం ఉందని డెలాయిట్ ఇండియా పార్ట్నర్ హర్‌ప్రీత్ సింగ్ చెప్పారు. జీఎస్‌టీ రేటు తగ్గించి ఉంటే దేశంలో కాస్మెటిక్స్ అమ్మకాల వృద్ధి రేటుకు పెద్ద ఊతం లభించి ఉండేదని గ్రాంట్ థార్న్‌టన్ భారత్ పార్ట్‌నర్ నవీన్ మల్పానీ చెప్పారు.

బిజినెస్



పసిడిపై కేంద్ర బ్యాంకులకు
తగ్గని మోజు

- ఏటా 1,000 టన్నుల వరకు కొనుగోలు
- 36,000 టన్నులకు చేరిన నిల్వలు
- విలువ రూ.397 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రపంచంలోని కేంద్ర బ్యాంకులకు కూడా అమెరికా ఆర్థిక వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోంది. దీంతో అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో పెట్టుబడులు తగ్గించి, తమ ఫారెక్స్ నిల్వల్లో పెద్దఎత్తున పసిడి నిల్వలు పెంచుకుంటున్నాయి. ఈ కొనుగోళ్లు ఎంత లేదన్నా ఏటా 1,000 టన్నుల వరకు ఉన్నట్టు అంచనా. 2022-25 మధ్య కాలంలో ప్రపంచంలో అమ్ముడైన మొత్తం పసిడిలో 23 శాతాన్ని కేంద్ర బ్యాంకులే కొనుగోలు చేశాయి. యూరోపియన్ కేంద్ర బ్యాంక్ ఇటీవల విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), చైనా పీపుల్స్ బ్యాంక్‌తో సహా వివిధ దేశాల కేంద్ర బ్యాంకుల వద్ద ప్రస్తుతం 4.5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.397.35 లక్షల కోట్లు) విలువైన 36,000 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో పెట్టుబడులతో పోలిస్తే ఇది దాదాపు లక్ష కోట్ల డాలర్లు ఎక్కువ. పసిడి కొనుగోలుకు ప్రధాన కారణాలు..

- క్షీణిస్తున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ
- అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి
- పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు
- పసిడిపై అధిక రాబడులు
- సురక్షిత పెట్టుబడిగా బంగారానికి ఉన్న ప్రత్యేకత
- అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గుతాయన్న అంచనాలు
- అమెరికాలో కొనసాగుతున్న అధిక ద్రవ్యోల్బణం
- మారుతున్న కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధానాలు
- వెంటాడుతున్న అమెరికా ఆంక్షల భయాలు

బరోడా బీఎన్‌పీ పారిబా బిజినెస్ ఫండ్

బరోడా బీఎన్‌పీ పారిబా మ్యూచువల్ ఫండ్.. బిజినెస్ కాంగ్లోమెరేట్స్ ఫండ్‌ను ప్రారంభించించింది. దేశంలోని ప్రధాన వ్యాపార గ్రూపులకు సంబంధించిన లిస్టెడ్ కంపెనీల వివిధ విభాగాల్లో పెట్టుబడులు పెట్టే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో అయితే కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ముగింపు తేదీ ఈ నెల 15.

హైదరాబాద్‌లో ఐఎంఈసీఈ సదస్సు

హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికవుతోంది. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏసీఎంఈ).. ఈ నెల 10 నుంచి 13 వ తేదీ వరకు హెచ్‌ఐసీసీలో ఇంటర్నేషనల్ మెకానికల్ ఇంజనీరింగ్ కాంగ్రెస్ అండ్ ఎక్స్‌పొజిషన్ (ఐఎంఈసీఈ) సదస్సును నిర్వహిస్తోంది. అమెరికా వెలుపల ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహించటం ఇదే తొలిసారి. ఈ సదస్సులో 1,500కు పైగా ఇన్నోవేటర్స్, అకడమిక్ నిపుణులు, పారిశ్రామిక ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

మిశ్రమ ధోరణిలోనే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమ ధోరణిలో సాగే అవకాశం కనిపిస్తోంది. జీఎస్‌టీ సంస్కరణలు చోదక శక్తిగా పనిచేస్తున్నప్పటికీ అమెరికా సుంకాలు, ట్రంప్ పదేపదే బెదిరింపు వైఖరితో ప్రకటనలు చేస్తుండటంతో పాటు అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొనటం సూచీలకు సరైన దిశ లభించటం లేదు. ప్రస్తుతం షైనింగ్, వినియోగం, మెటల్స్, ఆటో, ఎలక్ట్రికల్స్ రంగాలు మాత్రమే బలాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఇన్వెస్టర్లు ఆయా రంగాల్లో మెరుగ్గా రాణిస్తున్న షేర్లలో పెట్టుబడులు పెట్టవచ్చు. అయితే రిస్క్, రివార్డును బట్టి ముందుకు వెళ్లటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ ఇప్పుడిప్పుడే బలపడుతోంది. గత శుక్రవారం రూ.269 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.260 పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.255 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆదిత్య బిర్లా ఫ్యాషన్ రిటైల్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ప్రస్తుతం రివర్సల్‌కు సిద్ధమవుతోంది. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన కనబరుస్తుండటమే ఇందుకు కారణం. గత శుక్రవారం రూ.85 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.90 టార్గెట్ ధరతో రూ.82 శ్రేణిలో పడే కొద్దీ కొనుగోలు చేయవచ్చు. రూ.80 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బీఎస్ఈ: ప్రస్తుతం ఈ షేరు అత్యంత ఆకర్షణీయమైన జోన్‌లో ఉంది. జీవితకాల గరిష్ఠం నుంచి దాదాపు 30 శాతం కరెక్షన్ జరిగిన తర్వాత పుల్‌బ్యాక్ అయ్యేలా కనిపిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.2,319 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,300పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.2,250 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్ఎండీసీ: కొంతకాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనించిన ఈ కౌంటర్‌లో ఇప్పుడు ట్రెండ్ రివర్సల్ అవుతోంది. ప్రస్తుతం కీలక నిరోధ స్థాయి రూ.75 వద్ద ఉంది. దీన్ని అధిగమిస్తే మరింత మూమెంటమ్ వస్తుంది. గత శుక్రవారం రూ.74.53 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.72 ఎగువన ప్రవేశించి రూ.84 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.69 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బయోకాన్: ఈ షేరు ప్రస్తుతం ట్రెండ్‌లైన్ సపోర్ట్ వద్ద కదలాడుతోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ ఇప్పుడిప్పుడే మెరుగవుతోంది. రూ.365 స్థాయిని అధిగమిస్తే మరింత పెరిగే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.363 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.360 పై స్థాయిలో ప్రవేశించి రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.350 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

25,000 వద్ద అప్రమత్తం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభమై కీలక స్థాయి 25,000 వరకు వెళ్లినా రియాక్షన్‌కు లోనయింది. చివరికి వారం మొత్తానికి 314 పాయింట్ల లాభంతో 24,740 వద్ద ముగిసింది. నిఫ్టీ వారం మధ్య స్థాయిలో ముగియడం అప్రమత్త, అనిశ్చిత ధోరణి సంకేతం. మార్కెట్ గత కొద్ది వారాల్లో పరిమిత పరిధిలో చిక్కుకుని 25,000 స్థాయిలో సైడ్‌వేస్ ధోరణిలో ట్రేడయింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు కూడా అదే ధోరణి ప్రదర్శించాయి. నిఫ్టీ గత వారం 25,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలం కావడం, శుక్రవారం అమెరికన్ ఈక్విటీ మార్కెట్లలో ఏర్పడిన బలహీనత కారణంగా ఈ వారంలో ఇండెక్స్ 25,000 కన్నా పైన దృఢంగా నిలబడితే తప్ప అప్రమత్త ధోరణి ప్రదర్శించే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మైనర్ పాజిటివ్ ట్రెండ్ కోసం నిఫ్టీ మైనర్ నిరోధం 24,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక ప్రధాన నిరోధం 25,000. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక పాజిటివ్ సూచన వెలువడుతుంది.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయి 24,700 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,500. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 460 పాయింట్ల మేరకు రికవరీ సాధించి 54,115 వద్ద ముగిసింది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 54,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 55,000. బలహీనత ప్రదర్శించినా ప్రధాన మద్దతు స్థాయి 53,500 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: నిఫ్టీ 50, 100 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఆ పైన నిలదొక్కుకోవాలి. అలాగే 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,850, 24,940
మద్దతు	24,700, 24,580



సంస్థాన్‌నారాయణపురంలో నిర్వహించిన రీజనల్ రింగ్‌రోడ్డు నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారాలంటే

ప్రభుత్వమే మారాలేమో?

- భూ నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వం
- న్యాయం జరగకపోతే ప్రభుత్వాన్ని స్తంభింపజేద్దాం
- నిర్వాసిత రైతుల సమావేశంలో రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం, ఆమనగల్లు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) భూ నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తా. అవసరమైతే కేంద్ర మంత్రి గడ్కరీతోనూ మాట్లాడతా. దక్షిణ భాగం అలైన్‌మెంట్ మారాలంటే ముందు ఉత్తరభాగం అలైన్‌మెంట్ మారాలి. ఇవి మారకపోతే చివరికి ప్రభుత్వమే మారాలనేమో' అని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు అన్యాయం జరగనివ్వనని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతానన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురంలో సంస్థాన్ నారాయణపురం, గట్టుప్పల మండలాల రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగంలో మునుగోడు నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో రైతులు నిర్వాసితులవుతున్నారన్నారు. 'నాకు అన్యాయం జరిగినా సరే మునుగోడు ప్రజలకు, రైతులకు అన్యాయం జరగనివ్వను. మార్కెట్ ధర ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వంతో మాట్లాడతా. అయినా న్యాయం జరగకపోతే అంతా రాజకీయాలకతీతంగా ప్రభుత్వాన్ని స్తంభింపజేద్దాం' అని చెప్పారు.

రంగారెడ్డిలో భూ నిర్వాసితుల నిరసనలు

ట్రిపుల్ ఆర్‌ను పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి, కేశంపేట మండలాల రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ట్రిపుల్ ఆర్‌పై ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ప్రాథమిక నోటిఫికేషన్‌లోని తలకొండపల్లి మండలం గౌరిపల్లి, జంగారెడ్డిపల్లి, రాంపూర్, వెంకట్రావ్‌పేట, జూలపల్లి గ్రామాల నిర్వాసితులు ఆదివారం ఆమనగల్లులోని మండల పరిషత్ వద్ద ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా రాజీవ్ చౌక్‌కు చేరుకొని హైదరాబాద్-శ్రీశైలం జాతీయరహదారిపై ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో చేశారు. అనంతరం ఎమ్మెల్యే దిష్టి బొమ్మను దహనం చేశారు.

యూరియా సరఫరా పెరుగుతుంది

- కేంద్రానికి సీఎం విజ్ఞప్తితో కదలిక: తుమ్మల నాగేశ్వరరావు



అశ్వారావుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సాగుకు అవసరమైన యూరియాను పూర్తిస్థాయిలో సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయంగా, దేశీయంగా ఉన్న అనేక పరిస్థితుల నేపథ్యంలో యూరియా సరఫరాలో, కొంత మేర కేటాయింపుల్లో ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి యూరియా ప్రణాళికకు అనుగుణంగా కేటాయింపు ఇవ్వాలని కేంద్రానికి లేఖ ద్వారా, స్వయంగాను కలిసి విన్నవించారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ కృషి ఫలితంగా ఆగస్టులో కేంద్రం నుంచి అదనంగా 40వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని చెప్పారు. ఇకనుంచి ప్రతీ రోజు 8వేల నుంచి 10వేల మెట్రిక్ టన్నుల యూరియా వివిధ కంపెనీల ద్వారా సరఫరా అవుతుందన్నారు.

గురుకులాల అభివృద్ధిపై దృష్టి: పొన్నం, వాకిటి

భిక్కనూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని బీటీఎస్‌లో గల జ్యోతిబా పూలే పాఠశాలను వారు తనిఖీ చేశారు. అనంతరం గత విద్యాసంవత్సరం పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులను సన్మానించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల పట్ల దృష్టి సారించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారని, అందులో భాగంగానే రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలుపుతోనే దేశ ప్రజలకు జస్టిస్: మల్లు రవి

- బీజేపీవి కపట నాటకాలు: వీహెచ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు జస్టిస్ (న్యాయం) జరగాలంటే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలవాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ ఆయనకు ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాలులో ప్రతిపక్ష పార్టీల మాక్ పోలింగ్ ఉందని తెలిపారు. ఇటీవల పార్లమెంట్‌ను మోదీ నడిపించిన విధానాన్ని చూస్తే.. స్వాతంత్ర్యం రాకముందు పరిస్థితులను దేశ ప్రజలు మళ్లీ చూడాల్సి వచ్చిందన్నారు. సెప్టెంబరు 17న కేంద్రం తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుతున్నట్టు ప్రకటించిందని, అయితే ఆనాడు తెలంగాణకు కొంతమంది వల్లే స్వాతంత్ర్యం రాలేదని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. తెలంగాణ విముక్తి ఉద్యమంలో బీజేపీ పాత్రే లేదని.. ఇకనైనా ఆ పార్టీ కపట నాటకాలు కట్టిపెట్టాలన్నారు. 1947లో నిజాం, రజాకార్లకు వ్యతిరేకంగా సాయుధ పోరాట యోధులు, కాంగ్రెస్ నాయకులు పోరాడారని చెప్పారు.

కామారెడ్డి సభ, పార్టీ కమిటీలే అజెండా!

- నేడు గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత సమావేశం
- పాల్గొననున్న మహేశ్ గౌడ్, మీనాక్షి నటరాజన్..

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న కామారెడ్డిలో తలపెట్టిన బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభను విజయవంతం చేయడం, పార్టీ కమిటీల ఏర్పాటే ప్రధాన అజెండాగా సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత సమావేశం జరగనుంది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ భేటీలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, జై బాపూ, జై సంవిధాన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొంటున్నారు. బీసీ డిక్లరేషన్‌లోని అంశాలను ప్రభుత్వం అమలు చేస్తుండడం, టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ గౌడ్ ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో 15న కామారెడ్డిలో టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు జనసమీకరణ, ఇతర ఏర్పాట్లపై సమావేశంలో చర్చించనున్నారు. అలాగే ఈ సభకు ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలనూ ఆహ్వానించాలని టీపీసీసీ యోచిస్తోంది. దీనికి సంబంధించి సమావేశంలో తీర్మానించే అవకాశముంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీల ఏర్పాటు పురోగతిని సమీక్షించనున్నారు. పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ చైర్మన్, ఇతర నామినేటెడ్ పదవుల భర్తీపైనా చర్చించే అవకాశముంది. స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించే అంశం, స్థానిక ఎన్నికలకు పార్టీ సన్నద్ధతపై కూడా చర్చలు జరుపుతారు.

భూమి నీడకు చంద్రుడు

82 నిమిషాల పాటు ఎరుపెక్కిన జాబిల్లి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సంపూర్ణ చంద్ర గ్రహణం కనువిందు చేసింది. భారత్‌లో ఆదివారం రాత్రి 9.56 గంటలకు మొదలైన గ్రహణం అర్ధరాత్రి 1.26 గంటలకు వీడింది. చంద్రుడు పూర్తిగా భూమి నీడకు వెళ్లిపోయి 82 నిమిషాల పాటు ఎర్రబారి కనిపించాడు. అనేక మంది ఈ ఖగోళ వింతను ఆసక్తిగా తిలకించారు. 2022 తర్వాత భారత్‌లో అత్యంత ఎక్కువ సేపు కనిపించిన సంపూర్ణ చంద్రగ్రహణం ఇదే కావడం విశేషం. గ్రహణం సందర్భంగా రాష్ట్రంలోని ఆలయాలను ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నామే మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ చేసిన తర్వాత తిరిగి తెరవనున్నారు. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ తలుపులను ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు మూసివేశారు. అంతకుముందు వేద పండితులు మూలవరుల అభిషేకం, ఇతర పూజలు నిర్వహించారు. రాజగోపురం వద్ద ఉన్న ప్రధాన ద్వారాన్ని సైతం మూసివేసి... ఆలయ ప్రాంగణంలోకి భక్తులను అనుమతించలేదు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం 12.25 గంటలకు రాజభోగం నిర్వహించి మూసివేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయం తలుపులు 11.36 గంటలకే మూతపడ్డాయి. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి అర్చకులు, ఆలయాధికారులు ద్వారబంధనం చేశారు. వరంగల్ భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాల గుడి, నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం, జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, మల్యాల మండలం కొండగట్టు అంజనేయస్వామి ఆలయాలను కూడా ప్రత్యేక పూజల అనంతరం మూసివేశారు. సోమవారం ఉదయం నుంచి మళ్లీ భక్తులకు దర్శనం కల్పించనున్నారు.



చంద్రగ్రహణం ఇలా..

చంద్రుడు ఎందుకు ఎరుపెక్కుతాడు?

సూర్యునికి చంద్రునికి మధ్యలో భూమి వచ్చినప్పుడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుంది. భూగోళం ఆపగా మిగిలిన సూర్యకిరణాలు, దానిచుట్టూ ఉన్న వాతావరణం గుండా ప్రసరించి చంద్రుని చేరుతాయి. ఆ క్రమంలో సూర్యుడి నుంచి వెలువడే కాంతిపుంజం చెల్లాచెదురు అవుతుంది. సప్తవర్ణాలు కలిగిన సూర్యకిరణాల్లో నీలిరంగు ఫిల్టర్ అయిపోగా, ఎరుపు, నారింజ రంగు కిరణాలు మాత్రమే చందమామపై పడతాయి. అలా చంద్రుడు ఎరుపెక్కుతాడు. ఆ ఎర్రని చందమామనే కొన్ని దేశాల్లో ప్రజలు 'బ్లడ్ మూన్'గా పిలుస్తున్నారు.

మూసీ పునరుజ్జీవానికి శ్రీకారం

గోదావరి తాగునీటి ప్రాజెక్టు ఫేజ్-2, 3లకు నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం

- రూ.7,658 కోట్లతో రెండు ప్రాజెక్టులు
- ఓఆర్ఆర్ ఫేజ్-2లో తాగునీటి సరఫరా ప్రాజెక్టునూ ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కలల ప్రాజెక్టుగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ పనులకు సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా రూ.7,360 కోట్లతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులను మంచినీటితో నింపేందుకు ఉద్దేశించిన గోదావరి తాగునీటి ప్రాజెక్టు ఫేజ్-2, 3 పథకాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. దీంతోపాటు ఓఆర్ఆర్ ఫేజ్-2లోని ప్రాంతాలకు తాగునీటి స రఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టులో నిర్మించిన 15 కొత్త రిజర్వాయర్లను ప్రారంభించనున్నారు. కాగా, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో చేపడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి పెట్టనుండగా, కాంట్రాక్టు సంస్థ 60 శాతం నిధులను సమకూర్చుకోనుంది. పనులు ప్రారంభమైన తరువాత నుంచి రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలిస్తారు. వీటిలో మూసీ పునరుజ్జీవానికి 2.5 టీఎంసీల నీటిని కేటాయించి.. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను నింపనున్నారు. మిగతా 17.5 టీఎంసీలను హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. నీటి తరలింపు మార్గం మధ్యలో ఉన్న 7 చెరువులను కూడా నింపుతారు. 2027 డిసెంబరు నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు, ప్రతిరోజూ నల్లా నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది.



15 రిజర్వాయర్ల ప్రారంభం..

ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలకు తాగునీటి సరఫరా కోసం రూ.1,200 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయింది. ఈ ప్రాజెక్టులో మొత్తం 71 రిజర్వాయర్లను నిర్మించగా.. వీటిలో 15 కొత్త రిజర్వాయర్లను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. వీటి ద్వారా సరూర్‌నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర, రాజేంద్రనగర్, షామీర్‌పేట, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఆర్‌సీపురం, పటాన్‌చెరు, బొల్లారం సహా 14 మండలాల్లోని 25 లక్షల మందికి తాగునీరు అందనుంది. మరోవైపు కోకాపేట లేఅవుట్ సమగ్ర అభివృద్ధిలో భాగంగా నియోపోలిస్ సెజ్‌కు తాగునీరు, మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి కోసం రూ.298 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిద్వారా దాదాపు 13 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.

అనర్హతపై ముందుకెలా?

(మొదటి పేజీ తరువాయి)

ఇతర ఎమ్మెల్యేలు కలిసినట్లుగానే తామూ కలిశామని చెప్పినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డిని ఇప్పటిదాకా వంద మందికి పైగా ఎమ్మెల్యేలు కలిశారని వివరించినట్లు తెలుస్తోంది. కాగా, అనర్హత కేసు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు, పిటిషన్‌దారుల సమక్షంలో ఈ కేసు విచారణ ప్రక్రియను స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విచారణను ఎమ్మెల్యేలు ఎలా ఎదుర్కొనాలన్నదానిపై న్యాయ నిపుణులతో కొంత చర్చ జరిగింది. ఎమ్మెల్యేలతో భేటీలో వారి నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపైనే సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువగా చర్చించినట్లు తెలుస్తోంది. భేటీలో పాల్గొన్న 9మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఏయే అభివృద్ధి కార్యక్రమాలు పెండింగ్‌లో ఉన్నాయి, వాటిలో తక్షణం పూర్తి చేయాల్సిన పనులు ఏమేమి ఉన్నాయన్న దానిపై సీఎం ఆరా తీశారు. వాటికి తక్షణమే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆయా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలు, సాధక బాధకాలనూ అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అన్ని విధాలుగా సహకరిస్తానని భరోసా ఇచ్చారు.

ఆ 3 కేసులను సీబీఐకి ఎందుకివ్వరు?

గొర్రెల స్కాం బాధ్యులపై చర్యలేవీ?

- రాష్ట్ర ప్రభుత్వానికి బండి సంజయ్ ప్రశ్న
- డైలీ సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ కేసును సాగదీస్తున్నారని విమర్శ



హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందంలో, ఫార్ములా ఈ రేస్‌లో అవకతవకలు, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో సీబీఐ విచారణను ఎందుకు కోరడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. 'విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో అవకతవకలపై జస్టిస్ మదన్ బీ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చింది కదా? దాన్ని ఎందుకు దాచిపెట్టారు? ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆధారాలను సీబీఐకి ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 'గొర్రెల స్కాంలో వందల కోట్ల అవినీతి బయటపడ్డా బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ప్రజాధనాన్ని దోచుకున్న దొంగలను ఎందుకు జైలుకు పంపడం లేదు? వాళ్ల ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదు? ఫార్ములా ఈ రేస్ స్కాం పేరుతో ప్రతిసారి 'ట్విటర్ టిల్లు'ను విచారణకు పిలిచి డ్రామాలాడుతున్నారే తప్ప చర్యలేవీ? అవినీతి జరిగిందని మీరే అనేకసార్లు చెప్పారు కదా? ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ స్కాంలో విదేశీ సంస్థ పాత్ర ఉంది కదా? మరి ఈ కేసును సీబీఐ విచారణ ఎందుకు ఇవ్వడం లేదు?' అని సంజయ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును రెండేళ్ల నుంచి డైలీ సీరియల్‌లా సాగదీస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందని ఆయన విమర్శించారు.

కాంట్రాక్టర్ల జేబుల్లోకే 'చేప పిల్లలు'!

- ఉచిత చేప పిల్లల పంపిణీలో గోల్‌మాల్
- టెండరు దశలోనే కాంట్రాక్టర్ల కూటమి
- నిధుల్లో సగం వృథా అవుతున్నాయంటున్న మత్స్యకారులు
- సొసైటీలకు నగదు బదిలీ చేస్తే నాణ్యమైన చేప పిల్లలు కొనుక్కుంటామని విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కాంట్రాక్టర్లకు కాసుల పంట పండిస్తోంది. టెండర్ల దశ నుంచి మొదలు చెరువుల్లో చేప పిల్లలను వేసే వరకు అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఏటా ప్రభుత్వం రూ. వంద కోట్లకుపైగా ఖర్చు చేస్తుంటే.. అందులో సగం దోపిడీకి గురవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఈ పథకంతో మత్స్యకారుల కంటే కాంట్రాక్టర్లకే ఎక్కువ లాభం జరుగుతోందని.. చేపపిల్లల పంపిణీకి బదులు తమకు నగదు బదిలీ చేస్తే, నాణ్యమైన చేపపిల్లలు కొనుక్కుంటామని మత్స్యకార సొసైటీలు కోరుతున్నాయి. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం ఈసారి నిబంధనలు మారుస్తుందని, నగదు బదిలీ చేస్తుందని చర్చ జరిగింది. కానీ పాత పద్ధతిలోనే చేప పిల్లల పంపిణీ కొనసాగించేలా కొందరు బడా కాంట్రాక్టర్లు ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం 2016-17లో ప్రారంభమైంది. కాంట్రాక్టర్లు నాణ్యత లేని చేపపిల్లలు సరఫరా చేయడం, అదీ నిర్ణీత పరిమాణం కంటే తక్కువగా చెరువుల్లో వేయడం, అందులోనూ చనిపోయిన చేప పిల్లలు ఉండటం వంటి అక్రమాలు ఏటా జరుగుతూనే ఉన్నాయని మత్స్యకార సొసైటీలు చెబుతున్నాయి. తామే కొంత సొమ్ము పోగేసుకొని, నాణ్యమైన చేపపిల్లలు కొని, చెరువుల్లో వేసుకుంటున్నామని అంటున్నాయి.

నగదు బదిలీకి ప్రతిపాదన వచ్చినా..

రాష్ట్రవ్యాప్తంగా 6,152 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 4.25 లక్షల మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. వారికి ఉపాధి కోసం ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని తీసుకొచ్చింది. చెరువుల విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకుని 'రైతుభరోసా' పథకం తరహాలో మత్స్యకారుల సొసైటీలకు 'చేపపిల్లల పథకం' నగదు బదిలీ చేయాలని ఈ ఏడాదీ ప్రభుత్వానికి ప్రతిపాదన వచ్చింది. కానీ చేపపిల్లల పంపిణీలో ఉన్న కాంట్రాక్టర్లు మత్స్యశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి నగదు బదిలీ ప్రతిపాదనను బుట్టదాఖలు చేయించినట్టు తెలిసింది. ఈ సారి చేపపిల్లల సరఫరా కోసం రాష్ట్రప్రభుత్వం రూ.122.22 కోట్లు కేటాయించింది. మత్స్యశాఖ జిల్లాల వారీగా ఈ-టెండర్లు పిలిచింది. సెప్టెంబరు ఒకటో తేదీ నాటికి గడువు ముగియగా 10 జిల్లాల్లో ఒక్కో టెండర్ మాత్రమే వచ్చింది. కాంట్రాక్టర్లు కూటమికట్టి జిల్లాలను పంచుకుని, ఒక్కో టెండర్ మాత్రమే వేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. మరో 16 జిల్లాల్లో ఒక్క బిడ్ కూడా దాఖలవకపోవడంతో అధికారులు ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించారు. అయితే ఒక్క టెండర్ మాత్రమే దాఖలైన జిల్లాల్లో.. వారికే కాంట్రాక్టు అప్పగిస్తారా? మళ్లీ టెండర్లు పిలుస్తారా? చూడాలి.

బీసీ బిల్లుకు కేంద్రం అడ్డు

కాంగ్రెస్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని కుట్ర .. రిజర్వేషన్లపై బీజేపీ బాగోతాన్ని వెల్లడిస్తాం

- కేసీఆర్ కుటుంబమంతా దొంగల ముఠానే
- ఆయన పిలిస్తే కవిత వెళ్లదా?: మహేశ్‌గౌడ్
- విపక్షాల కుట్రలు వెల్లడిస్తాం: పొంగులేటి
- బీసీల కోసం రాహుల్ పోరాటం: సీతక్క
- కేంద్రం మెడలు వంచుతాం: సురేఖ



కామారెడ్డిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ గౌడ్, చిత్రంలో మంత్రులు పొన్నం, పొంగులేటి, శ్రీహరి, సీతక్క, సురేఖ

కామారెడ్డి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గవర్నర్ వద్ద బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కేంద్రం తలచుకుంటే ఒక్క రోజులోనే రిజర్వేషన్లపై చట్టం తీసుకురావచ్చని.. కానీ కాంగ్రెస్‌కు ఎక్కడ పేరు వస్తుందోననే భయంతో అడ్డుకుంటోందన్నారు. కామారెడ్డిలో ఈ నెల 15న నిర్వహించనున్న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ సన్నాహక సమావేశం ఆదివారం కామారెడ్డిలోని శుభం కన్వెన్షన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. ప్రధాని మోదీ, అమిత్‌షాలను ఒప్పించకపోవడం సిగ్గు చేటన్నారు. బీసీ బిడ్డలైన సంజయ్, ఎంపీ అర్వింద్ బిల్లుపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. గతంలో తాను చేసిన దేశ్‌ముఖ్ వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. తాను సెక్యూరిటీ లేకుండా ప్రజల మధ్యకు వస్తానని.. బండి సంజయ్‌కి ఆ దమ్ముందా..? అని సవాల్ విసిరారు. రిజర్వేషన్లపై బీజేపీ బాగోతం బయటపెట్టడానికే కామారెడ్డిలో సభను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. 2లక్షల మందితో కేంద్రం కనువిప్పు కలిగేలా, బీసీల భవిష్యత్తు మలుపు తిప్పే విధంగా సభ ఉంటుందన్నారు. దోచుకున్న సొమ్ము వాటాల పంపిణీలో తేడా వచ్చి.. కేసీఆర్ కుటుంబం బజారున పడి కొట్టుకుంటోందన్నారు. కాళేశ్వరం అవినీతిని కవితనే బయటపెట్టిందని తెలిపారు. కేసీఆర్ కుటుంబమంతా దొంగల ముఠా అని, కేసీఆర్ పిలిస్తే మళ్లీ కవిత వెళ్లదా..? అని ఆయన ప్రశ్నించారు.

కామారెడ్డి సభతో బుద్ధి చెప్పాలి: పొన్నం

కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు మోకాలడ్డుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్రానికి బుద్ధి చెప్పేలా కామారెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలను కోరారు. బీసీ రిజర్వేషన్లపై ప్రతిపక్షాల కారుకూతలు, కుట్రలను బయటపెట్టేందుకే కామారెడ్డిలో విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శాస్త్రీయ పద్ధతిలో కులగణను విజయవంతం చేసి దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. కామారెడ్డి సభకు 2 లక్షల మందికి తగ్గకుండా తరలించాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు. రాహుల్, రేవంత్‌రెడ్డి.. అగ్రవర్ణాలకు చెందినప్పటికీ బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. బీసీల జనాభా ప్రకారం ఆ వర్గాలకు కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవులను కేటాయించామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ కచ్చితంగా నెరవేరుస్తుందన్నారు. కేంద్రం బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించకపోతే పోరాటం చేస్తామని మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. కామారెడ్డి వేదికగా సమరభేరి మోగించి కేంద్రం మెడలు వంచుతామన్నారు. అంతకుముందు బీసీ విజయోత్సవ సభ నిర్వహించే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్టేడియాన్ని మంత్రులు పరిశీలించారు.

దంచికొట్టి.. ముంచెత్తి.. వరంగల్‌లో జోరువాన

- తెల్లవారుజామున భారీ వర్షం
- చెరువుల్ని తలపించిన రోడ్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్):



చెరువును తలపిస్తున్న హనుమకొండ చౌరస్తా ప్రధాన రోడ్డు

వరంగల్‌లో ఆదివారం ఉదయం ఆకస్మికంగా కురిసిన కుండపోత వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు కాలనీలు జలమయం కాగా రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ముఖ్యంగా వరంగల్ నగరంతో పాటు ఖిలా వరంగల్ మండలాల పరిధిలో భారీ వర్షం పడగా.. మిగతా మండలాల్లో ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. బాలసముద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి నీరు చేరడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అండర్‌బ్రిడ్జి వద్ద చిక్కుకున్న బస్సులు

అండర్ రైల్వే బ్రిడ్జి కింద రెండు ఆర్టీసీ బస్సులు వరదనీటిలో చిక్కుకున్నాయి. హఠాత్తుగా బస్సు ఆగిపోవడంతో అందులో ఉన్న 30 మంది ప్రయాణికులు ప్రాణభయంతో హాహాకారాలు చేశారు. సమాచారం అందుకున్న నగర పాలక సంస్థ మాన్సూన్ బృందాలు, పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇక భారీ వర్షానికి హనుమకొండ చౌరస్తా జలమయమైంది. ప్రధాన రోడ్లతో పాటు సమీపంలోని పలు కాలనీలకు వరదనీరు పెద్దఎత్తున చేరింది. ఇటు, హనుమకొండ చౌరస్తాలో ప్రధానరోడ్డు వెంబడి మోకాళ్ల లోతు వరద పొంగి ప్రవహించడంతో రోడ్లన్నీ చెరువుల్ని తలపించాయి.

శ్రీశైలం ప్రాజెక్టుకు పెరిగిన వరద

శ్రీశైలం ప్రాజెక్టుకు ఆదివారం స్వల్పంగా వరద పెరిగింది. ప్రాజెక్టులోకి 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మూడు గేట్ల ద్వారా 82,986 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,078 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 30 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదవుతోంది. ఇక, జూరాల ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1.20లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు ఈ సీజన్‌లో ఆదివారం మూడోసారి తెరుచుకున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను, 589.70 అడుగులకు చేరుకుంది.

రైల్వే టీటీఐలకూ బయోమెట్రిక్

- ప్రయోగాత్మకంగా 6 స్టేషన్లలో అమలు
- రెండో దశలో 73 స్టేషన్లకు విస్తరణ: ఎస్‌సీఆర్

హైదరాబాద్ సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో టికెట్ తనిఖీ సిబ్బందికి బయో మెట్రిక్ సైన్-ఆన్, సైన్-ఆఫ్ విధానాన్ని తేవాలని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి దశలో ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ స్టేషన్లలో అమలు చేస్తున్న బయో మెట్రిక్ విధానం.. తదుపరి దశలో జోన్‌లోని 73 స్టేషన్లకు విస్తరిస్తారు. గతంలో టికెట్ తనిఖీ సిబ్బంది పేరు, పాస్‌వర్డ్ ఉపయోగించి సైన్-ఇన్, సైన్-ఆఫ్ అమలు చేశారు. తాజాగా ట్రావెలింగ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ (టీటీఐ) లాబీల్లో ఆధార్ ఆధారిత బయో మెట్రిక్ సైన్-ఆన్/ సైన్-ఆఫ్ విధానం తీసుకొచ్చారు. టీటీఐ లాబీ యాప్‌లో ఫింగర్ ప్రింట్ పరికరాన్ని సి-డిఎసి పోర్టల్‌తో అనుసంధానిస్తారు. తద్వారా టికెట్ తనిఖీ సిబ్బంది ప్రత్యక్ష హాజరుతోపాటు లాగిన్, లాగౌట్ వాస్తవ సమయాలు నమోదవుతాయి. బయో మెట్రిక్ సైన్ వినియోగంతో సిబ్బంది, అధికారుల్లో మరింత బాధ్యత పెరుగుతుందన్న ఎస్‌సీఆర్ జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ.. మరింత సమర్థవంతంగా సేవలందించే అవకాశం ఉంటుందన్నారు.

టెట్‌పై రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు యూటీఎఫ్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పైబడిన సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణులు కావాలని.. లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్ల ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న ఎన్‌సీటీఈ నోటిఫికేషన్ ఇచ్చిందని, అప్పటికే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇచ్చిందన్నారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

చివరి దశకు ఆర్‌ఎఫ్‌సీఎల్ మరమ్మతులు

- 11న యూరియా ఉత్పత్తి ప్రారంభం!

కోల్‌సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం మరమ్మతు పనులు చివరి దశకు చేరుకున్నాయి. అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో ఆగస్టు 14న ప్లాంట్ షట్‌డౌన్ అయింది. హెచ్‌టీఆర్ యంత్రం పాడైన కారణంగా బైపాస్ చేసి ఉత్పత్తి చేయడంతో ఒత్తిడి పెరిగి పైప్‌లైన్ లీకైనట్టు తెలుస్తోంది. నిపుణులు అందుబాటులో లేకపోవడంతో మరమ్మతు పనుల్లో జాప్యం ఏర్పడింది. డెన్మార్క్‌కు చెందిన హల్దర్ టాప్స్ ఇంజనీర్ వచ్చిన తరువాత ఎల్‌అండ్‌టీ సిబ్బందిని మరమ్మతు పనులకు కేటాయించారు. యంత్ర సామగ్రిని హైదరాబాద్‌కు పంపించి మరమ్మతు చేయించి ప్లాంట్‌లో బిగిస్తున్నారు. 11న ప్లాంట్‌లో యూరియా ఉత్పత్తి ప్రారంభమవుతుందని అంచనా వేస్తున్నారు. అన్నీ సక్రమంగా జరిగితే 14 నుంచి మార్కెట్‌లోకి ఆర్‌ఎఫ్‌సీఎల్ యూరియా అందుబాటులోకి రానుంది.

30వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి: కృష్ణయ్య

రాంనగర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ, ఆర్. కృష్ణయ్య సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న క్రమంలో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచడానికి టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరముందని లేఖలో రాశారు. టీచర్ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కృష్ణయ్య కోరారు.

సీఎం రేవంత్‌పై బీజేపీ పరువు నష్టం కేసు

- నేడు సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డిపై తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టులో వేసిన పరువు నష్టం పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది. 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కొత్తగూడెం సభలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బీజేపీ ప్రతిష్ఠను దెబ్బతీశాయని ఆరోపిస్తూ ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు గతేడాది హైదరాబాద్ ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని రేవంత్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. దీనిపై కోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్-125 కింద కేసు కొనసాగుతుందని తెలిపింది. దీంతో రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ ప్రసంగాలు అతిశయోక్తులతో ఉండేవేనని, వాటిని పరువు నష్టంగా పరిగణించలేమంటూ ట్రయల్ కోర్టు ఆదేశాలను హైకోర్టు రద్దు చేసింది. అయితే హైకోర్టు తీర్పును బీజేపీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ సోమవారం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.

మంచిరేవులలో 6 వేల ఏళ్ల నాటి ఆనవాళ్లు

- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మంచిరేవులలో ప్రాచీన రాతియుగం నాటి ఆదిమానవుని ఆనవాళ్లు బయటపడ్డాయి. పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి నేతృత్వంలో జరిపిన అన్వేషణలో ఈ ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ ఆనవాళ్లు సుమారు 6 వేల ఏళ్ల క్రితం నాటివని శివనాగిరెడ్డి తెలిపారు. మూసీ నది సమీపంలో ఉన్న వీరభద్రాలయ ప్రాంగణంలోని రాతి పరుపుపై రాతి గొడ్డళ్లకు పదునుపెట్టడానికి ఉపయోగించిన దాదాపు 15 గాడులను (గ్రూవ్స్) పురావస్తు బృందం కనుగొంది. ఈ గాడులు కొత్త రాతి యుగం నాటివని గుర్తించారు. వీటి పొడవు 15 సెంటీమీటర్లు, వెడల్పు 3 సెంటీమీటర్లు, లోతు 2 సెంటీమీటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఆనవాళ్లు ఆదిమానవుల జీవన విధానాన్ని సూచిస్తున్నాయని శివనాగిరెడ్డి తెలిపారు.

సుదర్శన్‌రెడ్డి ఎంపికతోనే ప్రజాస్వామ్యానికి రక్ష

- బీఆర్‌ఎస్, టీడీపీ, వైసీపీలు ఆయనకు ఓటేయాలి
- పౌర సమాజం ప్రతినిధుల వినతి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికలో బీఆర్‌ఎస్, టీడీపీ, వైసీపీలు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేసి రాజ్యాంగాన్ని కాపాడాలని పౌర సమాజం ప్రతినిధులు కోరారు. ఆయనకు సంఘీభావంగా పౌర సమాజ ప్రతినిధులు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సామాజిక వేత్త హరగోపాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన వ్యక్తి కనుక సుదర్శన్ రెడ్డిని వ్యతిరేకిస్తామని కేటీఆర్ అనడం సముచితం కాదన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం పేరుతో మొదలైన టీడీపీ కూడా ఉపరాష్ట్ర పతి ఎన్నికలో తెలుగు వ్యక్తికి మద్దతుగా నిలవాలని కోరారు. కేవలం ఒక వ్యక్తి సూచనతో సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేయలేదని, అది జాతీయస్థాయిలో వచ్చిన ప్రతిపాదన అని కోదండరాం పేర్కొన్నారు. రాజ్యాంగం మీద దాడి జరుగుతున్న ప్రస్తుత సందర్భంలో సుదర్శన్ రెడ్డి లాంటి వ్యక్తులు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించగలదని తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె.శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆయన నక్సలైట్ల సానుభూతిపరుడే అయితే.. ఆయనను గోవా బీజేపీ ప్రభుత్వం మొదటి లోకాయుక్తగా ఎందుకు నియమించిందని ప్రశ్నించారు. సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతిగా గెలిపించాల్సిన బాధ్యత టీడీపీ, బీఆర్‌ఎస్, వైసీపీపై ఉందని సీనియర్ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి అన్నారు. న్యాయ వ్యవస్థ ద్వారా రాజ్యాంగ విలువలను కాపాడిన సుదర్శన్ రెడ్డి ఇప్పుడు చట్టసభల ద్వారా కూడా ఆ కర్తవ్యాన్ని నిర్వర్తించగలరని సీనియర్ ఎడిటర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి రాజకీయ పార్టీలకు అతీతమైన వ్యక్తి అని ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకురాలు వనమాల తెలిపారు.

అల్లావుద్దీన్.. అద్భుతపెట్టె!

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్ అధికారులు పూర్తిచేశారు. దసరా తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రాజెక్టును ఆవిష్కరింపచేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీ-ఫైబర్‌తో ప్రజలకు అందే సౌకర్యాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఇంటింటికీ ఇంటర్‌నెట్..

ఇంటర్‌నెట్, టీవీ చానళ్లు, ఓటీటీలు.. ఈ సేవలన్నింటినీ ఒకే వేదికపై అందించేలా తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ 'టీ-ఫైబర్'ను అందుబాటులోకి తెస్తోంది. రూ.3,500 కోట్ల వ్యయంతో ఈ నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టును మొదటి దశలో గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,751 గ్రామపంచాయతీల పరిధిలో దాదాపు 42 వేల కిలో మీటర్ల మేర భూగర్భంలో ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు వేశారు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టులను తొలుత పట్టణ ప్రాంతాల్లో అందుబాటులోకి తెస్తుంటారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గ్రామీణ ప్రాంతాల్లో మొదటగా ఈ సౌకర్యాన్ని కల్పించాలని సంకల్పించింది. ఈమేరకు.. సాంకేతికంగా సమస్యలున్న కొన్ని గ్రామాలు మినహా అన్ని ప్రాంతాల్లో కేబుళ్లు అందుబాటు లోకి వచ్చాయి. ఇప్పటికే 8 నెలల నుంచి రంగారెడ్డి, నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని ఓ నాలుగు గ్రామాల్లో టీ-ఫైబర్‌ను పైలట్ ప్రాజెక్టుగా అమలుచేస్తున్నారు. అందులో వచ్చిన సమస్యలను పరిష్కరించుకుంటూ వస్తున్నారు. దసరా తర్వాత ప్రాజెక్టును ఆవిష్కరించాక.. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేలపైగా గ్రామాల్లో ఇది అందుబాటులోకి రానుంది. మిగిలిన గ్రామాలకు దశల వారీగా అందించనున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

స్మార్ట్ టీవీలకే కాదు.. పాత మోడల్ సీఆర్‌టీ టీవీలకు కూడా ఈ కనెక్షన్ ఇస్తారు. దీంతో అవి స్మార్ట్ టీవీలుగా మారిపోతాయి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న రెండు, మూడు పెద్ద కంపెనీలు అందిస్తున్న ప్రాథమిక ప్లాన్‌ల ధరల్లోనే.. టి-ఫైబర్ పూర్తిస్థాయి ప్లాన్‌లను అందించనుంది. ఇందులోనూ రెండు, మూడు రకాల ప్యాక్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కనెక్షన్ తీసుకున్నవారికి ఒక సెట్‌టాప్ బాక్స్‌ను అందిస్తారు. దాని ద్వారానే వైఫై వస్తుంది. టీవీ చానల్స్ చూడొచ్చు. ఆ బాక్సుతోనే టీవీ స్మార్ట్‌గా మారుతుంది. టీవీకి వెబ్‌కెమెరాను అనుసంధానించుకుంటే వీడియో కాల్స్ కూడా మాట్లాడుకునే అవకాశం ఉంది. పాఠశాలలకు కూడా దీనిని అనుసంధానిస్తారు.



టీ-ఫైబర్ కనెక్షన్ తీసుకున్న తరువాత టీవీలో కనిపించే ప్రభుత్వ పథకాల వివరాలు

దానిద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాసులను నిర్వహించేందుకు అవకాశం ఉంది. పాఠశాలల్లో పిల్లలకు ఇచ్చిన హోంవర్క్‌ను అందులోనే చేసుకోవచ్చు. అందుకు వీలుగా గూగుల్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ పరిధిలో నడిచే టీ-శాట్ కూడా టీ-ఫైబర్‌తో అనుసంధానమైంది. దాంతో విద్యార్థులు సెలవు రోజుల్లో, పాఠశాలలకు వెళ్లలేకపోయినప్పుడు ఇంట్లో నుంచే టీ-శాట్ ద్వారా పాఠాలు వినొచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి వివరాలు కూడా ఇందులో పొందుపరిచారు. వాటిపై క్లిక్ చేస్తే ఆయా పథకాలకు అర్హులా, కాదా అన్నది కూడా తెలుసుకోవచ్చు. కరెంటు, గ్యాస్ బిల్లులను చెల్లించుకోవచ్చు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోంను సులువుగా దీని ద్వారా నిర్వహించుకోవచ్చు.

ఆన్‌లైన్ సర్వే.. రిమోటే ఫోను..

టి-ఫైబర్ కనెక్షన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే సర్వేలు నిర్వహించే ఏర్పాటుచేశారు. ప్రభుత్వం అమలు చేసే పథకాల గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో పోల్ ద్వారా తెలుసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన ప్రశ్నావళి టీవీల్లో కనబడుతుంది. రిమోట్ ద్వారానే ప్రజలు సర్వేలో పాల్గొనవచ్చు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు గురించి తెలుసుకునేందుకు సీఎం ప్రజలతో మాట్లాడాలనుకున్నా.. అందుకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డాష్‌బోర్డు ద్వారా సీఎం రాష్ట్ర వ్యాప్తంగా టీ-ఫై బర్ వివరాలన్నీ నిత్యం గమనిస్తుంటారు. ఆ డాష్‌బోర్డు నుంచే నేరుగా వీడియోకాల్ ద్వారా పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన మాట్లాడొచ్చు. ఇక టీవీ చానల్స్‌ను మార్చేందుకు వినియోగించే రిమోట్‌ను ఫోన్‌లా వాడుకునేలా కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ రిమోట్‌తోనే.. వైఫై ద్వారా ఎలాంటి చార్జీలు లేకుండా ఫోన్లు మాట్లాడుకోవచ్చు. ఇందుకు సంబంధించిన కొన్ని అనుమతుల కోసం టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియాతో చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే దీనికి ఆమోదం లభించనుందని అధికారులు చెబుతున్నారు. టి-ఫైబర్ కనెక్షన్ కోసం రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబరుతో ఒక టీవీ, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, ఒక ల్యాప్‌టాప్‌లో లాగిన్ అయ్యేలా అవకాశం కల్పించనున్నారు. ప్యాకేజీల వారీగా ఓటీటీలు అందనున్నాయి. కేబుల్ ద్వారా అందించే ఈ కనెక్షన్‌తో ఒక జీబీపీఎస్ వేగంతో ఇంటర్‌నెట్‌ను అందించేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

పీపీపీ విధానంలో అమలు..

టి-ఫైబర్ ప్రాజెక్టును పబ్లిక్-ప్రైవేటు-పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. సెట్‌టాప్ బాక్స్‌ల మరమ్మతులు, సర్వీసు అందించడం, కస్టమర్ కేర్ సర్వీసులను ఈ విధానంలో అందిస్తారు. మరమ్మతులు, ఇతర సర్వీసులను అందించే టెక్నీషియన్ల కొరత నేపథ్యంలో.. గ్రామీణ యువతకే శిక్షణ అందించి ఉపాధి కల్పించాలని ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఇందుకోసం మొదటిదశలో 35వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే టి-ఫైబర్ ప్రాజెక్టు నిర్వహణలో లోకల్ కేబుల్ ఆపరేటర్లకు కూడా అవకాశం కల్పించనున్నారు. లోకల్ కేబుల్ ఆపరేటర్లు గ్రామాల్లో ఇంటింటికీ కేబుల్‌ను వేసేందుకు వీలుగా ఆర్థిక సహాయం కోసం స్త్రీ నిధి నుంచి రుణాలను ఇప్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. టి-ఫైబర్ ప్రాజెక్టుకు ఆదాయం సమకూర్చుకునేందుకు వీలుగా వ్యాపార, వాణిజ్య ప్రకటనలను తీసుకోనుంది. ఇందుకోసం ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించనున్నారు.

12,751	రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీలు
10,787	టి-ఫైబర్‌కు అనుమతి వచ్చిన గ్రామాలు
9,662	కేబుల్స్ వేయడం పూర్తయిన గ్రామాలు
8,895	టి-ఫైబర్‌ను ఆవిష్కరించిన వెంటనే సేవలు అందుబాటులోకి వచ్చే గ్రామాలు
690	అటవీ ప్రభావిత ప్రాంతాలు
రూ. 3,500 కోట్లు	ఈ ప్రాజెక్టుకు అయిన ఖర్చు

ఇప్పటివరకూ ఈ జిల్లాల్లో..

మహబూబ్‌నగర్, జనగామ, హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, గద్వాల, నారాయణపేట, వనపర్తి, వరంగల్ రూరల్, పెద్దపల్లి, జగిత్యాల, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో టి-ఫైబర్ సేవలు అందుబాటులోకి రావడానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. నాగర్‌కర్నూల్, సంగారెడ్డి, సూర్యాపేట, మెదక్, నల్గొండ జిల్లాల్లో కేబుల్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తికానున్నాయి.

ఈ జిల్లాల్లో సమస్యలు..

ఆదిలాబాద్, భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ములుగు జిల్లాల్లో అటవీ అనుమతుల కోసం ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. మేడ్చల్‌మల్కాజ్‌గిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పలు సాంకేతిక సమస్యలతో పనులు ఆగిపోయాయని, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్‌ఎన్‌ఎల్)తో చర్చలు జరుపుతున్నామని అధికారులు చెబుతున్నారు. సమస్యలన్నీ పరిష్కారమైతే ఈ జిల్లాల్లో కూడా కేబుల్‌ను ఏర్పాటుచేయనున్నారు. కాగా 77 చోట్ల గ్రామపంచాయతీ భవనాలు అందుబాటులో లేక కేబుల్ సౌకర్యాన్ని అందించలేదు.

ఫేక్.. ఫేక్!

- రూ.22 వేలు పెడితే 10 లక్షల సంపాదన..!
- కేంద్ర మంత్రి నిర్మల పేరుతో ఏఐ వీడియోలు
- అడ్డంగా దోపిడీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- నిరుద్యోగ భృతి పేరుతో ప్రధాని ఫేక్ సందేశాలు
- దేశవ్యాప్తంగా మోసపోయిన వేల మంది!!
- చర్యలు తీసుకోవడంలో కేంద్ర ఐటీ శాఖ విఫలం?

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): "రూ.22 వేల పెట్టుబడి పెట్టండి.. మీరు లక్షాధికారులైపోతారు. మరుసటి రోజు నుంచే మీకు రోజుకు రూ.64 వేలు వస్తాయి. నెలకు అలా రూ.10 లక్షల వరకు సంపాదించవచ్చు".. ఈ ప్రకటన చేసిందెవరో కాదు..! కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అని నమ్మించేలా సైబర్ కేటుగాళ్లు ఆమె ఏఐ వీడియోను యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో 'పెయిడ్ కంటెంట్'గా సర్క్యులేట్ చేస్తూ.. అమాయకుల పుట్టి ముంచుతున్నారు. ఆ వీడియో పక్కనే పెట్టుబడి ఎంత పెట్టాలి? రోజుకు, నెలకు లాభాలెంత? అనే లెక్కలతోపాటు.. భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) ఆమోదించిందంటూ సైబర్ నేరగాళ్లు యాడ్స్‌ను సృష్టించారు. 10 నెలలుగా ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుండగా.. స్వయానా కేంద్ర ఆర్థిక మంత్రే చెప్పారు కదా? అది నిజమే అయ్యి ఉంటుందని దేశవ్యాప్తంగా వేల మంది రూ.22 వేల చొప్పున చెల్లించి, మోసపోయారు. కేటుగాళ్లు ప్రధాని నరేంద్ర మోదీని కూడా ఏఐ ద్వారా అడ్డంగా వాడేసుకుంటున్నారు. "మా ప్రభుత్వం నిరుద్యోగులకు నెలకు రూ.3,500 చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వబోతోంది. రూ.1,000 చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలు" అని మోదీ అన్నట్లుగా ఉన్న నకిలీ ఆడియో, వీడియోలు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. అలాగే, "మేం త్వరలో రూ.వేల కోట్లతో ఆన్‌లైన్ ప్రాజెక్టు చేపడుతున్నాం. ప్రజలు కూడా తమ స్థాయికి తగ్గట్లు పెట్టుబడులు పెట్టి, భాగస్వాములు కావొచ్చు" అంటూ రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ పేరుతోనూ ఏఐ ఆధారిత వీడియో ఒకటి ప్రచారంలో ఉంది. అంతేనా? ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి, ఆయన భార్య, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సుధామూర్తి చెప్పినట్లుగా కూడా ఏఐ వీడియోలు 'పెయిడ్ కంటెంట్' కింద సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్నాయి. "క్వాంటమ్ ఏఐ, స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టండి.. రోజుకు రూ.2.5 లక్షలు సంపాదించండి" అంటూ ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి చెప్పినట్లుగా ఉన్న వీడియోను నమ్మి, చాలా మంది మోసపోయారు. ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంతదాస్ పేరుతోనూ ఇలా ఏఐ వీడియోలను సైబర్ కేటుగాళ్లు అప్‌లోడ్ చేస్తూ.. అమాయకులను నిలువుదోపిడీ చేస్తున్నారు.



నిర్మలాసీతారామన్ ఏఐ వీడియోతో సైబర్ చీటర్లు చేస్తున్న ప్రచారం..

అనుమానించడం మంచిది

"తక్కువ పెట్టుబడి.. ఎక్కువ మొత్తంలో లాభం" అనే ప్రకటనలు కనిపించిన వెంటనే.. వాటిని అనుమానించాలని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. ఏఐ యుగంలో ఎన్నెన్నో మోసాలు పెరిగాయని గుర్తుచేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే 'పెయిడ్ కంటెంట్' వద్ద 'స్పాన్సర్డ్' అని చిన్నగా ఉంటుందని, అలాంటి వాటిని గుర్తించాలంటున్నారు. సైబర్ నేరగాళ్ల ప్రకటనలు నిజమేనా? అని గూగుల్‌లో నిర్ధారించుకోవచ్చని చెబుతున్నారు.

అడ్డుకట్ట వేసేదెవరు?

సైబర్ నేరగాళ్ల దందాకు అడ్డుకట్ట వేయాలంటే.. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ రంగంలోకి దిగాల్సిందే. ఎందుకంటే.. రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేయడానికి, నేరస్థులు లభిస్తే.. వారి నుంచి స్వాధీనం చేసుకునే మొత్తాన్ని బాధితులకు తిరిగి ఇవ్వడం వరకే పరిమితమవుతారు. ఐటీ సవరణ చట్టం ప్రకారం.. ఈ తరహా మోసాలకు కేంద్ర ఐటీశాఖ మాత్రమే చర్యలు తీసుకోగలదు. దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో బాధితులు మోసపోతున్నా.. సైబర్ నేరగాళ్ల మోసాలపై కేసులు నమోదవుతున్నా.. కేంద్ర ఐటీ శాఖ కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు అంతంతమాత్రమేననే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాలను నియంత్రించే ఆయుధం కేంద్ర ఐటీ శాఖ వద్ద ఉన్నా.. పీఐబీ ద్వారా ఓ ప్రకటనను విడుదల చేయించి, చేతులు దులుపుకొన్నారే తప్ప.. చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.



దిల్‌సే గురువందనం కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకం

- విద్యనే దేశాభివృద్ధికి ప్రాణవాయువు: విశ్రాంత ఐఏఎస్ కె. లక్ష్మీనారాయణ
- లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డీ ఆధ్వర్యంలో గురువందనం

రవీంద్రభారతి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా.. ఉన్నతమైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యమని విశ్రాంత ఐఏఎస్, ఉమ్మడి ఏపీ ఉన్నత విద్యా శాఖ మాజీ కమిషనర్ కె.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు సాంకేతికత ప్రత్యామ్నాయం కాదని చెప్పారు. ఏ దేశమైనా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో పురోగమించడానికి విద్య ప్రాణవాయువుగా నిలుస్తుందని అన్నారు. విద్యా రంగాన్ని మరింత పరిపుష్టం చేసుకునే దిశగా మనమంతా ఆలోచించాలని కోరారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డీ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతి వేదికగా 'దిల్‌సే గురువందనం' పేరుతో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, మోడల్ స్కూళ్లలో సేవలందిస్తున్న 128 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడారు. చదువులు అనగానే ఇంజనీరింగ్, మెడిసిన్ మాత్రమే అనే అభిప్రాయం నుంచి తెలుగు వారు బయటపడాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లల అభిరుచిని గుర్తించి, ఆయా రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాలంలో తరగతి గదికి సాంకేతికత అనుసంధానం కావాలని, ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉండాలని సూచించారు. పుస్తకం చదవడం ద్వారా జ్ఞానాన్ని, సమాజాన్ని అధ్యయనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని, ఆత్మావలోకనం చేసుకోవడం ద్వారా దైవజ్ఞానాన్ని పొందగలమని చెప్పారు. తద్వారా సమాజంలో మన పాత్రను గ్రహించగలమన్నారు. ఈ శతాబ్దానికి తగినట్టుగా ముందుకు సాగాలంటే శాస్త్రీయ ఆలోచన, అభ్యాసన, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం చాలా అవసరమని వివరించారు. ఈ కార్యక్రమానికి సంస్థ జిల్లా కార్యదర్శి ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించగా ఆల్ ఇండియా లయన్స్ కౌన్సిల్ చైర్మన్ బాబూరావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్‌నాథరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జ్యోతి, విజయలక్ష్మి, గంప రమేష్, శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్, జీఆర్ సూర్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన మహిళలు!

- లాభాల బాటలో నారాయణపేట మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్
- ఆరు నెలల్లో రూ. 15.50 లక్షల లాభం

హైదరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఇంట్లో కూర్చుని కుట్లు, అల్లికలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసి కుటుంబాలకి చేదోడు వాదోడుగా నిలిచిన మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. వ్యాపారం ఏదైనా సత్తా చాటుతామని నిరూపిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఓ మహిళా సమాఖ్యకి కేటాయించిన పెట్రోల్ బంక్ ఆరు నెలల్లో రూ.లక్షల్లో లాభాలు ఆర్జించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు సత్తా చాటారు. ఇది నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య సాధించిన అద్భుత విజయం. ఇందిరా మహిళాశక్తి పాలసీలో భాగంగా నారాయణపేట జిల్లా సింగారం క్రాస్‌రోడ్డులో రూ.1.30కోట్లతో పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేశారు. దేశంలోనే తొలిసారిగా దీన్ని నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్యకు కేటాయించారు. ఈ బంక్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. 20 ఏళ్లకు నెలకు రూ.10వేల అద్దె ప్రాతిపదికన మహిళా సమాఖ్య ద్వారా పెట్రోల్ బంక్‌ను నడిపేందుకు బీపీసీఎల్ సంస్థతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఒప్పందం చేసుకుంది. దీని నిర్వహణకు 11మంది మహిళలకు ముందస్తుగా జడ్చర్ల, షాద్‌నగర్‌లోని పెట్రోల్ బంక్‌ల్లో మేనేజర్, సేల్స్‌విమెన్లుగా ప్రభుత్వం శిక్షణ ఇప్పించింది. మొత్తం వ్యయంలో మౌలిక వసతుల కల్పనకు రూ.15లక్షలు ఖర్చు చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పెట్రోల్ బంక్ నిర్వహణను జిల్లా కలెక్టర్ సమీక్షిస్తున్నారు.బంక్‌లో విధులు నిర్వర్తించే 10మంది మహిళలు ఒక్కొక్కరికి రూ.13,200చొప్పున, మహిళా మేనేజర్‌కు రూ.18,000 వంతున వేతనంగా జిల్లా సమాఖ్య చెల్లిస్తోంది. రోజుకు 4 వేల లీటర్ల పెట్రోల్.. 6 వేల లీటర్ల డీజిల్‌ను విక్రయిస్తుండగా.. సిబ్బంది వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోను గత ఆరు నెలల్లో రూ.15.50 లక్షల లాభాలు ఆర్జించినట్టు పెట్రోల్‌బంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రకళ తెలిపారు. మహిళా సమాఖ్య దీన్ని విజయవంతంగా నిర్వహిస్తుండడంతో.. కొత్త బంకుల ఏర్పాటులోనూ మహిళా సంఘాలకు ప్రాధాన్యం ఇస్తామని అధికారులు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.